www.andhrajyothy.com
srikakulam

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16

## శ్రీకాకుళం

గురువారం 17 ఆగస్టు 2017

# విద్యుత్ శాఖకు బకాయిల షాక్

- మేజర్, మైనర్ పంచాయతీలు చెల్లించాల్సినవి రూ.54 కోట్లు
- తెగని పాలకొండ 'పంచాయతీ'
- రెండు శాఖల నడుమ నలుగుతున్న చాపురం పంచాయతీ
- ఆర్థిక సంక్షోభంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ




(శ్రీకాకుళం సిటీ)

ప్రభుత్వ శాఖలు బిల్లుల చెల్లింపులో ఉదాసీనత చూపడంతో విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రజలు సక్రమంగా బిల్లులు చెల్లిస్తున్నా... స్థానిక సంస్థలు మాత్రం పట్టించుకోవడం లేదు. బకాయిలకు నిధుల కొరత చూపుతున్నా... ఇతర పనులకు చెల్లిస్తుండడం గమనార్హం. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడంతో సంబంధిత శాఖలు అపరాధ రుసుం కట్టాల్సి వస్తోంది. ఇవి తడిసిమోపెడవుతున్నాయి. దీంతో ఆ శాఖలు సకాలంలో బిల్లుల ఊసెత్తడం లేదు. ఫలితంగా - మిగతా 14లో

## జిల్లాకు 13 నూతన రెవెన్యూ భవనాలు

- ప్రభుత్వ ఆమోదం

16 లో



మహిళను అదుపులోకి తీసుకుంటూ...

# ఉద్రిక్తం



పాడలిలో మోహరించిన పోలీసులు

- పాడలి వద్ద పనులను అడ్డుకున్న స్థానికులు
- పోలీసులు, నిర్వాసితుల మధ్య వాగ్వాదం
- పరస్పర దాడులు: పలువురికి గాయాలు
- 40 మంది ఆందోళనకారుల అరెస్ట్
- ఆమదాలవలస స్టేషన్‌కు తరలింపు



పోలీసులతో నిర్వాసితుల ఘర్షణ

(హిరమండలం-కొత్తూరు)

ఓవైపు నిర్వాసితులు...మరోవైపు పోలీసులు...పరస్పర వాగ్వాదం... దాడులు... ఇదీ వంశధార నిర్వాసిత గ్రామం పాడలిలో బుధవారం నాటి పరిస్థితి. ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో ఉద్రిక్తతకు...అరెస్టులకు దారి తీసింది. రెండు వర్గాల వారు గాయపడ్డారు. ఎస్పీ త్రివిక్రమ వర్మ రంగంలోకి దిగి సమీక్షించారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఏక్షణాన ఏం జరుగుతుందోనని జనం ఆందోళన చెందుతున్నారు.

14 లో



పోలీసుల దాడిలో గాయపడిన వ్యక్తి



జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం



జలమయమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

## వర్షాతిరేకం

శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు పలాస, పాలకొండ, వీరఘట్టం తదితర ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షాలతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

16 లో

## 'కిలిమంజారో'పై మనోళ్లు..

**వంగర:** మరువాడకు చెందిన గేదెల చిన్నమ్మడు బుధవారం కిలిమంజారో (ఆఫ్రికా ఖండం) పర్వతాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. 10వ తరగతి చదువుతున్న సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నమ్మడు బంధువుల ఇంటిలో ఉండేది. సీతంపేట ఐటీడీఏ సహకారంతో మంచి శిక్షణ పొందింది. ప్రభుత్వం కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించేందుకు ఎంపిక చేసిన బృందంలో చిన్నమ్మడుకు స్థానం కల్పించింది. ఈ నేపథ్యంలో పర్వతారోహణ చేసి యువతకు ఆదర్శంగా నిలిచింది. జిల్లాకు చెందిన మామిడి రమణ కూడా కిలిమంజారో అధిరోహించారు.




కిలిమంజారో అధిరోహించిన బృంద సభ్యులు



ఇచ్ఛాపురంలో బస్సు యాత్రలో పాల్గొన్న బాధితులు

## అగ్రిమీద గుగ్గిలం

అగ్రిగోల్డ్ సంస్థ ద్వారా నష్టపోయిన బాధితులు బస్సు యాత్ర మొదలు పెట్టారు. ఇచ్ఛాపురంలో బుధవారం ఈ యాత్ర ప్రారంభమైంది. అంతకుముందు బహిరంగ సభ ఏర్పాటు చేసి... బాధితుల సమస్యలను ప్రస్తావించారు.

7 లో

## ప్రభుత్వ ఉద్యోగులకు అందుబాటులో..

# సంక్షేమ నిధి రుణాలు

### పిల్లల విద్య, వైద్యం, వివాహానికి ప్రభుత్వం చేయూత



**ఉద్యోగపర్వం**

**(సోంపేట)**

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా పీఆర్‌సీ ప్రక్రియను అమలు చేస్తోంది. సరైన సమయంలో రుణాలు పొందేందుకు ఉద్యోగుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసింది. ఉద్యోగులు హఠాత్తుగా మరణించినా, అనారోగ్యంతో మరణించినా ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ఒకరికి ఉద్యోగం కల్పిస్తోంది. ఇలా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకునేందుకు ముందడుగు వేస్తోంది. వీటిలో ముఖ్యమైనది సంక్షేమనిధి. దీని వల్ల ఉపయోగాలు ఎన్నో. ఈనిధిలో రుణాలు పొందాలంటే ప్రతి నెలా ఉద్యోగుల జీతాల నుంచి కొంత మొత్తాన్ని మినహాయిస్తోంది. సర్వీసులో చేరిన ఉద్యోగులు ఖచ్చితంగా సభ్యులుగా ఉంటారు. తొలిజీతం నుంచి ఖజానా శాఖాధికారులు తగ్గించి సంక్షేమ నిధికి జమ చేస్తారు. తదుపరి ఏడాది నుంచి ప్రతిఏటా జీతం నుంచి రూ.20కోత విధిస్తారు. ఈ నిధికి ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు చందాలు, విరాళాలు అందజేస్తారు. ఉద్యోగుల జీతం కోసం ఉన్న బడ్జెట్‌లో ఐదు శాతం మొత్తాన్ని కేటాయిస్తుంది. ఈ నిధిపై వచ్చే వడ్డీతో ఉద్యోగులకు రుణాలు అందజేస్తారు.

**సాయం పొందడం ఇలా ..**

ఉద్యోగుల పిల్లలు వైద్యం, విద్యా, వివాహం వంటి అవసరాలకు ఈసంక్షేమ నిధి నుంచి సాయం అందిస్తారు. ఈ రుణ సహాయాన్ని బ్యాంకు విధించే సాధారణ వడ్డీతో తిరిగి చెల్లించాలి. వైద్యానికి, పిల్లల విదేశీ చదువులకు లక్ష రూపాయల వరకు రుణాన్ని అందజేస్తారు. వివిధ రిఫరల్ ఆసుపత్రులలో చికిత్సలు పొందేందుకు మెడికల్ ఈయింబర్స్‌మెంట్ అవకాశం ఉన్న ఉద్యోగులకు రూ.10వేలకు మించకుండా మందులు, ఇతర వైద్యానికి రుణం ఇస్తారు. గృహ నిర్మాణం, కొనుగోలు, ఇండ్ల మరమ్మతులకు మాత్రం ఇందులో నుంచి రుణం ఇవ్వరు.

**దరఖాస్తు ఇలా..**

రుణం పొందేందుకు జిల్లా ఖజానా కార్యాలయంలో లభించే దరఖాస్తులను సంబంధిత ఉద్యోగి పూర్తిచేయాలి. పనిచేస్తున్న శాఖాధిపతులు, రాష్ట్ర కమిటీ కన్వీనర్ల పేరుతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి దరఖాస్తు పంపించాలి. వారి స్థాయిలో మంజూరు చేస్తారు. లేదంటే జిల్లా స్థాయి అధికారులకు వారే పంపిస్తారు. అప్పుడు పైస్థాయి నుంచి వచ్చిన సిఫార్సులు ఉన్నందున తప్పకుండా ఆమోదిస్తారు.

# ప్రతి పాఠశాలకూ తాగునీరు

### రూ.13 కోట్లతో తాగునీరు, రన్నింగ్ వాటర్ సౌకర్యం : కలెక్టర్ ధనుంజయరెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ధనుంజయరెడ్డి

**కలెక్టరేట్:** జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యాం కల్పిస్తున్నట్టు కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు, కేజీబీవీలకు తాగునీరు, రన్నింగ్ వాటర్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో తాగునీరు, రన్నింగ్ వాటర్ సదుపాయం లేని పాఠశాలల వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తాగునీటి, రన్నింగ్ వాటర్ సౌకర్యం లేని పాఠశాలకు ఈ సౌకర్యాలు అందించేందుకు రూ.13.5 కోట్లు అవసరమని గుర్తించారు. అందుకు తొలి విడతగా రూ.10 కోట్లతో చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు అదేశించారు. ముందుగా అవసరమున్న పాఠశాలలు గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. ఈ పనులను, బాధ్యతను కార్పొరేట్ సామానిక బాధ్యత కింద జిల్లాలో ఉన్న పారిశ్రామిక వెత్తలకు అప్పగించాల న్నారు. మిగిలిన నిధులు పార్లమెంట్ ప్రత్యేక అభివృద్ధి కింద మంజూరు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ పనులు మూడు నెలల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు అదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీజీలకు తాగునీరు, రన్నింగ్ వాటర్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బి.గోపాలక్రిష్ణ, సర్వశిక్ష అభియాన్ పీవో ఎస్.త్రినాథరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎ.ప్రభాకరరావు కార్యనిర్వహక ఇంజనీర్ పి.సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## వజ్రపుకొత్తూరులో 'కింగ్‌ఫిషర్'



**వజ్రపుకొత్తూరు:** శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి గ్రామంలో కింగ్‌ఫిషర్ పక్షి బుధవారం సాయంత్రం ప్రత్యక్షం కావడంతో అంతా ఆసక్తిగా తిలకించారు. అరుదుగా కనిపించే పక్షుల్లో కింగ్‌ఫిషర్ ఒకటి. జనసంచారం లేని ప్రాంతాల్లో ఈ పక్షులు సంచరిస్తుంటాయి. కాకులు తరుముతూ దాడి చేయడంతో గాయపడిన ఆ పక్షి భయంతో గ్రామానికి చెందిన చీకటి వరలక్ష్మి ఇంట్లోకి ప్రవేశించింది. దానికి చికిత్స చేసి జన సంచారం లేని చోట విడిచిపెట్టామని స్థానికులు తెలిపారు.

## కోర్కెలు తీర్చే తల్లి

# స్వేచ్ఛావతి అమ్మవారు




స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం



భక్తుల పూజలందుకుంటున్న స్వేచ్ఛావతి అమ్మవారు

**ఇచ్ఛాపురం :** భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరజిల్లుంతుంది ఇచ్ఛాపురం గ్రామదేవత ఇలవేల్పు శ్రీస్వేచ్ఛావతి అమ్మవారు. మహిమ గల తల్లిని పూజలు చేస్తే అంతా శుభం జరుగుతుందని భక్తుల నమ్మకం. జిల్లా వాసుల తో పాటు ఒడిశా గ్రామాల నుంచి కూడా భక్తులు భారీగా విచ్చేసి అమ్మవారికి పూజాదికాలు నిర్వహిస్తుంటారు. వీరి ఆదరణతోనే ఆలయాన్ని సుందరీకరించారు. ఈ దేవాలయం స్థల పురాణాన్ని ఒకసారి పరిశీలిస్తే.. శతాబ్దాల కిందట ఓ కుగ్రామంగా ఉండే ఈ ప్రాంతం కరువు కాటకాలతో దుర్భిక్షంగా ఉండేది. దీంతో ఇక్కడి ప్రజలు వలసబాట పట్టారు. ఇంకొంత మంది వ్యవసాయాన్ని నమ్ముకొని ఉండిపోయారు. ఒకరోజు ఒక వ్యక్తి పొలంలో దున్నుతుండగా నాగలికి అమ్మవారి ఆకారంలో ఉన్న విగ్రహం బయటపడింది. అదేరోజు అర్ధరాత్రి అమ్మవారు కుటుంబ పెద్ద కలలో కనిపించి తనకు ఆలయం నిర్మించి నిత్య పూజలు చేస్తే గ్రామంలో ప్రజలు సుఖశాంతులతో ఉండి కరువు కాటకాలు ఉండవని చెప్పినట్టు కథనం ఉంది. అమ్మ వారి గుడిని నిర్మించి మాలి వంశస్థులు అర్చకులుగా మారి పూజలు సాగిస్తూ వస్తున్నారు. నాడు గ్రామాన్ని స్వేచ్ఛాపురం గా నామకరణం చేశారు. కాలక్రమేణా గ్రామం పేరు ఇచ్ఛాపురంగా మారిందని పూర్వీకుల నానుడి. అప్పటి నుంచి ప్రతీ మంగళవారం భక్తులు భారీగా వచ్చి పూజలు చేస్తుంటారు.

అలాగే ప్రతి నెల సంక్రమాణం రోజున గుడిలో భారీగా పూజలు జరుపుతారు. 12ఏళ్లకు ఒక సారి భారీ మొత్తంలో వెచ్చించి అమ్మవారి సంబరాలు జరుపుతారు. 2001లో సంబరాలు జరిపారు. మరల 2012లో సంబరాలు జరిగాయి. ప్రస్తుతం ఆలయాన్ని మరికొన్ని మార్పులతో తీర్చుదిద్దుతున్నారు. దశరా ఉత్సవాల్లో భారీ ఏర్పాట్లు చేస్తారు. భక్తులు కూడా ఆలయ ప్రాంగణలో అఖండ దీపారాధన చేస్తారు.

# అంతా తానై...

### వ్యక్తిగత సహాయకుడికి పెళ్లి చేసిన ఎమ్మెల్యే రమణమూర్తి



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

**నరసన్నపేట:** కన్న కొడుకు కాకపోయినా.. చిన్నతనం నుంచి తన వద్ద పెరిగిన వాడతడు. చేదోడు.. వాదోడుగా ఉంటూ వ్యక్తిగత సహాయకుడిగా సేవలందించాడు. అతడికి ఎవరూ లేరన్న భావన కలగకుండా ఉండేందుకు ఆదరించిన యజమానే కంకణం కట్టుకుని ఆ సహాయకుడి వివాహానికి అన్నీ తానయ్యాడు.. అతడు మరెవరో కాదు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి..

ఎమ్మెల్యే వద్ద పదిహేనేళ్లుగా వ్యక్తిగత సహాయకుడిగా ఉంటున్న దేవాది గ్రామానికి చెందిన రెడ్డి అప్పలనాయుడు వివాహం స్థానిక గ్రామ పంచాయతీ కల్యాణ మండపంలో బుధవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే అంతా తానై తన సొంత కుమారుడుకి వివాహం చేసినట్టు అంగరంగ వైభవంగా జరిపించారు. వివాహానికి తన పేరు మీదనే శుభలేఖను ముద్రించి బంధువులకు ఆహ్వానించారు. ఈ వివాహానికి నియోజవర్గంలో గల నాలుగు మండలాలకు చెందిన అధికారులు, పార్టీ నాయకులు అందరూ పాల్గొన్నారు. చిన్న తనం నుంచే తన వద్ద పెరిగే వ్యక్తిగత సహాయకుడైన అప్పలనాయుడు తన బిడ్డలతో సమానంగా చూసుకుంటూ ఉండటం వల్లనే తాను కంకణం కట్టుకొని వివాహం జరిపించామని ఎమ్మెల్యే దంపతులు రమణమూర్తి, సుగుణమ్మ తెలిపారు. వివాహానికి వచ్చిన వారు కూడా ఎంతో సంతోషించారు.

# వ్యవసాయ విద్యార్థుల నిరసన

## జీవో 64ను రద్దు చేయాలని డిమాండ్



మెయిన్‌గేటు వద్ద బైఠాయించి నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

**శ్రీకాకుళం రూరల్ :** నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం కళాశాల బయట బైఠాయించి నిరసన ప్రదర్శన చేశారు. వ్యవసాయశాఖలో వివిధ ప్రభుత్వ రంగ శాఖల్లో ప్రైవేటు, పక్క రాష్ట్రాల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 64ను రద్దు చేయాలని కోరుతూ ధర్నా చేశారు. సిబ్బంది, అధ్యాపకులు, అసోసియేట్ డీన్‌లను కళాశాలలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. అలాగే కళాశాలలో జరుగుతున్న రెండో సంవత్సరం వ్యవసాయ బీఎస్సీఈ రిజిస్ట్రేషన్‌లను అడ్డుకున్నారు. కళాశాల బయట సాయంత్రం వరకు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జీవో 64 వల్ల ప్రభుత్వ వ్యవసాయ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో నెంబర్ 16 ప్రకారం పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత 15 రోజులుగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలను బుధవారం మరింత ఉధృతం చేశారు. ప్రభుత్వం జీవో 64 రద్దు చేసే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని విద్యార్థులందరూ పాల్గొన్నారు.

# థర్మల్ దీక్షలు దేశానికి ఆదర్శం

## సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్

**వడ్డితాండ్ర (సంతబొమ్మాళి) :** ఈస్ట్‌కోస్ట్ థర్మల్‌కు వ్యతిరేకంగా వడ్డితాండ్ర మత్స్యకారులు చేసిన నిరవధిక నిరాహార దీక్షలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పేర్కొన్నారు. థర్మల్ దీక్షలు ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా వడ్డితాండ్ర దీక్షా శిబిరం వద్ద బుధవారం పునరంకిత సభ నిర్వహించారు. ఎన్నోఏళ్లుగా తమ జీవనం సాగిస్తున్న తంపరలో అక్రమంగా పవర్‌ప్లాంట్ నిర్మించడం వల్ల తమ బతుకులు వీధిన పడతాయని మత్స్యకారులు సాధించిన నిరంతర పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. పవర్‌ప్లాంట్ యాజమాన్యం, రాజకీయ నాయకులు ఎన్ని ఒత్తిళ్లు, ప్రలోభాలు, భయాందోళనలు సృష్టించినా దేనికీ లెక్క చేయని మత్స్యకారుల ధైర్యాన్ని ప్రతి ఒక్కరు మెచ్చుకోవాలన్నారు. ఇటువంటి ఉద్యమ వీరులు దేశానికే ఆదర్శమని చెప్పారు. వీరి ఉద్యమ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో పోరాట స్ఫూర్తి నింపిందన్నారు. థర్మల్ ఉద్యమంలో పోలీసులు ముగ్గుర్ని కాల్చి చంపి ఎంతోమంది అమాయకులపై కేసులు బనాయించి వడ్డితాండ్రలో విధ్వంసం




సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్

సృష్టించినా మత్స్యకారులు సాగించిన పోరాటం ఉద్య మానికే ఊపిరిలూదిందన్నారు. థర్మల్ పవర్‌ప్లాంట్ పనులు రెండేళ్లుగా నిలిచిపోయినా 1108 జీవో రద్దయ్యే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. థర్మల్ వ్యతిరేక పోరాటకమిటీ అధ్యక్షుడు అనంత హన్నూరావు మాట్లాడుతూ మత్స్యకారులను ఎన్నో విధాలుగా భయాందోళనకు పవర్‌ప్లాంట్ యాజమాన్యం, రాజకీయ నాయకులు గురి చేశారన్నారు. అయినా తాము ఎటువంటి భయాం దోళనకు లొంగకుండా ఉద్యమాన్ని కొనసాగించా మని చెప్పారు. పవర్‌ప్లాంట్ ఆగే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. స్వాతంత్ర్యం ముందు నుంచి తంపరను నమ్ముకొని వడ్డితాండ్ర, కోట పాడు, సంతబొమ్మాళికి చెందిన వెయ్యి కండ్రకుల స్తుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. తమ జీవన మనుగడ కోసమే ఉద్యమాన్ని సాగి స్తున్నామని ప్రభుత్వం వెంటనే 1108 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో రద్దయ్యే వరకు మత్స్యకారుల పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు దువ్వాడ శ్రీనివాస్, నంభాళ్ల వెంకట్రావు, కోత ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# జ్వరంతో యువతి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

**సంకిలి(రేగిడి):** మండలం సంకిలి గ్రామానికి చెందిన యువతి రాయపురెడ్డి శ్రీలక్ష్మి (22) జ్వరంతో బాధపడి బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. వారం రోజుల క్రితం ఆమెకు జ్వరం రావడంతో రాజాం కేర్ ఆసుపత్రికి తరలించారు.

పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించగా, మంగళవారం పరిస్థితి విషమించడంతో కిమ్స్ ఆసుపత్రికి మెరుగైన వైద్య కోసం తరలించారు. బుధవారం తెల్లవారు జామున ఆమె మృతి చెందింది. రక్తహీనత వల్ల ఆమె కొన్ని రోజుల నుంచి బాధపడుతోంది. జ్వర తీవ్రత అధికమవడంతో ఆమె మృతిచెందింది. యువతి తండ్రి రాయపురెడ్డి శ్యామసుందరరావు ఉన్నారు. గ్రామం లో వైద్య శిబిరాలు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఇసుక ర్యాంప్‌పై మెరుపు దాడి

## నాలుగు లారీలు, పొక్లయినర్ సీజ్

**నరసన్నపేట:** మండలం పోతయ్యవలస ఇసుక ర్యాంపులో అనాధికారకంగా చేపడుతున్న తవ్వకాలపై అధికారులు బుధవారం మెరుపు దాడులు చేశారు. ఇక్కడ ఉంచిన నాలుగు లారీలు, ఒక పొక్లయినర్‌ను సీజ్ చేశారు. గత కొన్నాళ్లుగా రాత్రి సమయాల్లో ఇసుకను లారీల్లో విశాఖ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో పోలీసులు మఫ్టీలో పహారా కాశారు. అక్రమంగా లోడింగ్ జరుగుచుండటంతో సీఐ పైడిపునాయుడు, తహసీల్దార్ జల్లేపల్లి రామారావు, ఎంపీడీవో విద్యాసాగర్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు.



ఇసుక ర్యాంపులో దాడులు చేస్తున్న అధికారులు


అప్పటికే రెండు లారీల్లో ఇసుక లోడింగ్ చేయగా మరో రెండు లారీలు లోడింగ్‌కు ఉన్నాయి. వీటిని అధికారులు సీజ్ చేశారు.














## అమ్మో... ఎలుగు బంట్లు

**హరిపురం:**మందసమండలంలోని ఉద్దానంతోపాటు హరిపురం, బాలిగాం,అంబుగాం, కొర్రాయిగేటు తదితర వంటి గ్రామాల్లో ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చీకటిపడిన తర్వాత, జన సంచారం లేని సమయంలో ఉద్దానంలో గల తోటల్లో తిరిగే ఎలుగులు, ప్రస్తుతం సాయంత్రం ఐదుగంటలకే గ్రామాలకు వస్తున్నాయని పలువురుచెబుతున్నారు. గ్రామాల్లోని కిరాణ దుఖాణాల్లో తలుపులు తొలగించి నూనె, బెల్లం, స్వీట్లు నాశనం చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. తక్షణమే అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల సంచారానికి అడ్డుకట్టు వేసి ప్రజలను ఆదుకోవాలని పీఏసీఎస్ డైరక్టర్ మండల లచ్చయ్య, జుటియా హరికృష్ణ, తిరుపతిరావు, ఢిల్లేశ్వరరావు తదితరులు కోరుతున్నారు.

# నేటి తరానికి లచ్చన్న మార్గదర్శకుడు

- పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ
- ఘనంగా జయంత్యుత్సవం

**హరిపురం:**బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, నేటి తరానికి మార్గనిర్దేశికుడు సర్దార్ గౌతు లచ్చన్న అని పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ తెలిపారు. మందస మండలంలోని హరిపురం, మందసలో సర్దార్ స్వాతంత్ర సమరయోధుడు గౌతు లచ్చన్న 108వ జయంత్యుత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హరిపురం టీడీపీ పట్టణా ధ్యక్షుడు కనగల జగ్గారావు, దేవరశెట్టి మార్కండేయులు ఆధ్వర్యంలో హరిపురం, మందసలోని గౌతు లచ్చన్న, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలోఎంపీడీవో చంద్రకుమారి,తహసీల్దార్ శ్యామసుందరరావు, ఎంఈవో సీహెచ్.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ బి.రాజేశ్వరరావు, జడ్పీటీసీ సవరకుమారి లఖ్యా, టీడీపీ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దాసరి తాతారావు,రట్టి లింగరాజు, వారణాశి అన్నాజీరావు, ఆసుపత్రి కమిటీ అధ్యక్షులు డొంకూరు తిరుపతిరావు, పుల్లా వాసు, డొంకూరు త్రివేణి, ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు బమ్మిడి కర్రయ్య, జుత్తు అమ్మినాయుడు, ఇప్పిలి వెంకటేశ్వరరావు, సాలిన మాధవరావు, జుత్తు చిరంజీవులు, సాలిన భీమారావు, సార దూర్వాసులు,అగ్గున్న జగన్నాయకులు, వైఎస్ఎన్మూర్తి, ఇప్పిలి రాఘవరావు, మండల లచ్చయ్య, కోనారి తులసీరావు, మురళీ చౌదరి, క్రాంతి కుమార్, ఎస్.చంద్రశేఖర్, బి.తిరుపతిరావు, జుటియా హరికృష్ణ, లబ్బరుద్రయ్య పాల్గొన్నారు.

**మందస:**లచ్చన్న ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడని ఎమ్మెల్యే శివాజీ అన్నారు. జయంతి పురస్కరించుకొని మందస బస్టాండు ఆవరణలో గల సర్దార్ గౌతు లచ్చన్న, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

### లచ్చన్న విగ్రహావిష్కరణ

**రెయ్యిపాడు(పూండి):**రెయ్యిపాడులో బొర్రకామరాజు,గున్నయ్య మాస్టార్లు నిర్మించినలచ్చన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే శివాజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ కార్యదర్శి డాక్టర్ దున్న కృష్ణారావు, కంబాల దానేసు, గుల్ల చిన్నారావు, తిమ్మల కృష్ణారావు, ఎంపీటీసీ కంబాల షణ్ముఖరావు, కొర్రాయి గోపి, బత్తిన భాస్కరరావు, మండ టీడీపీ అధ్యక్షుడు గోవిందుపాపారావు, విగ్రహదాతలు బొర్ర కామరాజు, బొర్ర గున్నయ్య పాల్గొన్నారు.



హరిపురంలో లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శివాజీ

### లచ్చన్న ఆశయాలు కొనసాగిద్దాం

**పలాస:** లచ్చన్న ఆశయాలు కొనసాగించాలని ఎమ్మెల్యే గౌతు శివాజీ పిలుపునిచ్చారు.పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో టీడీపీ నాయకులు గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు.ఈ సందర్భంగా కేటీరోడ్డులోగల లచ్చన్న విగ్రహానికి శివాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ సీతారామాలయంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్ రావు,టీడీపీ పట్టణాధ్యక్షుడు లొడగల కామేశ్వరరావుయాదవ్, వైస్‌చైర్మన్ గురిటి సూర్యనారాయణ, కౌన్సిలర్లు కొవ్వూరు సురేష్‌కుమార్, సవర రాంబాబు, ఎం.కృష్ణారావు, కోఆప్షన్ సభ్యులు ఎ.కృష్ణమూర్తి, కె.భానుమూర్తి, టీడీపీ నాయకులు దుర్గాప్రసాద్‌పాత్రో, కె.శంకరరావు, తమ్మినాన గంగారాం, దట్టి లింగరాజు, కోనేరు ఆదినారాయణరావు, పుట్టా లోకనాథం, శాసనపురి రమేష్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

## సాఫ్ట్‌బాల్ పోటీల్లో మందస విద్యార్థుల ప్రతిభ

**మందస:** నెల్లూరు జిల్లా బీఎస్టీ స్టేడియంలో ఈనెల ఎనిమిది నుంచి పదోతేదీ వరకూ నిర్వహించిన ఏడో మినీ సబ్‌జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజిత పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయులు ఎం.బాబూరావు తెలిపారు. ఏడోతరగతి విద్యార్థినులు లావేటి లిఖిత అండర్-12 విభాగంలో, వడమంచి ప్రతీక్ష అండర్-10 విభాగంలో, ఎనిమిదో తరగతి విద్యార్థిని తరుణికార్జి అండర్-10 విభాగంలో స్వర్ణపతకాలు సాధించారు.విజయానికి కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయులు కేఆర్ చౌదరి, రవికుమార్‌మహంతిలకు హెచ్ఎం ఎం.భాస్కరరావు, ఎల్.సాంబమూర్తి అభినందించారు.

## నేడు రెవెన్యూ గ్రామసభలు

**మందస:**మందవూరు, టొబూరు, హంసరాలి, బాహడపల్లి, సరియాపల్లిల్లో గురువారం రైతు సేవలో రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహించనున్నట్లుతహసీల్దార్ పీవీ.శ్యామసుందరరావు తెలిపారు.

## జింక్ పంపిణీకి సిద్ధం

**వజ్రపుకొత్తూరు:**జింక్ కోసం రైతులు తమ ఆధార్‌కార్డులతో వ్యవసాయశాఖ కార్యాలయానికి హాజరుకావాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి ధనుంజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం పది టన్నుల జింక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులు మార్గదర్శకంగా ఉండాలి

**ధర్మపురం(వజ్రపుకొత్తూరు):**ఉపాధ్యాయులు మార్గదర్శకంగా ఉండి విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలని ధర్మపురం ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని సీతామహాలక్ష్మి తెలిపారు. పాఠశాలలో పనిచేస్తూ బదిలీపైవెళ్లిన జి.దీవెనకుమారి, జి. వాణికుమారి,జి.భానుమతిలను బుధవారం పాఠశాలకమిటీ చైర్మన్ దానయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసబాబ్జి, యతిరాజ్, ఆనందరావు, విజయలక్ష్మి, కెజయరామ్ పాల్గొన్నారు.

## అధ్వానంగా చినవంక శ్మశానం రోడ్డు



పిచ్చిమొక్కలతో ఉన్న చినవంక శ్మశాన రహదారి

**చినవంక (వజ్రపుకొత్తూరు):**చినవంక నుంచి శ్మశానానికి వెళ్లే రహదారి పొడవున పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా మారడంతో నడిచి వెళ్లేందుకు అవస్థలు తప్పడంలేదని పలువురు వాపోతున్నారు. గ్రామం నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల పొడ వునఉన్న రహదారిని ఉపాధిహామీ పథకం ద్వారా గ్రావెల్ రోడ్డుగా నిర్మించాలని అధికారులను పలుసార్లు కోరుతున్నా ఫలితం ఉండడం లేదని చెబుతున్నారు.గ్రామంలో ఎవరైనా మృతిచెందితే శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారి పొడవునా ఇబ్బందిపడుతున్నామని తెలిపారు. పిచ్చిమొక్కల్లో విషజంతువులు సంచరిస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

### అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా



చినవంక శ్మశాన రహదారి విషయంపై అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఫలితంలేదు. గ్రామంలో జరిగిన జన్మభూమితోపాటు ఇతర సభల్లోను వినతిపత్రం అందించినా రహదారికి పరిష్కారం చూపడంలో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది.

**-సానకృష్ణ, మాజీ సర్పంచ్, చినవంక**

## నీట మునిగిన పైరు



సీతాపురంలో చెరువు తలపిస్తున్న పొలం

**వజ్రపుకొతూరు:** మండలంలో వారంరోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ఇటీవల నాట్లువేసిన వరి పైరు నీట మునుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారంరోజులుగా ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండడంతో ఇటీవల నాట్లువేసిన పొలాల్లో నీరు చేరుతోంది.బెండిగెడ్డ పొంగిపొర్లుతుండడంతో సీతాపురం, బొడ్డపాడు గ్రామాలకు చెందిన 20 ఎకరాల పైరు నీట మునిగినట్లు రైతులు చెబుతున్నారు. నగరంపల్లి,బెండి, రిట్టపాడు గ్రామ పంట పొల్లాలో నీరు నిల్వ ఉండడంతో పైరు కుళ్లిపోతున్నట్లు రైతులు చెబుతున్నారు.



సీతాపురం సమీపంలో నీట మునిగిన వరి పైరు

### జంగిల్ క్లియరెన్స్ చేయక...

# పొంచిఉన్న ప్రమాదం

- ఎదురు వచ్చే వాహనాలు కనిపించని దుస్థితి
- ఆర్అండ్‌బీ రోడ్లపై పెరిగిన తుప్పలు



చినవంక-రిట్టపాడు రోడ్డుకు ఇరువైపులా ముందుకు వచ్చిన చెట్టుకొమ్మలు

**వజ్రపుకొత్తూరు:** ఆర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా తుప్పలు పెరగడంతోపాటు, చెట్లకొమ్మలు ముందుకు రావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకూ గుర్తించకపోవడంతో ప్రమాదం పొంచిఉంది. నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నా కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటుచేసేందుకు అధికారులుచర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కుపల్లి-మెట్టూరు, పూండి-అమలపడు, చినవంక-రిట్టపాడు, దేవునల్తాడ జంక్షన్-దేవునల్తాడ, పాతటెక్కలి-రామకృష్ణాపురం, పొల్లాడ-కొత్తపేట, పల్లివూరుజంక్షన్-మంచినీళ్లపేట, గురుడభద్రజంక్షన్-తర్లాగడూరు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఇదే దుస్థితి నెలకుంటోంది.ఏటా వర్షాకాలంలో తుప్పలు, చెట్లకొమ్మలు పెరిగి రోడ్డు మలుపుల వద్ద ముందుకురావడంతో ప్రమాదాలుజరుగుతున్నాయని పలువురు వాహనచోద కులు చెబుతున్నారు. ప్రధానంగా వాహనాలు గుర్తించకపోవడంతోపాటు విషసర్పాలు రోడ్లపైనే సంచరిస్తుండడంతో వాటిని తప్పించబోయి వాహనచోదకులు పల్టీలు కొట్టి గాయపడుతున్నారు. చీకటిపడిన తర్వాత ఎలుగుబంట్లు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న తుప్పల్లో మకాం వేసి దాడి చేస్తున్నా యని వాహనచోదకులు వాపోతున్నారు. తక్షణమే రోడ్డుకు ఇరువైపుల, ముందుకు వచ్చిన చెట్టు కొమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



అక్కుపల్లి-మెట్టురు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

### తుప్పలు ముందుకురావడంతో..



రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, చెట్టుకొమ్మలు ముందుకు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టాలి.

**-నెయ్యిల సూర్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు, వజ్రపుకొత్తూరు**

### వాహనాలు గుర్తించలేకపోతున్నాం



రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ సకాలంలో చేయకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు గుర్తించలేకపోతున్నాం. రాత్రివేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది.

**-బగాది గణేష్, గుల్లలపాడు**

## తహసీల్దార్‌కు సన్మానం



శాసనం(పలాస):పలాస తహసీల్దార్ కళ్యాణచక్రవర్తికి స్వాతంత్ర్యదినోత్సవం పురస్కరించుకొని అవార్డుఅందుకోవడంతో బుధవారం రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.పాపారావు, ఆర్ఐలు వి.గిరిరాజు, శ్రావణ్‌తోపాటు ఉద్యోగులు, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

కళ్యాణచక్రవర్తిని సన్మానిస్తున్న ఉద్యోగులు

# రోడ్లపై చెత్త..కాలువల్లో మురుగు

- నీరుగారుతున్న పారిశుధ్య నిర్వహణ
- పొంచిఉన్న వ్యాధుల ముప్పు
- చోద్యంచూస్తున్న మున్సిపల్ అధికారులు

పలాస:పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణ నీరుగారుతోంది. ప్రధానంగా రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో పాటు కాలువల్లో మురుగునీరు నిల్వఉండడంతో దోమలు స్వైరవిహారంచేస్తున్నాయి. దీంతో వ్యాధుల ముప్పు పొంచిఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. 25 వార్డులోనూ డ్రైనేజీలు అస్తవ్యస్తంగాఉండడంతో రోడ్లపైకి మురుగు నీరు చేరుతోంది. ప్రధానంగా రోజుల తరబడి కాలువల్లో చెత్త తొలగించకపో వడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండడం వల్ల కుళ్లిదుర్వాసన వెలువడుతోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో మురుగు నీరు, చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లాలని పలువురు కోరుతున్నారు.

**జంటపట్టణాల్లో...**

జంటపట్టణాల్లోని రోటరీనగర్, శివాజీనగర్, సూదికొండ, పద్మనాభపురం, న్యూకాలనీ, కేటీరోడ్డు, పాత జాతీయరహదారిలో గల కాలువల్లో చెత్త తొలగించపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లన దుస్థితి నెలకొంది. రోజుల తరబడి నిల్వఉండడంతో పాటు ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు విజృంభిస్తాయోమోనని ఆందోళన వ్యక్తమవుతున్నా మున్సిపల్ అధికారులు చోద్యంచూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



సూదికొండ వీధి కాలువల్లో చెత్త

## షటిల్ క్రీడాకారులకు అభినందన

పలాస: డివిజన్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఎ.వెంకట్రావు, శ్రీకాంత్, కె.రమేష్, ఎ.మన్మధరావులకు మల్లిస్పోర్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం అభినందించారు. రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మల్లేశ్వరరావు, పి.చిరంజీవి, ఎస్.చంటి, చల్లారమేష్ పాల్గొన్నారు.

## పాము కాటుతో విద్యార్థి అస్వస్థత

సరియాపల్లి(హరిపురం):మందస మండలంలోని సరియాపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిబాహాడపల్లి జీవన్‌రావు బుధవారం పాముకాటువేయడంతో అస్వస్థకు గురయ్యాడు. తోటలో బహిర్భుమికి వెళ్తుండగా పాముకాటు వేసిందని తల్లిదండ్రులు తెలిపారు. బాధితుడ్ని హరిపురం ఆసుపత్రికి తరలించగా,ప్రథమచికిత్స చేసి పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## శతశాతం సరుకులు పంపిణీ చేయండి

వజ్రపుకొత్తూరు: శతశాతం సరుకులు లబ్ధిదారులకు పంపిణీచేసేందుకు డీలర్లు చొరవ తీసుకోవాలని తహసీల్దార్ ఎస్.రమణయ్య తెలిపారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డిపో డీలర్లతో తహసీల్దార్‌సమీక్షించారు. ఈసందర్భంగా 15 లోగా సరుకులు పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు.సమావేశంలో ఆర్ఐలు రామకృష్ణ, కిరణ్‌కుమార్, డీలర్ల సంఘ ప్రతినిధులు తవిటయ్య, కా మేశ్వరరావు, ప్రభాకరరావు, సొర్ర అప్పారావు పాల్గొన్నారు.

## సినిమాలు

**పలాస- కాశీబుగ్గ**

హరిశంకర్--ఫిదా
రవిశంకర్-నక్షత్రం
భాస్కరరామ-
జయజానకి నాయక
శ్రీవెంకటేశ్వర-
నేనే రాజు నేనే మంత్రి
అన్నపూర్ణ-లై

# అగ్రిగోల్డ్ దొంగలను అరెస్టు చేయండి

## పలాస చేరుకున్న చైతన్యయాత్ర

పలాస:అగ్రిగోల్డ్ దొంగలను వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్రవ్యాప్త చైతన్యయాత్ర బుధవారం సాయంత్రం పలాసకు చేరుకొంది.ఈ సందర్భంగా బాధితులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.1180 కోట్ల అడ్వాన్స్‌గా ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేసినా నేటికీ అగ్రిగోల్డ్ బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తంచేశారు. రూ.1000 కోట్లకుపైగా ఆస్తులు విక్రయించమని, డిపాజిటర్ల భద్రత చట్టాన్ని చేయాలని ఈ ఏడాది మార్చి ఆరో తేదీ నుంచి దీక్షలు చేపట్టినా ఇంతవరకూ ఫలితం లేదని ఆరోపించారు. 2015 జనవరి నాలుగో తేదీ తర్వాత ఆత్మహత్యలు, అసహజ మరణాలు జరిగినా, అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తామని ప్రకటించినా నేటికీ వారికి అందలేదని తెలిపారు.అగ్రిగోల్డ్ కంపెనీ డైరెక్టర్లను నేటికీ అరెస్టు చేయకపోవడం ప్రభుత్వం వారిపై ఉదాసీనత కనిపిస్తోందని ఆరోపిచారు. రాష్ట్రంలో సుమారు 20లక్షల మంది డిపాజిట్‌దారులు ఉండగా, 142మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా ప్రజామండలి రాష్ట్ర అధ్యక్షుడు ఘని ఆలపించిన బాధిత గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి వి.తిరుపతిరావు, బీవీ చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, ఈవీ నాయుడు, చాపర సుందరలాల్, రామ్మూర్తి, చాపర వెంకటరమణ, బొడ్డపాడు ఎంపీటీసీ సభ్యులు మద్దిల రామారావుతో పాటు అగ్రీగోల్డ్ బాధితులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



గీతాలను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ఘనీ

## వరద నీటి సమస్య పరిష్కరిస్తాం

### మున్సిపల్ చైర్మన్ పూర్ణచంద్రరావు

సూదికొండకాలనీ(పలాస):సూదికొండకాలనీలో వరదనీటి సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొండపై నీరంతా కాలనీవైపు వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ఆయన దృష్టికి రావడంతో బుధవారం సూదికొండను పరిశీలించారు. వరదనీరు కాలనీవైపు రాకుండా ఎక్సకవేటర్‌తో తాత్కాలికంగా నీటిని మళ్లించారు. శాశ్వతంగా కాలువ నిర్మించి వరదనీటి సమస్యను పరిష్కస్తామని తెలిపారు. ఆయన వెంట బల్ల శ్రీను, బల్లయ్య, లక్ష్మణ్,వల్లభ ఉన్నారు.



కాలువ పరిశీలిస్తున్న పూర్ణచంద్రరావు

## 'స్వచ్ఛభారత్' లక్ష్యసాధనకు కృషి

రైల్వేకాలనీ(పలాస):స్వచ్ఛభారత్ లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తామని రైల్వే ఉద్యోగులు స్పష్టం చేశారు. రైల్వేశాఖ ఆదేశాల్లో భాగంగా బుధవారం ఉద్యోగుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జంటపట్టణాల్లో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఓసీ దిలీప్‌కుమార్, ఐఓడబ్ల్యూ సురేష్‌కుమార్, ప్రజారోగ్యశాఖ అధికారి విష్ణుప్రసాద్ మాట్లాడుతూఈనెల 31వ తేదీ వరకు రైల్వేశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. తొలిరోజు ప్రజలకు స్వచ్ఛభారత్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం, రైలులో పరిశుభ్రత, ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్నరైల్వే ఉద్యోగులు

## నేడు మత్స్యకారులకు బోట్లు పంపిణీ

వజ్రపుకొత్తూరు:మండలంలోని కంబాలరాయుడుపేట మత్స్యకారులకు సబ్సిడీ బోట్లు ఎమ్మెల్యే శివాజీ గురువారం పంపిణీచేయనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గోవిందుపాపారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఒడిశా

## ఇళ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**పర్లాకిమిడి:** కాశీనగర్ సమితిలో ఇందిరా ఆవాస్ యోజన పథకంలో సకాలంలో ఇళ్లు పూర్తిచేసిన తొమ్మిది మంది లబ్ధిదారులకు మరో రూ.20వేలు అదనపు చెక్కులు బుధవారం అందజేసినట్లు సమితి అధ్యక్షుడు సీహెచ్‌సింహాద్రి తెలిపారు. సీఎంఆదేశాల మేరకు మన ఒడిశా- స్వచ్ఛఒడిశాగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధికారులతో ప్రమాణం చేయించినట్లు చెప్పారు. కాగా గౌరితాళసింగి ఉన్నతపాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

## మంత్రి దృష్టికి కాశీనగర్ సమస్యలు


మంత్రితో మాట్లాడుతున్న కాశీనగర్‌సమితి అధ్యక్షుడు

**పర్లాకిమిడి:** కాశీనగర్ సమితిలో గల పలు సమస్యలపై రాష్ట్ర ఎస్సీఎస్టీ సంక్షేమ మంత్రి రమేష్‌చంద్ర దృష్టికి తీసుకువెళ్లినట్లు సమితి అధ్యక్షుడు సీహెచ్. సింహాద్రి తెలిపారు. భువనేశ్వర్‌లో అధికారులతో చర్చించి చర్యలు చేపడతానని మంత్రి హామీఇచ్చారని చెప్పారు.

# విపత్తులు ఎదుర్కొనేందుకు సన్నద్ధం

### తీరంలో సైరన్ టవర్ల ఏర్పాటు

**పర్లాకిమిడి:** బంగాళాఖాతం ప్రతిఏడాది సంభవిస్తున్న తుపాన్లు, వివిధ రకాల విపత్తులు ఎదుర్కొవడానికి ఒడిశా ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఒడిశాతీరం ఆటుపోటు కేంద్రంగా మారిన విషయం విదితమే. తీరప్రాంతంలోని గ్రామాలకు సునామీ, తుఫాన్లతో ప్రమాదం పొంచి ఉన్న విషయం విదితమే. ఇటువంటి విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 480 కిలోమీటర్ల తీరప్రాంతంలో మొదటిదశగా పూరి, గంజాం జిల్లాలో సైరన్ టవర్ల ఏర్పాటుకు ఒడిశా స్టేట్‌డిజాస్టర్ మిటిగేషన్ అథారిటీ(ఓఎస్‌డీఎంఏ) లక్ష్యంగా పెట్టుకుంది. దీనిపై ఓఎస్‌డీఎంఏ సంచాలకుడు పీకెమహాపాత్రో 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ విపత్తులను సమర్థంగా ఎదుర్కొవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సంస్థ ఇటీవల కాలంలో విపత్తుల నివారణ దిశగా అనేక కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా తీరప్రాంత ప్రజలను విపత్తుల సమయంలో అప్రమత్తం చేయడానికి సైరన్ టవర్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పూరీ, గంజాం, జగత్సింగ్‌పూర్, కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్ తీరప్రాంత జిల్లాలో 122 సైరన్ టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని,ఇందుకోసం రూ.80 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రపంచబ్యాంకు ఇటీవలే నిధులు విడుదల చేసిందని చెప్పారు


వీఎన్ఎస్‌రాజును పరామర్శిస్తున్న మంత్రి రమేష్‌చంద్ర

## మంత్రి పరామర్శ

**పర్లాకిమిడి:** ప్రముఖ సంఘసేవకురాలు అనుసూయమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుమారుడు వీఎన్ఎస్.రాజును ఎస్సీ, ఎస్టీశాఖ మంత్రి రమేష్‌చంద్ర పరామర్శించారు. అనుసూయమ్మ పట్టణ రోటరీ సంఘ అధ్యక్షురాలుగా, సంఘసేవకురాలుగా గుర్తింపు పొందారు.

## రాయగడలో ఎన్ఎస్ఎస్ శిబిరం

**పర్లాకిమిడి:** రాయగడ సమితి పరశురామ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రధాన ఆచార్యుడు రఘునాథ్ పండా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాంఅధికారి శశికాంత్ మహాపాత్రో ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో రాయగడలో ఆరుబయట మలవిసర్జన నివారణ, స్వచ్ఛభారత్‌పై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రాయగడ బీడీవో నృసింహశరణ్ శెట్టి, ఐఐసీ గోపినాథప్రధాన్, రాయగడ వైద్యకేంద్రం అధికారి దినేష్‌కుమార్ పాల్గొన్నారు.


స్వచ్ఛభారత్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## జోరుగా చోడినాట్లు

**పర్లాకిమిడి:** గుమ్మా సమితి పరసంబ తదితర గ్రామాల్లో రైతులు జోరుగా చోడినాట్లువేస్తున్నారు. ఒక పక్క వరి, మరో పక్క చోడి నాట్లతో వేతలో రైతులు నిమగ్నమయ్యారు. సమితిలో గిరిజనులకు వరితోపాటు చోడి కూడా ముఖ్యపంటగా పండిస్తున్నారు. ఒడిశాలో అధిక శాతం చోడితో అంబలికి ప్రాధాన్యం ఇస్తున్నారు.


చోడి నారు తీస్తున్న రైతులు

## ఏడో మైలులో చెత్తతో అవస్థలు



**పర్లాకిమిడి:** గుసాని సమితి పరిధిలో గల ఏడో మైలు వద్ద చెత్త పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. ఇక్కడ చేయవద్దని స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అధికారులు అవగాహన కలిగిస్తున్నా మార్పు రావడం లేదని పలువురు వాపోతున్నారు. రోడ్డకు ఇరువైపులా చెత్త నిల్వఉండడం వల్ల వాహనచోదకులు, పాదచారులు దుర్వాసనతో అవస్థలుపడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఏడో మైలు వద్ద పేరుకుపోతున్న చెత్త

## నిర్వాసిత కాలనీల్లో వసతులు కల్పించండి

● అధికారులకు కలెక్టర్ ధనుంజయరెడ్డి ఆదేశం

**కలెక్టరేట్:** వంశధార నిర్వాసిత కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ ధనుంజయరెడ్డి ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, గ్రామీణ తాగునీటి సరఫరా తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధారనిర్వాసితకాలనీల్లో తాగునీరు,విద్యుత్, రోడ్ల నిర్మాణం తదితర పను లు త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. కాలనీల నిర్వా సితుల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు తీవ్రంగా ఉంటా యని హెచ్చరించారు. నిర్వాసితకాలనీల్లో అంగన్‌వాడీ, పంచాయతీ, పాఠశాలలు తదితర భవనాల నిర్మా ణానికి ప్రతిపాదనలు తక్షణమే తనకు పంపించాలని ఆదేశించారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ధనుంజయరెడ్డి

## వంశధార బాధితులపై ఉక్కుపాదం మోపడం సరికాదు

● నిర్వాసితులకు అండగా నిలుస్తాం ● సీపీఎం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

**పలాస:** వంశధార నిర్వాసితులు న్యాయంగా చేస్తున్న పోరాటంపై పోలీసులు ఉక్కుపాదం మోపడంసరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం పలాసలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పంటలను దౌర్జన్యంగా ధ్వంసం చేస్తోందని, దీనిని అడ్డుకుంటున్న ప్రజలను రక్తం పారేలా కొట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా, గృహాలు నిర్మించకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలోకి తొక్కి, అడ్డగోలుగా జీవోలు తెచ్చి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. నిర్వాసితులపై యుద్ధం ప్రకటించడంతో ఆ ప్రాంతంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, ఇటువంటి రాక్షస చర్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.వంశధార నిర్వాసితులకు అండగా నిలుస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణమూర్తి

# అన్నదాత దోపిడీ

● కిరోసిన్‌కు అగచాట్లు ● రూ.80కు చేరిన లీటరు ● అరకొర వర్షాలతో అవస్థలు ● ఆందోళనచెందుతున్న మెట్ట రైతులు

**టెక్కలి:** కిరోసిన్ వ్యాపారులు అన్నదాతను దోపిడీ చేస్తున్నారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు అగచాట్లు తప్పడంలేదు. ఈ ఏడాది వర్షాలు అనుకున్నంత లేకపోవడంతో నారు, వేసిన నాట్లు రక్షించుకోవడానికి రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఉభాలు వేసేందుకు సమయం మించిపోతున్నా, తగినంత వర్షపాతం లేకపోవడంతో అన్నదాత ఆకాశం వైపు ఎదురుచూసి విసుగుచెందాడు. గత్యంతరంలేని పరిస్థితుల్లో మెట్టప్రాంతంలో ఉభాలు పూర్తిచేసేందుకు కిరోసిన్ ఇంజిన్లను ఉపయోగిస్తున్నారు.ఈ నేపథ్యంలో కిరోసిన్ లీటరు 80రూపాయలకు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొరగా వర్షాలు కురవడంతోకిరోసిన్ ఇంజిన్లతో ఉభాలు వేసేందుకు రైతులు దృష్టి సారించారు.గతంలో చౌకధరల దుకాణాల ద్వారా లీటరు కిరోసిన్ రూ.18కి పంపిణీ జరిగేది. ప్రస్తుతం చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా నిలిపివేయడంతో కిరోసిన్ కోసం పట్టణాలు, కిరోసిన్ వ్యాపారుల వద్ద రైతులు పరుగులు పెడుతున్నారు. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని వ్యాపారులు ఏకంగా లీటరు 80 రూపాయలకు పెంచి విక్రయిస్తున్నారు. టెక్కలి తదితర ప్రాంతాల్లో కొనుగోలుకు కిరోసిన్ బంకులు లేకపోవడం, ఇదే ఆసరాగా చేసుకొని వ్యాపారులు ధర అమాంతంగా పెంచేశారు.

### ఇంజన్లు సరఫరా చేసి...

ఓ పక్క ప్రభుత్వమే కిరోసిన్ ఇంజన్లను సైతం రైతులకు అందజేసి ఇప్పుడు కిరోసిన్ లేకుండా చేయడం వారంతా ఆందోళనచెందుతున్నారు. తేలికపాటిగా ఉండి, ఎక్కడికైనా తీసుకువెళ్లడానికి అనువుగా ఉండడంతో కిరోసిన్ ఇంజిన్లను ఎక్కువగా విని యోగిస్తున్నారు. డీజిల్‌తో నడిచే ఇంజిన్లు బరువు ఉండడం, మోసేందుకు వీలులేని పరిస్థితులు నేపథ్యంలో ఇక్కడి రైతులు కిరోసిన్ ఇంజన్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

### కర్మాటకంలోనే ఉభాలు వేయాలని...

పూర్తిస్థాయి వర్షాలు కురవకపోయినా, కర్మాటకంలోనే ఉభాలు చేయాలన్న తలంపుతో కిరోసిన్ ఇంజిన్లు వినియోగిస్తున్నారు. గతంలో ప్రతి ఇంట్లో లీటరో, రెండు లీటర్లో కిరోసిన్ ఉండేది. దీపం కనెక్షన్లు పుణ్యమాని సరఫరా నిలిపివేయడంతో రైతులు వ్యాపారుల నుంచి అధిక ధరకు కొనుగోలు చేయాల్సివస్తోంది. కిరోసిన్ సరఫరాచేసి ఆదుకోవాలని మెట్టప్రాంత రైతులు కోరుతున్నారు.

## ఎంపీఈవో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కలెక్టరేట్:** ఉద్యానవనశాఖలో బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు(ఎంపీఈవో) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ కె.ధనంజయరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన 22 పోస్టులకు గాను ఈనెల 27వ తేదీలోగా ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులకు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. నెలకు రూ. 12వేలు పారితోషికం చెల్లించేదుకు ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. నియామకంలో రిజర్వేషన్ విధానం పాటించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలు శ్రీకాకుళం వెబ్సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. శ్రీకాకుళం. ఏపీ.జీఓవీ.ఇన్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.సందేహాలకు ఉద్యానవన సహాయ సంచాలకులు 08942-223543 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. హార్టికల్చర్‌లో డిగ్రీ, డిప్లొమా లేదా సాధారణ బీఎస్సీ, డిగ్రీలో హార్టీకల్చర్ ఒక అంశంగా చదివిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

### 26న ఉద్యోగంలోలేని ఎంపీహెచ్‌ఏలు హాజరుకండి

**శ్రీకాకుళం సిటీ:** జిల్లాలో 2002లో పారామెడికల్ పోస్టు, ఎంపీహెచ్ఏ (పురుషులు)గా నియామకానికి రాతపరీక్షకు హాజరై ప్రస్తుతం ఉద్యోగంలోలేనివారు ఈనెల 26న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరుకావాలని డీఎంహెచ్‌వో సనపల తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వ్యక్తులు, పరీక్ష సమయనాటికి పేర్కొన్న విద్యార్హతలు, శిక్షణ అర్హతలు సంబంధిత ధ్రువపత్రాలతో రావాలని పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం ఐదుగంటల్లోగా హాజరుకానివారు తదుపరి ప్రక్రియకు అనర్హులుగా పరిగణిస్తామని తెలిపారు. సంబంధిత వ్యక్తుల వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందాలని సూచించారు.





బస్సు ర్యాలీ ప్రారంభిస్తున్న నాయకులు, హాజరైన ఏజెంట్లు, ఖాతాదారులు

# న్యాయం చేసే వరకూ పోరాటం

**● అగ్రిగోల్డ్ బాధితులకు నష్టపరిహారం అందించాలి ● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల ● ఇచ్ఛాపురంలో బస్సు యాత్ర ప్రారంభం**

**ఇచ్ఛాపురం:** అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేసే వరకూ పోరాటం చేస్తామని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు హెచ్చరించారు. రాష్ట్ర అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాసన్నపేట జంక్షన్ వద్ద బుధవారం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ యాజమాన్యం ఖాతాదారుల నుంచి దోచుకున్న రూ.7,600కోట్లు సొమ్మును వెంటనే చెల్లించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 145 మంది ఖాతాదారులు, ఏజెంట్లు మృతి చెందారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలన్నారు. మూడు నెలల్లో ఆదుకొంటామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంత వరకూ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఉద్యమాలకు మారుపేరు శ్రీకాకుళంలో బస్సుయాత్ర ముగింపునాటికి ప్రభుత్వం కదలి రావాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే రూ.1,182కోట్లు చెల్లించి 14.20 లక్షల మంది చిన్న ఖాతాదారులకు న్యాయం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ ఆస్తుల అమ్మకాన్ని వేగవంతం చేయాలన్నారు.

## ప్రారంభమైన బస్సు యాత్ర

బహిరంగ సభ అనంతరం బస్సు యాత్రను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా 34 రోజుల పాటు సాగి సెప్టెంబరు 17న అనంతపురంలో ముగిస్తుందని తెలిపారు. గురువారం టెక్కలి, శ్రీకాకుళానికి బస్సు యాత్ర చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ సంఘ నాయకులు బి.విశ్వనాథ్‌రెడ్డి,పి.జయసింహ, తిరుపతిరావు, సీపీఐ నాయకులు వెంకటరమణ, చంద్రశేఖర్, నాగలక్ష్మి, విమల, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాల యోధుడు గౌతు లచ్చన్న



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి



లచ్చన్నకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

**కలెక్టరేట్:** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జడ్పీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఉద్యమాలకు ఊపిరి పోసిన వ్యక్తిగా గౌతు పేరు గాంచారన్నారు. రైతు, కార్మిక, కర్షకుల పక్షాన నిలబడి వారి జీవితాల్లో వెలుగునింపారని కొనియాడారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి మాట్లాడుతూ, ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తులకు సమాజంలో ఎప్పుడూ మంచి గుర్తుంపు ఉంటుందన్నారు. ముందుగా డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎస్పీ త్రివిక్రమ వర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష, ప్రధాన కార్యదర్శి సాధు చిన్నికృష్ణం నాయుడు, తెలుగు మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, నాయకులు చౌదరి బాబ్జి, మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నివాళి అర్పించిన మంత్రి అచ్చెన్న

**టెక్కలి:** టీడీపీ గుంటూరు సెంట్రల్ కార్యాలయంలో బుధవారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పొన్నూరు ఎమ్మెల్యే దూళ్లిపాల నరేంద్ర, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గుంటూరులో మంత్రి అచ్చెన్న నివాళి

# బ్యాంకు ఉద్యోగుల ధర్నా



**శ్రీకాకుళం సిటీ:** శ్రీకాకుళం నగరంలోని అన్ని జాతీయ బ్యాంకుల ఉద్యోగులు, అధికారులు బుధవారం ఎస్‌బీఐ ప్రధానకార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఈ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ కేసీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ, బ్యాంకులు దేశ ఆర్థికవ్యవస్థకు పునాదులని, అటువంటి వాటిని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రపన్నుతున్నాయని ఆరోపించారు. బ్యాంకుల విలీనం, కార్పొరేట్ బ్యాంకింగ్, ఖాతాదారుల సర్వీస్‌చార్జీల పెంపు, తదితర అంశాలపై ఈ ఆందోళన చేపట్టామన్నారు. ఈ ధర్నాలో సమన్వయకర్త బి.శ్రీనివాసులు, ఏఐబీఈఏ కార్యదర్శి కె.మోహనరావు, సంయుక్త ప్రధానకార్యదర్శి రాజేష్‌బాబు, ఆంధ్రాబ్యాంకు అధికారుల ఫెడరేషన్ సహాయ ప్రధాన కార్యదర్శి రాంజీ, ఎస్‌బీఐ అధికారుల సంఘం ప్రాంతీయకార్యదర్శి, బీఈఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌బీఐ ప్రధానశాఖ స్థానిక కార్యదర్శి రమేష్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

# ఉద్దానం ఏమైనా ప్రయోగశాలా?

**● రీసెర్చ్‌లకు వాడుకోవడం బాధాకరం**

**● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు**



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

**ప్రగడపుట్టుగ(కవిటిరూరల్):** కొంతకాలంగా ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల పేరిట రీసెర్చ్ చేస్తున్నారని, ఈ ప్రాంతం ఏమైనా ప్రయోగశాలా అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. లేనిపోని ప్రయోగాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమన్నారు. బుధవారం ప్రగడపుట్టుగలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఆంధ్రాయూనివర్సిటీ ప్రొఫెసర్ డీఈ బాబు ఈ ప్రాంతంలో రీసెర్చ్ చేసి కిడ్నీ వ్యాధికి ఇకొలి బ్యాక్టీరియా కారణ మని చెప్పినట్టు ఇటీవల ఓ పత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో వచ్చిన కథనం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. కొబ్బరి, పనస, మునగ, నాటుకోళ్లు, నదీజలాలతో కిడ్నీ వ్యాధి సోకుతుందని, అలాగే బహిరంగ మల మూత్ర విసర్జన ద్వారా ఇకోలి బ్యాక్టిరీయాతో ఈ వ్యాధి వస్తుందని ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్న ఉద్దానం కొబ్బరి నీటిని తాగుతున్న వారికి ఎందుకు కిడ్నీ వ్యాధి సోకడం లేదని ప్రశ్నించారు. సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో అధికంగా నదీ జలాల ఆధారంగా వరిపంట పండిస్తుంటారని, అలాంటప్పుడు ఈ నివేదికలో వరికి మినహాయిపంపు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సర్వేను నిశితంగా పరిశీలిస్తే దీని వెనుక కార్పొరేట్ సంస్థలు ఉన్నట్టు అర్థమవుతుందన్నారు. ఈ సర్వేతో కొబ్బరి రైతులకు కోలుకోలేని దెబ్బతగిలిందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ నివేదికపై స్పందించి నిజానిజాలు తేల్చాలని కోరారు. కిడ్నీ రోగులకు శుద్ధజలాలు, పింఛన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.అబ్బాయినాయుడు, గోవిందరాజు బి.రామమూర్తి, భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయండి

**●లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి**




మాట్లాడుతున్న బాబ్జి

**ఇచ్ఛాపురం:** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇచ్ఛాపురంలో విలేఖరులతో మాట్లాడారు. పారిశ్రామికవేత్తల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా సీతానగర మండలం పురుషోత్తపట్నంలో ఎత్తిపోతల పథకం ప్రారంభించారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. దీనికన్నా ముందు బాబూ జగ్జీవన్‌రామ్ సుజలా జీవన ప్రాజెక్ట్ ప్రారంభిస్తే బాగుండేదన్నారు. ఇప్పటికీ పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టులు పూర్తికాలేదన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రైతులకు సాగునీరందివ్వాలంటే ముందుగా బుచ్చయ్య రిజర్వాయర్, తాటిపూడి రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలన్నారు. వీటిద్వారా 11లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ఆయన చెప్పారు. దీని కోసం ప్రజల పక్షాన లోక్‌సత్తా నిలబడి పనుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్టీరింగ్‌కమిటీ అధ్యక్షుడు పి.రాంబాబు, నియోజకవర్గ నాయకులు దక్కత కృష్ణమూర్తి రెడ్డి, డి.ప్రతాప్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో మార్మోగిన జగతి పేరు

**● ఏసీబీ డీఎస్పీ వెంకటవరప్రసాద్, హెచ్‌సీ మాధవరావుకు రాష్ట్రస్థాయి పురస్కారాలు**

ముఖ్యమంత్రి నుంచి అవార్డులు అందుకుంటున్న వెంకటవరప్రసాద్, మాధవరావు

**కవిటి :** మండలంలోని జగతి గ్రామానికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ఈ గ్రామానికి చెందిన ఏసీబీ డీఎస్పీ శమళ్ల వెంకటవరప్రసాద్ సేవలకు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం నాడు తిరుపతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ఈ అవార్డును అందుకున్నారు. ఈయన ప్రస్తుతం విజయవాడలో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో విజయనగరం, విశాఖపట్నంలో ఎస్ఐ, సీఐగా ఉత్తమ సేవలందించడంతో పాటు పలు రివార్డులు, అవార్డులు పొందారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ పులకల మాధవరావు ముఖ్యమంత్రి నుంచి అవార్డు అందుకున్నారు. ఈయన విశాఖపట్నంలో పనిచేస్తున్నారు. ఒకేసారి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు రాష్ట్రస్థాయి అవార్డుల రావడంతో జగదీశ్వర యువజన సంఘం నాయకులు నేతాజి, గోపాలకృష్ణ బాబూరావు, రాజబాబు, శంకరరావు, మల్లికార్జునరావు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పావుగంటలో..
# పాస్‌పుస్తకం

- జారీ సులభతరం
- రైతుకు తీరనున్న ఇబ్బందులు
- తాజాగా ప్రభుత్వ నిర్ణయం

**అన్నదాతల కష్టాలు తీర్చేందుకు, అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమున్నత నిర్ణయం తీసుకుంది. రైతులకు పట్టాదాస్ పాస్‌పుస్తకాలు జారీని సులభతరం చేసే నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. కేవలం 15 నిముషాల వ్యవధిలో రైతుల చేతికి పాస్ పుస్తకం ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మీసేవ కేంద్రానికి వెళ్లి పాసుపుస్తకం పొందేలా మార్గదర్శకాలు రూపొందించారు.**



(శ్రీకాకుళం సిటీ)

సాగుభూమికి సంబంధించిన పాస్‌పుస్తకాలు పొందాలంటే అన్నదాతలు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. కాళ్లరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా, ము డుపులు ఇచ్చినా నెలల తరబడి వేచి ఉండాల్సిందే. సొం తభూమికి సంబంధించిన హక్కు పత్రం పొందాలంటే అవస్థ లు తప్పడం లేదు. అంతేకాదు....పట్టాదార్ పాస్‌పుస్తకాల జా రీకి సొమ్ములు గుంజుతూ అవినీతి నిరోధకశాఖ అధికా రులకు పట్టుబడుతున్న ఘటనలూ కొత్తకాదు. వీటన్నిం టికీ చరమగీతం పాడుతూ ఈ నెల 5న ప్రభుత్వం మీసేవా కేంద్రాల ద్వారా పావుగంటలో పాస్‌పుస్తకం జారీచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రెవెన్యూ అధికారులు ఆమోదం పొందిన క్షణాల్లోనే పాస్ పుస్తకాలు చేతికి అందనున్నాయి. దీనివల్ల రైతుకు వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయి. గతంలో పాస్‌పుస్తకాలు పొందాలంటే అధికారులు ఆమోదించిన తర్వాత పుస్తకాలు ఎక్కడో దూర ప్రాంతాల్లో ముద్రించిన తర్వాత వచ్చేవి. ప్రస్తుతం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఈ ఇబ్బందులు తొలగనున్నాయి.

**● ఆధార్‌తో అనుసంధానం.....**


పాస్‌పుస్తకాలు తీసుకునే సమయంలో ఆధార్ నెంబర్ ద్వారా వేలిము ద్రలు తీసుకుంటారు.ఈ వెబ్‌సైట్‌ను సాంకే తిక ప్రమాణాలతో తయారుచేశారు. గతంలో ఆర్‌వోఆర్ 1బీ లో ఉన్న పాస్‌పుస్తకాలు రానున్నాయి. ఒకవేళ పాత పాస్ పుస్తకాల్లో ఫొటో ఉంటే ప్రస్తుత విధానంలో కొత్త వాటిలో ఆధార్‌తో ఏ ఫోటో ఉంటే అదే దీనిలో ముద్రితమవుతుంది. కొత్తగా వస్తున్న పాస్‌పుస్తకాలు మే సేవా నిర్వాహకుని కోడ్, జారీ చేసిన సమయం ధ్రువీకరణ పత్రం ముందు భాగంలో ముద్రించనున్నారు.

**● జాగ్రత్తలు తప్పనిసరి....**

భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోని వారు వాటి వివరాలను పరిశీలించుకోవాలి. వాటికి ఆధార్ నెంబర్ జతచేయాలి. ఒకవేళ మీ సేవ కేంద్రం అందుబాటులో లేక పోయినప్పటికీ మీ భూమి వెబ్‌సైట్ ద్వారా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందవచ్చు. ఆన్‌లైన్‌లో నమోదైన భూములకు సంబంధించి మీరు ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్ నెంబర్‌ను నమోదు చేసుకోవాలి. దీని అనుసంధానం సమయంలో ఓటీపీ(ఒన్ టైమ్ పాస్‌వర్డ్) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

**● భూశోధక్ యాప్‌తో...**

భూశోధక్ యాప్‌ను పాస్ పుస్తకాల కోసం ప్రత్యేకంగా తయారుచే శారు. దీనిలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే పచ్చరంగు టిక్ మార్క్ వస్తే నిజమైన పాస్ పుస్తకంగా, ఎరుపు రంగు మార్కు వస్తే తప్పుడు పత్రంగా గుర్తించాలి. పట్టాదార్ పాస్‌పుస్తకం వాస్తవ పరిస్థితిని




తెలుసుకునేందుకు ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. రైతు లేదా పట్టాదారు ఇప్పటికే వెబ్‌ల్యాండ్‌లో ఖాతాదారుగా నమోదై ఉండాలి. అంతేగాక ఆధార్‌నెంబర్‌ను అనుసంధానించుకోవాలి.

**● వివరాలు సమగ్రంగా ఉండేలా చూసుకోవాలి**

భూములకు సంబంధించిన అన్ని వివరాలు వెబ్‌ల్యాండ్‌లో సమగ్రంగా నమోదై ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల పట్టాదార్ పాస్‌పుస్తకం తే లికగా పొందే అవకాశముంది. దేవాదాయ శా ఖ భూములు, ప్రభుత్వ భూములకు సంబం ధించి పాస్‌పుస్తకాలు జారీచేసేది లేదు. నూతన విధానంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఏ విధమైన తప్పుడు పత్రాలు జారీ కాకుండా పక్కాగా రూపొందించారు. ఇప్పటికే రైతుసేవలో రెవెన్యూ శాఖ విజయవం తమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరికొత్త పథకాలను రూపకల్పన చేసింది.

**పి.రజనీకాంతరావు, జాయింట్ కలెక్టర్-2**

## అన్నదాత..
# కష్టాలకు చెక్

**భూమి హక్కు సమస్య పరిష్కారానికి ఎస్‌ఆర్‌వోఎంఆర్‌వోఎస్ విధానం**

(శ్రీకాకుళం సిటీ)

బ్యాంకు నుంచి పంట రుణం పొం దాలన్నా, ప్రభుత్వం నుంచి రాయితీ యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరు వులు, సూక్ష్మపోషకాలు తదితరాలు ఏవీ తీసుకోవాలన్నా రైతుకు సంబం ధించిన భూమి ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలి. అలా నమోదు కాకుంటే రూ.లక్షలు విలువచేసే భూమి ప త్రాలు తమ వద్ద ఉన్నప్పటికీ ఆన్‌లైన్ లో నమోదు కాకపోతే బ్యాంకుల నుం చి పంట రుణాలు, ప్రభుత్వం నుంచి రాయితీలు పొందేందుకు లభించే స మయంలోనే హడావుడిగా నమోదు కో సం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాల యాల్లో జాప్యం జరగడంతో పాటు రెవెన్యూ సిబ్బంది అడిగినంత ము డుపులు ఇచ్చుకోవాల్సి వస్తుంది. ఈ సమస్యలన్నీ ఆన్‌లైన్‌లో భూముల నమోదులో చోటు చేసుకుంటున్న జా ప్యం, పొరపాట్లే. ఇదిలా ఉంటే రెవెన్యూ శాఖలో పెరిగిన అవినీతి ఒక కార ణమైతే, తమ భూమిని ఆన్‌లైన్‌లో న మోదుకు ధరఖాస్తుకు చేసుకోవడంలో నెలకొన్న అవగాహనా రాహిత్యం మరో కారణంగా కనిపిస్తోంది.

**● కొత్త విధానంతో...**

గతంలో ఉన్న భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు ప్రభుత్వం ఇప్ప టికే చర్యలు చేపట్టినప్పటికీ కొత్తగా జ రిగే క్రయ విక్రయాలు భూముల వి షయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో సా గుభూముల సమస్యలకు చరమగీతం పాడేందుకు నూతన విధానం ఎస్‌ఆ ర్‌వోఎంఆర్‌వోఎస్ (సబ్‌రిజిస్ట్రార్ ఆఫీ స్, మండల రెవెన్యూ ఆఫీస్ ఇంటి గ్రేటెడ్ సర్క్యూట్)అమల్లోకి తీసుకు రా నుంది. ఒక రైతు తన భూమిని మరొ క రైతుకు విక్రయించే సమయంలోనే రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు ఆ భూములకు సంబంధించి క్రయ విక్ర యాలకు సంబంధించిన రుసుములతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసేం దుకు అవసరమైన రుసుములను వ సూలు చేస్తారు. అనంతరం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిష్టర్ చేసిన భూ మిని కొనుగోలు చేసిన రైతు పేరుతో వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. ఆన్‌లైన్ నమోదుకు ఇంటర్నెట్ ద్వారా రెవెన్యూ శాఖ సహాయం తీసుకుం టారు.

**● శాఖల మధ్య సమన్వయంతో.....**

ఈ నేపథ్యంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసే లా ఒక వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా రైతు తమ పే రుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయిం చుకునేందుకు రెవెన్యూశాఖకు దరఖా స్తు చేసుకునే అవసరం ఉండదు. ఆన్ లైన్‌లో ఎవరిపేరుతో నమోదై ఉందో వారిని రెవెన్యూశాఖ నిరభ్యంతరంగా హక్కుపత్రాలు జారీ చేసే అవకా శముంది.



## పంట చేలలో పశువుల మంద..
# రైతన్న కష్టం గోవింద



**అన్నదాత కష్టం కొందరి నిర్లక్ష్యంతో నేలపాలవుతుంది. ఎంతో వ్యయప్రయాసలతో దమ్ము చేసి వేసిన వరినాట్లు పశువుల బారినపడుతున్నాయి. ఇప్పుడిప్పుడే ఆనుకున్న మొనలను పశువుల మంద బురదలో కుమ్మేస్తున్నాయి. దీనికి సజీవ సాక్ష్యం ఈ పక్క చిత్రం. గొల్లగండి, బారువ బీల ప్రాంతంలోని ఉడుపు మడులను బారువకు చెందిన పశువులు నిత్యం నాశనం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో గోవులను నిర్లక్ష్యంగా వదిలేస్తుండడంతో ఆ మందంతా వరి చేల మీద పడుతున్నాయి. దీంతో ఆ ప్రాంత రైతులు లబోదిబోమంటున్నారు. గతకొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా పశువులను అదుపులో పెట్టుకోకుంటే వాటిని కట్టేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు భగవాన్, తిరుపతిరెడ్డి, క్షేత్రయ్య, ఆనంద్, విజయ్, తదితరులు చెప్పారు.**

-సోంపేట

# దొంగతనాల నియంత్రణకు ఎల్‌హెచ్‌ఎంఎస్

## సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ త్రివిక్రమవర్మ సూచన

**కలెక్టరేట్:** దొంగతనాల నియంత్రణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డో హౌసింగ్ మోనటరింగ్ సిస్టమ్)ను ప్రవేశపెట్టినట్టు ఎస్పీ త్రివిక్రమవర్మ తెలిపారు. ఈ విధానాన్ని బుధవారం శ్రీకాకుళం నగరంలోని విశాఖ ఎ కాలనీలో బుధవారం ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ విధానం ద్వారా ఇంటిలో కెమెరా అమర్చి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే దొంగలను ఇట్టే పట్టుకోవచ్చు. దూర ప్రాంతాలకు వెళ్లేవారికి ఈ విధానం ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. దొంగతనం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారమందుతుంది. అక్కడ జరిగే సన్నివేశాలు సైతం నమోదవుతాయని ఎస్పీ చెప్పారు. ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.




ఎల్‌హెచ్‌ఎంఎస్ విధానాన్ని అమరుస్తున్న పోలీస్ సిబ్బంది



నలుగురు బాగును.. మంచిని.. ఆనందాన్ని పంచేది పండగ. నేల నుంచి నింగి వరకూ సహజత్వాన్ని పరిరక్షిస్తూ... ప్రకృతితో మమేకమైనప్పుడే ఆనందం.. ఆ పరమార్ధంలో మనం జరుపుకున్నదే వినాయక చవితి. ఆధునికత పేరుతో మనం తీసుకుంటున్న అపరిపక్వ నిర్ణయాలతో ఇప్పుడు అసలు అంతరార్థానికి దూరమవుతోంది.. మట్టి విగ్రహాలకు దూరంగా.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగంతో పర్యావరణానికి దోహదం కలుగుతోంది. మరి కొద్ది రోజుల్లో వినాయక చవితికి సిద్ధమవుతున్నాం. ఇప్పటికైనా మేలుకొంటేనే మనకు.. మన భవిష్యత్తు తరానికి మంచిది..



విగ్రహాలకు రంగులు వేస్తున్న కళాకారులు

# మట్టి గణనాథునికి.. జై

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణ విఘాతం
- మట్టి వినాయకుడే.. మన సంస్కృతి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

(హిరమండలం)

వినాయక చవితి వచ్చిందంటే చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. తెలుగు సంవత్సరంలో తొలిసారిగా జరుపుకునే పండగ వినాయకచవితి. ఈనెల 25న నుంచి భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహణకు ప్రజలందరూ సిద్ధమవుతున్నారు. అందుకు అవసరమైన గణనాథుని ప్రతిమలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. అయితే ఇందులో సహజ వనరులకు బదులు రసాయనిక పదార్థాలను వినియోగించి ప్రతిమలు తయారు చేయడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేలుకొందాం.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమలను విడనాడుదాం.. మట్టిగణపయ్యనే పూజిద్దాం అని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు.

### ● ప్రకృతి నందనం

మానవులు మాత్రమే మట్టికి కృతజ్ఞతలు చెబితే సరిపోదు. వృక్షాదాలు మొదలు 'స్థిర'జీవులు వరకు తమ పోషకురాలైన మట్టికి ప్రణమిల్లాలి. అవి నేరుగా అలా చేయలేవు. కానీ.. మన ద్వారా వాటికి ఆ అవకాశం కల్పించారు. మాచీ, బహతీ(వాకుడాకు), బిల్ల(మారేడు), తులసి, చూత(మామిడి), కరవీర(గన్నేరు) తదితర పత్రాతలతో పాటు గరిక కూడా పూజాద్రవ్యాలతుగా స్థానం దక్కింది. పుష్పజాతులు తెచ్చి పూజంచలేకున్నా గరికి పూజకు మెచ్చు ఘనడెవ్వడంటూ కంచర్ల సూర్యనారాయణ కవి గణపతిని ప్రార్థించారు.

### ● మట్టికి వందనం

మట్టి లేనిదే మనిషి లేడు. మనిషి లేకపోయినా మట్టి ఉంటుంది. అందుకే మట్టికి కృతజ్ఞత తెలపాల్సిన అవసరం ఉంది. రోజూ భూమిని పూజించడం అందరికి సాధ్యం కాదు. అందుకే సర్వగణాలకు అధి నాథుడైన గణపతిని మట్టితో తయారు చేసి, వినాయక చతుర్థి రోజు చేసిన పూజలే, భూమికి చేసిన పూజలుగా మారుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

### ● సహజత్వమే సకల రంగులు

మట్టితో తయారు చేసిన విగ్రహానికి ఎలాంటి రంగులు లేకున్నా.. చాలా కళగా కనిపిస్తుంది. మనలోని జీన్స్ మట్టితో అనుబంధం కలిగి ఉండటమే అందుకు కారణం. కృత్రిమ రంగుల వల్ల వచ్చే కెమికల్ ఎలర్జీ వంటి వ్యాధులు మట్టి విగ్రహాలు కలుగజేయవు. మట్టి విగ్రహాలు చెరువులు, గెడ్డల్లో నిమజ్జనం చేయడం వల్ల అందులో ఉండే పోషక గుణాలు పంటలకు, మనుషులకు నూతన శక్తిని అందిస్తుంది. ఎత్తు పరిమితిలో ఉండడం వల్ల మన దృష్టిని విగ్రహంపై నిలపగలుగుతాం. భక్తిలోని ఏకాగ్రతకు ఇది తొలిమెట్టు.

### ● పర్యావరణ చైతన్యం

మట్టి గణేషుని ఆకారాన్ని చిన్నారులు తొమ్మిది రోజుల పాటు చూస్తుండటం.. పెద్దలు మట్టిలోని గొప్పతన్నాన్ని పిల్లలకు చెబుతుండడం.. తదితరాలన్నీ బాల్యంలోనే పర్యావరణ పరిరక్షణకు బీజాలు పడేందుకు దోహదపడతాయి. తద్వారా ఒక తరం నుంచి మరో తరానికి ఓ చక్కటి సందేశం, సంప్రదాయం, సంస్కృతిని తీసుకు వెళ్తాయి.

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణ ముప్పు

మనం ఒక్కసారి ఆలోచిస్తే.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించి మన వినాశనానికి మనమే బాటలు వేసుకుంటున్నాం. ఇలా.. వందల వేల విగ్రహాలు దశాబ్దాల పాటు వినియోగిస్తే.. కొన్నాళ్లకు చూద్దామన్నా పచ్చని ప్రకృతి కనిపించదు. పొలాలు, చెరువులు, గ్రామాలు సహజత్వాన్ని కోల్పోతాయి. మనం చేసే వాయు, జల కాలుష్యానికి భావితరాలు మనల్ని మన్నించవు. ఈ విగ్రహాలు నీటిలో అంత తొందరగా కరగవు. సమీపంలోని కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల అందులోనే నిల్వ ఉంటుంది. దీని వల్ల హానికరమైన సూక్ష్మజీవులు ఉత్పత్తి చెంది ప్రజలకు, మూగజీవాలకు రోగాలు కలుగుచేస్తాయి. ఈ విగ్రహాలు నిమజ్జనం చేసిన ప్రాంతాల్లో వలస పక్షుల రాక తగ్గిపోతుంది. చెరువులు, కాలువలు నుంచి వచ్చే సాగునీటితో పంటల దిగుబడి తగ్గుతుంది.

### ● ఆర్భాటమే.. ఆధ్యాత్మికం శూన్యం..

ఆరు అంగుళాల మట్టి బొమ్మను పూజించినా... భారీ ఎత్తు ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాన్ని కొలిసినా అదే స్థాయిలో ఫలితం దక్కుతుంది. కాకపోతే మట్టి బొమ్మ వల్ల పర్యావరణాన్ని కాపాడినవాళ్లం అవుతాం. అయితే గత కొన్నేళ్లుగా ఏర్పడ్డ పోటీతత్వ భక్తే దీనికి ప్రధాన కారణమై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వైపు మనల్ని నడిపిస్తోంది. ఆర్భాటమే భక్తి అన్న స్థితికి చేరుకుంది. దీని వల్ల ఆధ్యాత్మిక ఆకర్షణ కూడా ఉండదు. విగ్రహం ఎత్తు పెరిగే కొద్ది దానికి తగ్గ వేదిక, డెకరేషన్, కార్యక్రమాలు, జన సందోహం ఉండాలి. ఇవన్నీ అనుకున్న దానికంటే ఖర్చును 5 రెట్లు పెంచుతుంది.

## గిట్టుబాటు కావడం లేదు...

**పొందూరు :** వినాయక చవితి ఉత్సవాలు మండలంలోని ప్రతి గ్రామంలో నిర్వహిస్తారు. మా తాతల తండ్రుల నుంచి విగ్రహాలు తయారు చేస్తున్నారు. మేము కూడా ఆ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని మండలానికి చెందిన ఎన్.రాము, రాయిల చిన్నారావులు అన్నారు. అయితే ఈ ఇటీవల కాలంలో రంగులు, ముడిసరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల తయారీ గిట్టుబాటు కావడం లేదు. అలాని ఈ రంగాన్ని వదిలి వేరే రంగానికి వెళ్లలేకపోతున్నాం. ఏటా నష్టాలు చవిచూస్తున్నాం. అయినా వృత్తిపై ఉన్న మమకారంతో మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నాం. ఈ రంగంలో ఉన్న కళాకారులకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం అందడం లేదు.



జలుమూరు మండలం సురవరంలో తయారు చేసిన వినాయకుని మట్టి ప్రతిమ

## వివిధ రూపాల్లో...

**ఎచ్చెర్ల :** మండలం పాతపొన్నాడ గ్రామానికి చెందిన కుమ్మరి కులస్థులు వివిధ ఆకృతుల్లో మట్టి విగ్రహాలు తయారు చేసి అందర్నీ ఆకర్షిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తరహా లో మట్టిబొమ్మలను తయారు చేసి చూపరులను ఆకట్టుకుంటున్నారు. విద్యావంతులైన బోగాపురపు రామకృష్ణ, రాంబాబు సోదరులు ఈ విగ్రహాల త యారీలో నిష్ణాతులు. ఒకే రకమైన మట్టి వినాయక ప్రతిమలను తయారుచేస్తే ప్రజల దృష్టని ఆకర్శించ డం కష్టమని.. అనేక రూపాల్లో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేస్తూ అందరి దృష్టిని ఆకర్శిస్తున్నారు.



## మట్టిబొమ్మలతో పర్యావరణ పరిరక్షణ



మట్టిబొమ్మలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం. పర్యావరణానికి హానితలపెట్టని ముడిపదార్థాలను వాడి విగ్రహాలను తయారు చేస్తున్నాం. బి.టెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం వచ్చినప్పటికీ కులవృత్తిపై ఉన్న మమకారంతో ఉద్యోగాన్ని వదిలేశాను. మట్టితో విగ్రహాలు తయారుచేస్తూ మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాను. ఎక్కడో పనిచేసిన కంటే స్వంత గ్రామంలో కులవృత్తిని నమ్ముకొని జీవినం సాగించడం ఎంతో సంతోషంగా ఉంది.

**- పొట్నూరు అనంతరావు, సురవరం**

## కులవృత్తిని నమ్ముకొని...

**జలుమూరు:** పూర్వీకుల నుండి వస్తున్న కులవృత్తులను నమ్ముకొని మట్టితోనే వివిధ ఆకృతుల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు మండలం సురవరం గ్రామానికి చెందిన పొట్నూరు అనంతరావు, కిరణ్‌కుమార్, జనార్దనరావు, రోహిణి, శ్రీనివాసరావు, సతోషిలు. వీరి కుటుంబాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు వచ్చినప్పటికీ కుల వృత్తులను నమ్ముకొనే జీవనం సాగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగంచకుండా మట్టి బొమ్మలను తయారు చేస్తున్నారు. గతంలో మట్టి పాత్రలు తయారు చేసిన వీరు కాలక్రమేణా మట్టివిగ్రహాల తయారీలో విశేష ప్రతిభను కనబరుస్తున్నారు. వినాయక ఉత్సవాలకు వివిద ఆకృతుల్లో మట్టిబొమ్మలను ఆర్డర్లపై తయారు చేస్తారు. పర్యావరణానికి ముప్ప వాటిల్లకుండా సంప్రదాయ రంగులతో పాటు విగ్రహాల తయారీలో మట్టి, గడ్డి, ఊక, ఔరు, ఇసుక, గోగునార ఉపయోగిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన మట్టి విగ్రహాలను రూ. 100ల నుంచి రూ. 50వేల వరకు విక్రయిస్తున్నారు. అడుగు నుంచి 30 అడుగుల ఎత్తువరకు మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ ఏడాది శివరూపగణపతి, ఆదిశేషునిపై గణపతి, అయ్యప్ప, పంచముఖి, వేంకటరమణమూర్తి, అర్ధనారీశ్వర తదితర ఆకృతుల్లో వినాయక విగ్రహాలను సుమారు 500 వరకు తయారు చేసినట్టు వారు తెలిపారు. వంశధార నది ఒడ్డున బంకమట్టి విగ్రహాలు తయారీకి ఉపయోగపడుతుందన్నారు.



మట్టి వినాయక ప్రతిమలను తయారు చేస్తున్న దృశ్యం

# ‘ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన’ ముఖ్య ఉద్దేశం?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

**1. 2020, 2024, 2028 ఒలింపిక్స్‌ల్లో భారత ప్రమాణాల మెరుగుదలకు కావాల్సిన సూచనల నివేదికను కేంద్ర క్రీడల శాఖకు సమర్పించిన ఎనిమిది మంది సభ్యుల కమిటీలో లేనివారు?**
ఎ) పుల్లెల గోపిచంద్ బి) వీరేన్ రస్కిన్హా
సి) మిల్కాసింగ్ డి) అభినవ్ బింద్రా

**2. భారత సుప్రీంకోర్టు తదుపరి, 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ఎంపికయ్యారు?**
ఎ) జస్టిస్ ఎన్.వి.రమణ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ రంజన్ గగోయ్
డి) జస్టిస్ సంజన్ కిషన్ కాలే

**3. కెన్యా అధ్యక్షుడిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు?**
ఎ) ఊహురు కెన్యాట్ట బి) డేనియల్ అరప్ మాయి
సి) జోమ్ కెన్యాట్ట డి) మవాయి కిబాకి

**4. 2017 ఆగస్టు 11న ముప్పవరపు వెంకయ్య నాయుడు భారతదేశానికి ఎన్నో ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) 15 బి) 14 సి) 16 డి) 13

**5. కేంద్ర సెన్సార్ బోర్డు నూతన చైర్మన్?**
ఎ) ప్రసూన్ జోషి బి) విద్యాబాలన్
సి) పహలాజ్ నిహలని డి) అదూర్ గోపాలకృష్ణన్

**6. 2017లో లండన్ వేదికగా జరిగిన ‘ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్’ జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కి చేరిన తొలి భారతీయుడు?**
ఎ) నీరజ్ చోప్రా బి) దవింద్‌సింగ్ ఖాంగ్
సి) వికాస్‌గౌడ్ డి) అనిల్‌కుమార్

**7. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం?**
ఎ) ఆగస్టు 12 బి) ఆగస్టు 10
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 9

**8. పర్యావరణ హానికరమైన 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లను ‘నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్’ ఇటీవల ఏ ప్రాంతంలో నిషేధించింది?**
ఎ) చెన్నై బి) బెంగళూరు సి) కోల్‌కతా డి) ఢిల్లీ

**9. పేదలకు అతి తక్కువ ధరకు మందులను విక్రయించే ‘ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పిఎంబిజెపై)’ కేంద్రాలను 1000కి పైగా ఏర్పాటు చేయడానికి కేంద్రంతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకొన్న రాష్ట్రం?**
ఎ) బీహార్ బి) ఉత్తరాఖండ్
సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యాన

**10. 2017 నవంబరు 28న జరిగే ‘ప్రపంచ భాగస్వామ్య సదస్సు’కు ఆతిథ్యమిస్తున్న నగరం?**
ఎ) అహ్మదాబాద్ బి) కాన్పూర్
సి) మద్రాస్ డి) హైదరాబాద్

**11. మసూమా ఎబ్టేకర్, మౌలావర్ధి అనే మహిళలు ఏ దేశానికి ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు?**
ఎ) ఇరాన్ బి) పాకిస్థాన్ సి) ఇరాక్ డి) జోర్డాన్

**12. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్?**
ఎ) షహర్యార్‌ఖాన్ బి) నజమ్ సేథి
సి) జహీర్ అబ్బాస్ డి) జావెద్ మియందాద్

**13. కేంద్ర స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల డిజిటలైజేషన్ కోసం ‘ఈ-శక్తి’ అనే కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ?**
ఎ) స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సి) రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా
డి) నేషనల్ బ్యాంక్ ఫర్ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్

**14. 'BIMSTEC' కి సంబంధించి సరైనది?**
ఎ) బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్
బి) 1997 జూన్ 6న ప్రారంభం
సి) సభ్యదేశాలు - బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్, శ్రీలంక డి) పైవన్నీ

**15. 2017 ఆగస్టు 8న 'BIMSTEC' దేశాలు తమ తొలి విపత్తు నిర్వహణ విన్యాసాలను ఏ నగరంలో ప్రారంభించాయి?**
ఎ) థింపు(భూటాన్)
బి) జయవర్ధనపుర కొట్టె(శ్రీలంక)
సి) న్యేపిడా(మయన్మార్)
డి) న్యూఢిల్లీ(ఇండియా)

**16. అయోధ్య వివాదానికి సంబంధించి అన్ని కేసుల పరిశీలనకు సుప్రీం కోర్టు ఇటీవల నియమించిన ముగ్గురు జడ్జీల కమిటీకి నేతృత్వం వహిస్తున్నది?**
ఎ) జస్టిస్ జాస్తి చలమేశ్వర్
బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ కురియన్ జోసఫ్
డి) జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్

**17. 2017కి గాను UEFA సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?**
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్
బి) యునైటెడ్ మాంచెస్టర్స్ క్లబ్
సి) బార్సిలోన క్లబ్ డి) మిలాన్ క్లబ్

**18. 2017 ఆగస్టులో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ‘ప్రపంచ ఏనుగుల దినోత్సవం’ సందర్భంగా ‘గజయాత్ర’ ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. ‘ఏనుగుల దినోత్సవం’ ఎప్పుడు?**
ఎ) ఆగస్టు 16 బి) ఆగస్టు 9
సి) ఆగస్టు 8 డి) ఆగస్టు 12

## జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్



**19. అంగారక గ్రహంపై మేఘాల దృశ్యాలను చిత్రీకరించిన ‘క్యూరియాసిటీ’ రోవర్ ఏ దేశానికి చెందింది?**
ఎ) జపాన్ బి) రష్యా సి) ఇండియా డి) అమెరికా

**20. 2017 అక్టోబరు 19 నుంచి 29 వరకు రష్యా, భారత్ సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) వరుణ బి) గరుడ సి) ఇంద్ర డి) మిత్రశక్తి

**21. పదవికి రాజీనామా చేసిన గురుదీప్‌సింగ్ సప్పాల్ స్థానంలో నియమితులైన రాజ్యసభ టి.వి. నూతన సిఇఒ?**
ఎ) సూర్యప్రకాశ్ బి) వెంపటి శశిశేఖర్
సి) శోభాసేన్ డి) మృదులాసిన్హా

**22. 2017 ఆగస్టు 9, 10 తేదీల్లో ‘ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్’ను నిర్వహించిన నగరం?**
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
సి) అలహాబాద్ డి) కోల్‌కతా

**23. ‘భారత్-ఆసియాన్ దేశాల యువసదస్సు’కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) భోపాల్(మధ్యప్రదేశ్)
బి) మాండలే(మయన్మార్)
సి) కంపాంగ్ చామ్(కంబోడియ)
డి) సిసిలి(ఇండోనేషియా)

**24. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇటీవల రూపొందించిన మూకీ(సంజ్ఞలు) భాషలో ‘జనగణమన’కు దర్శకత్వం వహించింది?**
ఎ) మధుర్ బండార్కర్ బి) అభిషేక్ చాబే
సి) గోవింద్ నిహలాని డి) అలంక్రిత్ శ్రీవాస్తవ్

**25. 2017 ఆగస్టులో భారత కోస్టుగార్డ్ దళం ప్రవేశపెట్టిన తీరగస్తీ నౌక?**
ఎ) ఐఎన్ఎస్ మిత్ర బి) ఐఎన్ఎస్ మౌర్య
సి) ఐఎన్ఎస్ శౌర్య డి) ఐఎన్ఎస్ సుచిత్ర

**26. 2017కి గాను ‘ద హ్యూగో అవార్డు’ పొందిన నవల ‘ద ఒబిలిస్క్ గేట్’ రచయిత?**
ఎ) ఎన్.పి.ఉల్లేఖ్ బి) నోరా.కె.జెమిసిన్
సి) జేవియర్ మోరో డి) అనురాధ రాయ్

**27. 2017 నవంబరులో జరగాల్సిన అండర్ 19 క్రికెట్ ఆసియా కప్ ఆతిథ్య వేదికను బెంగళూరు నుంచి ఎక్కడికి మార్చారు?**
ఎ) శ్రీలంక బి) మలేషియా
సి) బంగ్లాదేశ్ డి) పాకిస్థాన్

**28. కుష్టు వ్యాధి నివారణ కోసం పోరాడి ఇటీవల మరణించిన ‘రూత్‌ఫౌ’ని ఏ దేశంలో మరో ‘మదర్ థెరిసా’గా వ్యవహరిస్తున్నారు?**
ఎ) పాకిస్థాన్ బి) కజకిస్థాన్
సి) శ్రీలంక డి) నేపాల్

**29. కజకిస్థాన్ రాజధాని అస్తానా వేదికగా ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మహేశ్వరి చౌహాన్ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?**
ఎ) ఆర్చరీ బి) బాక్సింగ్ సి) టెన్నిస్ డి) షూటింగ్

**30. ‘దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన’లో భాగంగా కేంద్రం ప్రారంభించిన ‘ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన’ ముఖ్య ఉద్దేశం?**
ఎ) అసహాయ వర్గాలకు పెన్షన్ అందించడం
బి) వ్యవసాయ రంగంలో ఉచిత ట్రాక్టర్లు అందించడం
సి) గ్రామీణ ప్రాంతాల్లో రవాణా స్వయం సహాయక సంఘాలు నిర్వహించడం
డి) బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ పరపతిని పెంచడం

**31. ఎడిస్ ఈజిప్ట్ ద్వారా సంక్రమించే జికా వైరస్ క్యూలెక్స్ దోమల ద్వారా సంక్రమిస్తుందని ఏ దేశ శాస్త్రవేత్తల పరిశోధనలు వెల్లడించాయి?**
ఎ) కెనడా బి) సెనెగల్ సి) పెరూ డి) బ్రెజిల్

**32. SATH(సస్టైనయిబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమన్ క్యాపిటల్) కార్యక్రమంలో భాగంగా ‘నీతి ఆయోగ్’ ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?**
ఎ) కర్ణాటక బి) అస్సోం సి) హర్యాన డి) ఉత్తరప్రదేశ్

**33. SATH కార్యక్రమంలో భాగంగా ‘నీతి ఆయోగ్’ విద్య కార్యక్రమాలు అమలు చేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?**
ఎ) బీహార్ బి) ఒడిశా సి) జార్ఖండ్ డి) మధ్యప్రదేశ్

**34. ఏ కార్యక్రమం 75 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా మోదీ నూతన భారత నిర్మాణం కోసం ‘సంకల్ప్ సె సిద్ధి’ అనే ప్రచారానికి పిలుపునిచ్చారు?**
ఎ) చంపారన్ ఉద్యమం
బి) క్విట్ ఇండియా ఉద్యమం
సి) సహాయ నిరాకరణ ఉద్యమం
డి) శాసన ఉల్లంఘన ఉద్యమం

**35. ఇటీవల గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురిలో లేనివారు?**
ఎ) స్మృతి ఇరాని బి) అహ్మద్ పటేల్
సి) శంకర్ సింఘ్ వాఘేలా డి) అమిత్‌షా

**36. ఇటీవల మరణించిన కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత అజ్మీర్ ఎం.పి. సన్వర్‌లాల్ జాట్ ఏ పార్టీకి చెందినవారు?**
ఎ) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)
బి) భారతీయ జనతాపార్టీ(బిజెపి)
సి) ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డి)
డి) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సి)

**37. ఆసియా సొసైటీ నుంచి 2017కి గాను ‘ఆసియా గేమ్ చేంజర్స్ అవార్డు’కి ఎంపికైనది?**
ఎ) నరేంద్ర మోదీ బి) రవీంద్ర జడేజా
సి) జాక్ మా డి) దేవ్ పటేల్

**38. 17 దేశాలు పాల్గొన్న ‘హార్ట్ ఆఫ్ ఆసియా’ 8వ సమావేశానికి 2017 ఆగస్టులో ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) ఆస్తానా(కజకిస్థాన్) బి) ఇస్తాంబుల్(టర్కీ)
సి) బాకు(అజర్‌బైజాన్) డి) న్యూఢిల్లీ(ఇండియా)

**39. ప్రపంచ యువజన దినోత్సవంగా ఆగస్టు 12ని ఐక్యరాజ్య సమితి ఎప్పటి నుంచి నిర్వహిస్తుంది?**
ఎ) 2000 బి) 1975 సి) 2002 డి) 1989

**40. భారత్‌లో తొలిసారి ‘విపత్తు నిర్వహణ సంస్థ’ను రైల్వే శాఖ ఏ గ్రామంలో ఏర్పాటు చేస్తుంది?**
ఎ) హెజ్జాల(బెంగళూరు) బి) బికనూర్(తెలంగాణ)
సి) యలమంచలి(ఆంధ్రప్రదేశ్)
డి) గుర్‌గామ్(హర్యాన)

**41. 2016 గణాంకాల ప్రకారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వెలువరించిన నివేదిక ప్రకారం 2021 నాటికి ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందనున్న నగరం?**
ఎ) ఢిల్లీ(ఇండియా) బి) హనోయ్(వియత్నాం)
సి) టోక్యో(జపాన్) డి) ముంబై(ఇండియా)

**42. యు ట్యూబ్‌కు పోటీగా 2017 ఆగస్టు 10న ఫేస్‌బుక్ ప్రారంభించిన చానల్?**
ఎ) బీ మై ఐస్ బి) విర్గో సి) వాచ్ డి) లిటిల్ వండర్

**43. ఒలింపిక్ పతకం సాధించే సత్తా కలిగిన క్రీడాకారుల సహాయం కోసం ప్రారంభించిన ‘టార్గెట్ ఆన్ ఒలింపిక్ పోడియం’లో చోటు పొందిన అతి పిన్న వయస్కుడు(15 ఏళ్లు) శపథ్ భరద్వాజ్ ఏ క్రీడాకారుడు?**
ఎ) బ్యాడ్మింటన్ బి) స్విమ్మింగ్
సి) బాక్సింగ్ డి) షూటింగ్

**44. భారత్‌తో సహా 80 దేశాలకు వీసా రహిత ప్రవేశానుమతి ఇస్తున్నట్లు ప్రకటించిన దేశం?**
ఎ) సౌదీఅరేబియా బి) టర్కీ సి) ఫిజి డి) ఖతార్

### సమాధానాలు

| | |
|---|---|
| 1) సి | 7) బి |
| 2) బి | 8) డి |
| 3) ఎ | 9) సి |
| 4) డి | 10) డి |
| 5) ఎ | 11) ఎ |
| 6) బి | 12) బి |

| | | | |
|---|---|---|---|
| 13) డి | 21) బి | 29) డి | 37) డి |
| 14) డి | 22) ఎ | 30) సి | 38) డి |
| 15) డి | 23) ఎ | 31) డి | 39) ఎ |
| 16) బి | 24) సి | 32) సి | 40) ఎ |
| 17) ఎ | 25) సి | 33) ఎ | 41) ఎ |
| 18) డి | 26) బి | 34) బి | 42) సి |
| 19) డి | 27) బి | 35) సి | 43) డి |
| 20) సి | 28) ఎ | 36) బి | 44) డి |

## ఉద్యోగాలు

### ఎన్‌హెచ్ఎఐ

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఎఐ)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సైట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 18
**కాంట్రాక్ట్ వ్యవధి:** రెండేళ్లు
**అర్హత:** బిఇ/ బిటెక్(సివిల్) ఉత్తీర్ణతతోపాటు రోడ్ & హైవే వర్క్స్‌లో ఏడాది అనుభవం ఉండాలి.
**వయసు:** దరఖాస్తు నాటికి 30 ఏళ్లు ఉండాలి.
**వేతనం:** నెలకు రూ.50,000
**దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 4
**చిరునామా:** Chief General Manager(Tech) & Regional Officer, Chennai
National Highways Authority of India Regional Office - Chennai
SRI Tower, 3rd Floor, DP - 34(SP), Industrial Estate, Guindy, Chennai, Tamil Nadu - 600032 **వెబ్‌సైట్:** www.nhai.org

### ఆర్మీ వార్ కాలేజ్

మధ్యప్రదేశ్, మహౌలోని ఆర్మీ వార్ కాలేజ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 10
**పోస్టులు:** ఎల్‌డిసి 3, సివిలియన్ మోటార్ డ్రైవర్ 2, కుక్ 1, సూపర్‌వైజర్ 3, ఫాటిగ్‌మన్ 1
**అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/ ఇంటర్ ఉత్తీర్ణత + నిమిషానికి 30 పదాల టైపింగ్ వేగం+ ఏడాది అనుభవం ఉండాలి
**వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ ద్వారా
**దరఖాస్తు ఫీజు:** రూ.50
**దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 27
**చిరునామా:** The Presiding Officer, Civilian Direct Recruitment(Scrutiny of Applica tions) Board, Junior Command Wing, Army War College, Mhow, Madhya Pradesh - 453441


# పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?

## భారతదేశ వ్యవసాయ రంగం

1. భారతదేశంలో సుమారు ఎంత శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉంది?
ఎ) 46 బి) 50 సి) 58 డి) 64
2. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా ఎంత శాతం?
ఎ) 14 బి) 15 సి) 16.5 డి) 17.5
3. భారతదేశంలో ఎంత శాతం జనాభా పేదరికంలో ఉంది?
ఎ) 24 బి) 25 సి) 26 డి) 27
4. ఒక దేశ అభివృద్ధికి సరైన నిర్వచనం దేనితో తెలుస్తుంది?
ఎ) వ్యవసాయ రంగం బి) రవాణా రంగం
సి) స్థూల ఉత్పత్తి రంగం డి) తలసరి ఆదాయం
5. భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా దేనిపై ఆధారపడి ఉంది?
ఎ) తయారీ రంగం బి) కార్పొరేట్ రంగం
సి) ప్రభుత్వ రంగం డి) వ్యవసాయ రంగం
6. 'ఆపరేషన్ ఫ్లడ్'కు పితామహుడు?
ఎ) నార్మన్ బోర్లాగ్ బి) ఎం.ఎస్. స్వామినాథన్
సి) డా. వర్గీస్ కురియన్ డి) విలియం గాండీ
7. భారతదేశంలో నూనె గింజల ఉత్పత్తి పెరగడానికి కారణం
ఎ) వైట్ రెవల్యూషన్ బి) ఎల్లో రెవల్యూషన్
సి) గ్రీన్ రెవల్యూషన్ డి) బ్రౌన్ రెవల్యూషన్
8. భారతదేశంలో అత్యధికంగా తేయాకును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) సిక్కిం
సి) అస్సాం డి) పశ్చిమ బెంగాల్
9. జాతీయ వ్యవసాయ బీమా పథకం ఎప్పటినుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 1997 అక్టోబరు బి) 1998 అక్టోబరు
సి) 1999 అక్టోబరు డి) 2000 అక్టోబరు
10. కింది వాటిలో ఖరీఫ్ పంట కానిది?
ఎ) జొన్న బి) మొక్క జొన్న
సి) వేరుశనగ డి) గోధుమ
11. కిందివాటిలో భారత జాతీయ ఆదాయాన్ని మదింపే సంస్థ?
ఎ) ప్రణాళికా సంఘం
బి) జాతీయ డేటా సెంటర్
సి) జాతీయ గణాంక సంస్థ
డి) ఏదీకాదు
12. నేషనల్ శాంపిల్ సర్వే సంస్థను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1947 బి) 1948
సి) 1949 డి) 1950
13. దేశంలో అత్యధికంగా రబ్బరును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) పశ్చిమ బెంగాల్ బి) గుజరాత్
సి) ఉత్తరప్రదేశ్ డి) కేరళ
14. 'ద ఫ్యూచర్ ఆఫ్ ఇండియా' గ్రంథ రచయిత?
ఎ) అమర్త్యసేన్ బి) బిమల్ జలాన్
సి) అభిషేక్ నాయర్ డి) చేతన్ భగత్
15. కుద్రేముఖ్ ఇనుప ఖనిజ ఫీల్డ్ ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) గుజరాత్ డి) కర్ణాటక
16. కూరగాయల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు 3) మూడు 4) నాలుగు


సందీప్ కంభంపాటి
సీనియర్ ఫ్యాకల్టీ

## జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ



17. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు
సి) మూడు డి) నాలుగు
18. నాబార్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1980 బి) 1981 సి) 1982 డి) 1983
19. హరిత విప్లవం ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1964 - 65 బి) 1965 - 66
సి) 1966 -67 డి) 1967 - 68
20. ప్రధాన మంత్రి గ్రామోద్యమ యోజన ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1999 బి) 2000 సి) 2001 డి) 2002
21. కింది వారిలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ చట్టాన్ని ఎవరు ప్రకటించారు?
ఎ) ప్రణబ్ ముఖర్జీ బి) మన్మోహన్ సింగ్
సి) చిదంబరం డి) అరుణ్ జైట్లీ
22. ప్రభుత్వ కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1953 ఏప్రిల్ బి) 1998 ఆగస్టు
సి) 1991 జూలై డి) 1995 నవంబరు
23. కిసాన్ కాల్ సెంటర్లను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2000 జూలై బి) 2002 మార్చి
సి) 2004 మార్చి డి) 2004 జనవరి
24. మైక్రో ఇరిగేషన్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2002 మార్చి బి) 2004 మార్చి
సి) 2004 జనవరి డి) 2006 జనవరి
25. 2013- 14 లెక్కల ప్రకారం అత్యధికంగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసిన రాష్ట్రం?
ఎ) మధ్యప్రదేశ్ బి) పంజాబ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
26. 2010 లెక్కల ప్రకారం భారతదేశంలో చెరువుల ద్వారా అత్యధిక భూమి సాగులో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తమిళనాడు డి) ఉత్తరప్రదేశ్
27. జాతీయ ఆహార భద్రత పథకాన్ని ఏ కాలంలో ప్రారంభించారు?
ఎ) తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
బి) పదో పంచవర్ష ప్రణాళిక చివరలో
సి) పదకొండో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
డి) పదకొండో పంచవర్ష ప్రణాళిక చివరలో
28. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'ను ప్రకటించినవారు?
ఎ) నరేంద్రమోది బి) మన్మోహన్ సింగ్
సి) ఎ.బి. వాజపేయి డి) ఐ.కె. గుజ్రాల్
29. భారత్‌లో జనపనార సాగు, ఏ నదీ పరివాహక ప్రాంతంలో ఎక్కువగా కేంద్రీకృతమైంది?
ఎ) గంగ బి) మహానది
సి) బ్రహ్మపుత్ర డి) గోదావరి
30. భారత్‌లో అతి పొడవైన సేద్య కాలువ?
ఎ) బకింగ్ హం బి) సర్వాంద్
సి) ఇందిరాగాంధీ డి) సట్లెజ్ - యమున
31. అత్యధికంగా పత్తిని ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) గుజరాత్
32. రబీ, ఖరీఫ్‌లే కాక వ్యవసాయ రంగంలోని మరో కాలం?
ఎ) జమాద్ బి) బరేసాతి సి) షరద్ డి) ఝుం
33. నేలకు ఎక్కువ నత్రజనిని అందించాలంటే ఏ పంటను పండించాలి?
ఎ) గోధుమ బి) ఆవాలు
సి) పొద్దు తిరుగుడు డి) చిరుధాన్యాలు
34. కింది వాటిలో ఏ పంటకు నల్ల రేగడి భూమి ఎక్కువగా అనుకూలించదు?
ఎ) పత్తి బి) గోధుమ
సి) వేరుశనగ డి) బంగాళదుంప
35. కింది వాటిలో వాణిజ్య పంట ఏది?
ఎ) వరి బి) గోధుమ
సి) చెరకు డి) జొన్నలు
36. కేరళలో ఎక్కువగా వినియోగించే వరి వంగడాన్ని ఉప్పునేలలో కూడా సాగుచేయవచ్చు. అయితే దాని పేరు?
ఎ) నీవారా బి) పొక్కలి సి) పొన్ని డి) సాంబ
37. పర్వత ప్రాంతాల్లో దేనిని ఎక్కువగా పండిస్తారు?
ఎ) వరి బి) తేయాకు
సి) వేరుశనగ డి) బంగాళదుంప
38. భారత్‌లో ఎక్కువగా ఉత్పత్తయ్యే కాఫీ రకం?
ఎ) ఓల్డ్ చిక్స్ బి) కూర్గే
సి) అరబిక్ డి) కెంట్స్
39. కేంద్రీయ వరి పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) కాన్పూరు
సి) కోయంబత్తూరు డి) కటక్
40. ఏ పంచవర్ష ప్రణాళిక కాలంలో వ్యవసాయ రంగంలో రుణాత్మక వృద్ధి నమోదయింది?
ఎ) మూడో బి) రెండో
సి) ఏడో డి) తొమ్మిదో

**సమాధానాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) సి | 7) బి | 13) డి | 19) సి | 27) డి | 35) సి |
| 2) డి | 8) సి | 14) బి | 20) బి | 28) బి | 36) బి |
| 3) సి | 9) సి | 15) డి | 21) ఎ | 29) ఎ | 37) బి |
| 4) డి | 10) డి | 16) బి | 22) బి | 30) సి | 38) సి |
| 5) డి | 11) సి | 17) ఎ | 23) డి | 31) డి | 39) డి |
| 6) సి | 12) డి | 18) సి | 24) బి | 32) ఎ | 40) ఎ |
| | | | 25) సి | 33) డి | |
| | | | 26) సి | 34) సి | |

## ఉద్యోగాలు

### గెయిల్ ఇండియా

గెయిల్ ఇండియా లిమిటెడ్ - కింది విభాగాల్లో **ఎస్ 3 & ఎస్ 5** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**ఖాళీలు:** 151
**విభాగాలు:** ఎలక్ట్రికల్, ఫైనాన్స్ & అకౌంట్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, లేబొరేటరీ, మార్కెటింగ్, అఫిషియల్ లాంగ్వేజ్, స్టోర్స్ & పర్చేజ్
పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 15
**వెబ్‌సైట్:** www.gailonline.com

### ఇండియన్ ఎయిర్ ఫోర్స్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్)- **సూపరింటెండెంట్, స్టోర్ కీపర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 95
**పోస్టులు - ఖాళీలు:** స్టోర్ సూపరింటెండెంట్ 55, స్టోర్ కీపర్ 40
**అర్హత:** సూపరింటెండెంట్‌కు డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. స్టోర్ కీపర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. రెండు పోస్టులకు స్టోర్ అకౌంట్స్ మెయింటైన్ చేయడంలో అనుభవం ఉండాలి.
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా
**పరీక్ష కేంద్రం:** ఢిల్లీ
**ఆర్డినరీ పోస్టు ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 9
**చిరునామా:** Director PC(AHC), Air Head quarter, J Block, New Delhi - 110106
**వెబ్‌సైట్:** www.indianforce.nic.in

### ఎఎహెచ్‌సి

అగ్రికల్చర్ & హార్టికల్చర్ కార్పొరేషన్- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 1600
**పోస్టులు:** డిస్ట్రిక్ట్ ఆఫీసర్(డేటా కలెక్షన్) 1182, డిస్ట్రిక్ట్ మేనేజర్ 197, ఎంఐఎస్ ఆఫీసర్ 197, ఏరియా మేనేజర్ 20, స్టేట్ హెడ్ 4
**అర్హత:** డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి
**ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
**దరఖాస్తు ఫీజు:** రూ.700
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 2
**వెబ్‌సైట్:** www.aahc.org.in

### వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్

వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
**మొత్తం ఖాళీలు:** 657
**పోస్టులు - ఖాళీలు:** మైనింగ్ సిర్దార్ 298, స్టాఫ్ నర్స్ 64, టెక్నీషియన్(రేడియోగ్రాఫర్ 1, పాథలాజికల్ 9, రిఫ్రాక్షన్/ ఆప్టోమెట్రి 1), ఆడియోమెట్రి టెక్నీషియన్ 4, జూనియర్ టెక్నీషియన్ (ఇసిజి/ ఇఇజి) 4, ఫార్మసిస్ట్ ట్రైనీ 2, ఓవర్సీర్ (సివిల్) 4, జూనియర్ టెక్నీషియన్ ఇన్‌స్పెక్టర్/ జూనియర్ కెమిస్ట్ 48, జూనియర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 32, ట్రాన్స్‌లేటర్ ట్రైనీ 9, క్లర్క్ 139, స్టోర్ ఇష్యూ క్లర్క్ 31, అసిస్టెంట్ లోడింగ్ క్లర్క్ 11
**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/ ఇంటర్/ మెట్రిక్యులేషన్/ డిగ్రీ పాసై ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** ఆగస్టు 30
**వెబ్‌సైట్:** www.westerncoal.nic.in

### ఐఐఎం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
**పోస్టులు:** అకౌంటెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్), జూనియర్ ఇంజనీర్, సీనియర్ లైబ్రరీ& ఇన్ఫో అసిస్టెంట్, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్
**వెబ్‌సైట్:** www.iimv.ac.in/careers

### ఐజిఎన్‌టియు

ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఐజిఎన్‌టియు)- ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
**క్యాంపస్‌లు:** అమర్‌కంటక్ క్యాంపస్ (యోగా డిపార్ట్‌మెంట్, కృషి విజ్ఞాన్ కేంద్ర ఐసిఏఆర్ ప్రాజెక్ట్, మోడల్ ట్రైబల్ స్కూల్), రీజనల్ క్యాంపస్ (మణిపూర్)(డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్ ఆంత్రపాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్)
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 11
**వెబ్‌సైట్:** www.igntu.ac.in/recruitment.htm

### ఇసిఐఎల్

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఇసిఐఎల్) - కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది
**పోస్టులు:** ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(న్యూక్లియర్), జనరల్ మేనేజర్(ఆర్&డి), డిప్యూటీ జనరల్ మేనేజర్(కంపెనీ సెక్రటరీ), పర్చేజ్ మేనేజర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్
**వెబ్‌సైట్:** http://careers.ecil.co.in

### రైట్స్ లిమిటెడ్

రైట్స్ లిమిటెడ్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
**పోస్టులు:** అడిషనల్ జనరల్ మేనేజర్ (సివిల్) 2, జాయింట్ జనరల్ మేనేజర్(సివిల్ 2, ఇ&ఎం ఎక్స్‌పర్ట్ 2), మేనేజర్(సోషియాలజీ, సోషల్ వర్క్) 1, అసిస్టెంట్ మేనేజర్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ 2, సోషియాలజీ / సోషల్ వర్క్ 2, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ 4), సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) 1, డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్) 1
పూర్తి వివరాలకు ఆగస్టు 26 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు
**వెబ్‌సైట్:** www.rites.com

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ఈదుపురం(ఇచ్ఛాపురంరూరల్): ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 438 విద్యార్థులకు బుధవారం ప్లేట్లు అందజేశారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రభుత్వం ఈ ప్లేట్లును అందించినట్టు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పట్నాయక్ తెలిపారు.



విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న ఏపీఎం చక్రపాణి

## మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం

కవిటి: కవిటి మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఏపీఎం ఎం.చక్రపాణి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహజన సమావేశం నిర్వహించి ఎంఎంఎస్ కార్యవర్గం ఎంపిక చేసినట్టు చెప్పారు. నూతన అధ్యక్షురాలిగా జె.పద్మ, ఉపాధ్యక్షురాలిగా బి.విమలకుమారి, కోశాధికారిగా ఈ.తులసమ్మను ఎన్నుకున్నారు. అనంతరం ఎవెన్యూ ప్లాంటేషన్, ఊరూర పశుగ్రాస క్షేత్రాలు, మొబైల్ బుక్‌కీపింగ్, బ్యాంక్ లింకేజీలపై చర్చించారు.

## రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఢిల్లీరావు

ఇచ్ఛాపురం రూరల్ : రైతు శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ దక్కత ఢిల్లీరావు అన్నారు. బుధవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మండలంలోని 45మంది రైతులకు జీడిమొక్కలు పంపిణీ చేశారు. కేశుపురంలో 25 మందికి, బెల్లుపడలో 8మంది, లొద్దపుట్టిలో ఇద్దరు, బూర్జపాడులో నలుగురికి మొక్కలు అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఢిల్లీరావు మాట్లాడుతూ, మొత్తం రూ.2లక్షల విలువగల 3,500 రకాల మొక్కలను ఉద్యానవనశాఖ ద్వారా పంపిణీ చేసినట్టు తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యానవనశాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను పొందాలన్నారు. మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి హరికృష్ణ, డి.కామేష్, బి.భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు




ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందిస్తున్న దృశ్యం

రాజపురం(కవిటిరూరల్ ): రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు దేవేంద్రరావు రూ.5వేలు విలువ గల ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. పేద విద్యార్థులను ఆదుకోవడంతో పాటు పాఠశాలకు అవసరమైన సామగ్రిని సమకూర్చాలన్నారు. ఈ సందర్భంగా దేవేంద్రరావును అభినందించారు.

## ఉక్కపోతతో ప్రజలు విలవిల

సంతబొమ్మాళి: ఉక్కపోతతో మండలంలో ప్రజలు విలవిల్లాడుతున్నారు. వర్షాకాలంలోనూ ఎండలు మండుతుండడంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనుల్లో రైతులు పొలాల్లో బిజీగా ఉన్నారు. మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# 'ఉపాధి'లో పురోగతి సాధించండి

కవిటి : ఉపాధి హామీ పథకం పనుల్లో పురోగతి సాధించాలని డ్వామా పీడీ హెచ్.కూర్మారావు అన్నారు. ఉపాధిహామీ సిబ్బందితో ఆయన బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర సహాయకుల పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎన్‌టీఆర్ జలసిరి, లేబర్ బడ్జెట్, ప్లాంటేషన్, ఆధార్ సీడింగ్, మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంటు కేంద్రా లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డి.సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

## చెత్త సేకరణకు రిక్షాలు

కవిటి మేజర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రానికి చెత్తసేకరణ కోసం 14వ ఆర్థిక సంఘ నిధులతో రెండు రిక్షాలు సమకూర్చినట్టు సర్పంచ్ పి.శేఖర్ తెలిపారు. వీటిని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ప్రారంభించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి తెలిపారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ కేంద్రాలకు తరలించనున్నట్టు ఆయన చెప్పారు. చెత్తను బయట పడేయకుండా ఓ చోట ఉంచాలన్నారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డి.సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.



చెత్తసేకరణ రిక్షాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ శేఖర్

# హెచ్‌ఎం బదిలీ రద్దు చేయాల్సిందే

● ఫిర్యాదు, దర్యాప్తు నివేదిక బహిర్గతం చేయండి
● విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్ ● పాఠశాలకు తాళం వేస్తామని హెచ్చరిక

జయపురం(నందిగాం): రాంపురం పంచాయతీ పరి ధి జయపురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పనిచేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లభ మల్లయ్య బదిలీని వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గిరిజన, యువజన సంఘ నాయకులు ఆందోళనకు దిగారు. నిబంధనల మేరకు మెనూ అమలుచేస్తూ, విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ మంచిపేరు తెచ్చుకున్న మల్లయ్య మాస్టార్ను రాజకీయ దురుద్దేశంతో బదిలీ చేయడం తగదని ఆందోళనకారులు అన్నారు. వెంటనే బదిలీ రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని, అవసరమైతే పాఠశాలకు తాళాలు వేసి, విద్యార్థులను ఇళ్లకు తీసుకువెళ్తామని హెచ్చరించారు.ఉప విద్యాశాఖాధికారిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మల్లయ్యను మందస మండలం పుట్టలోగాం ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా, గిరిజనేతర వ్యక్తి చేసిన తప్పుడు ఫిర్యాదుకు గిరిజన సంక్షేమాధికారులు బోల్తాపడి బదిలీ చేయడం మంచి పద్ధతి కాదని జిల్లా గిరిజన సంఘ అధ్యక్షుడు గేదెల వెంకటరమణ, ఎస్టీ సెల్ ప్రతినిధి రాంపురం పోతయ్య, స్థానిక వెంకటేశ్వర యువజన సంఘం ప్రతినిధి దాసుపురం సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టించి గిరిజన సంక్షేమాధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చినా ప్రత్యేక మెసెంజర్ ద్వారా బదిలీ ఉత్తర్వులు పంపించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు గతంలో వచ్చిన ఫిర్యాదును, దర్యాప్తు నివేదికను ప్రజా దర్బారు ద్వారా బయటపెట్టాలని వారంతా డిమాండ్ చేశారు.



జయపురం ఆశ్రమ పాఠశాల ఎదుట నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

# 'దమ్ములోనే భాస్వరం వాడాలి'

ఏఈవో సురేష్

కణితివూరు(నందిగాం): దమ్ములోనే భాస్వరం ఎరువును వాడాలని మండల ఏఈవో పి.సురేష్ రైతులను సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కణితివూరు, కామదేనువు గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించి మాట్లాడారు. సాగులో వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటిస్తే అత్యధిక దిగుబడులు సాధించగలరని చెప్పారు. పొలంలో కాలిబాటలు వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని, గాలి, వెలుతురు ప్రవహించి తద్వారా దోమపోటును నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు హారతి, మానస తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల ఫోన్‌నెంబర్లు

| | |
|---|---|
| **తహసీల్దార్:** | |
| డి.రామ్మోహన్ రావు | 9492726038 |
| **ఎంపీడీవో** | |
| సీహెచ్ శ్రీనివాసరెడ్డి | 8790007115 |
| **ఈవోపీఆర్డీ** | |
| పి.వసంతకుమారి | 7382242950 |
| **ఎంఈవో(ఇంజినీరింగ్)** | |
| ప్రవీణ్ కుమార్ | 9914334858 |
| **ఎంఈవో(ఎడ్యుకేషన్)** | |
| ఉదయభాస్కర్ | 7680070739 |
| **ఏఈ (హౌసింగ్)** | |
| దుర్గాప్రసాద్ | 7093930230 |
| **ఏఈ (విద్యుత్‌శాఖ)** | |
| పి.దుర్గాప్రసాద్ | 9440812437 |
| **ఏఈ (ఇరిగేషన్)** | |
| పాణిగ్రాహి | 8985236846 |
| **ఏవో (వ్యవసాయం)** | |
| పి.కిరణ్‌వాణి | 9908777355 |
| **ఏవో (ఉద్యానవనశాఖ)** | |
| లలితకుమారి | 9666241308 |
| **పశు వైద్యాధికారి** | |
| బి.శ్రీకాంత్ | 7680815777 |
| **ఏఈ (తాగునీటిశాఖ)** | |
| మురళీ కిషోర్ | 7702113335 |
| **ఏపీఎం (వెలుగు)** | |
| పి.కూర్మారావు | 8008803911 |
| **సబ్ ఇన్‌స్పెక్టర్** | |
| ఎం.వేణుగోపాలరావు | 9440795840 |

\- కంచిలి

## వైద్య సమాచారం

● కవిటి మండలం మాణిక్యపురం పీహెచ్‌సీ పరిధిలోని మాణిక్యపురం, తలతంపర, తలగానపుట్టుగ గ్రామాల్లో గురువారం చందన్న సంచార వైద్య సేవలు అందించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. రోగులను పరీక్షించి మందులు అందజేస్తామని, ఈసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గ్యాస్ సమాచారం

● సోంపేట శ్రీ సాయి ఏజెన్సీలో ఈ నెల 17 న గ్యాస్ బుకింగ్ చేసుకునే పట్టణ వినియోగదారులకు 18న, రూరల్ ప్రాంత వినియోగదారులకు 19న సిలిండర్లు పంపిణీ చేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు.

● ఇచ్ఛాపురం సిద్ధభైరవి గ్యాస్ ఏజెన్సీ ద్వారా కవిటి మండలంలోని రాజపురం, వింజగిరి, భైరిపురం, చండిపుట్టుగ, శిలగాం, కాజూరు, కరపాడు, హైవేలో గురువారం గ్యాస్ సరఫరా చేస్తామని ఏజెన్సీ ప్రతినిధి వెంకటేష్ తెలిపారు.

## సినిమాలు

**సోంపేట**
శ్రీనివాస.. లై
శివ...... నేనే రాజు..నేనే మంత్రి

**ఇచ్ఛాపురం**
పూర్ణ ... నేనే రాజు నేనే మంత్రి
శ్రీమణికంఠ.. జయ జానకి నాయక

**కవిటి**
మహాలక్ష్మి.. నేనే రాజు నేనే మంత్రి
అశోక్..... లై

## రాష్ట్రస్థాయి పోటీలకు కృష్ణసాయి విద్యార్థులు

**కంచిలి :** స్థానిక కృష్ణసాయి డిగ్రీ కళాశాలకు చెందిన బుడ్డెపు జగదీష్, కరక మహేష్ రాష్ట్రస్థాయి 1500 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పోటీలకు ఎంపికయినట్టు ప్రిన్సిపాల్ జల్లు జయప్రకాష్ తెలిపారు. వీరిని కరస్పాండెంట్ తమ్మినేని రామారావు, డీన్ బమ్మిడి ప్రకాష్‌రావు, అధ్యాపకులు జయశంకర్, శ్రీకాంత్, తదితరులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

**రామయ్యపట్నం (సోంపేట) :** మండలంలోని రామయ్యపట్నం, పల్లిగొల్లగండి, చాపలగొల్లగండి పాఠశాలల విద్యార్థులకు బుధవారం రామయ్యపట్నంకు చెందిన మడ్డు రాజారావు, నాగమణి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయుడు శివ తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం:**బెల్లుపడ కస్తూర్బా గాంధీ విద్యార్థినులకు సీనియర్ ఎల్ఐసీ ఏజెంట్ ఉప్పుల నాగేశ్వరావు 200 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పదో తరగతిలో పదికి 10 పాయింట్లు సాధించినవారికి రూ.2,016 అందజేస్తానని ఆయన తెలిపారు. పాఠశాల ప్రత్యేక అధికారి వాసంతి పాల్గొన్నారు.

## క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు

**ఇచ్ఛాపురం:** శ్రీకృష్ణాష్టమి పురస్కరిం చుకొని కేదారిపురంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు, న్యాయవాది అనపాన బైరాగిరెడ్డి బహుమతులు అందజేశారు. అలాగే, డ్యాన్స్, స్లోవాకింగ్, ఉట్టి కొట్టు పోటీల విజేతలకు కూడా బహు మతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుర్గయ్య, సారథి, దుదిష్టి, పరసయ్య, గణేష్, ఢిల్లేసు, గురునాథ్, కృష్ణశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు నీటి శుద్ధి పరికరం


నీటి శుద్ధి పరికరం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**ఇచ్ఛాపురం రూరల్ :** ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నీటి శుద్ధి పరికరాన్ని పూర్వ విద్యార్థులు బుధవారం అందజేశారు. 2011-12 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన దువ్వ శివాబ్బాయి ఇంజినీరింగ్ పూర్తిచేసి కుటుంబ సభ్యులతో తీర్థయాత్రకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శివ జ్ఞాపకార్థం తోటి విద్యార్థులు పాఠశాలకు వాటర్ ప్యూరిఫైడ్‌ను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పట్నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టెక్కలిలో సందడిగా నందోత్సవం

**టెక్కలి:** స్థానిక చిన్నబ్రాహ్మణవీధిలో రాధాకాంత మఠం ఆవరణలో బుధవారం నందోత్సవాన్ని మహంత్ మదన్ గోపాల్ దాస్‌జీ మహరాజ్ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. పిల్లలు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. చల్లపిడతలు కొడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో రాధాచరణ పట్నాయక్, ఎన్‌పీ పట్నాయక్, శివ, కృష్ణ ప్రధానో పాల్గొన్నారు.


చిన్నబ్రాహ్మణవీధిలో చల్లపిడత కొడుతున్న పిల్లలు

# ఉద్దానం ముద్దుబిడ్డ 'లచ్చన్న'

● ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి ● ఘనంగా జయంతి ● నివాళులర్పించిన ఎమ్మెల్యేలు అశోక్, శివాజీ

**సోంపేట :** ఉద్దానం ముద్దుబిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. లచ్చన్న జయంతిని సోంపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న ఘాట్‌వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లచ్చన్న అడు గుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్, సర్పంచ్ చిత్రాడ నాగరత్నం, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేష్, వాసుపల్లి కృష్ణ, బెందాళం బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

### *లచ్చన్న అడుగుజాడల్లో నడుద్దాం*

గౌతులచ్చన్న అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పలువురు వక్తలు అన్నారు. సోంపేటలోని లచ్చన్న ఘాట్‌వద్ద ఆయన కుమారుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందరశివాజీ, విజయలక్ష్మి దంపతులు నివాళులర్పించారు. చిత్రాడ శేఖర్,పొందూరు రాజు, తదితరులు పాల్గొన్నారు.

● గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా బారువలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్డు గురుమూర్తి, కాళ్ల రాజేశ్వరరావు, సానా రాజేష్‌ఖన్నా, పదుము లోకనాథం, దున్న సత్యం, తదితరులు పాల్గొన్నారు.




లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివాజీ , పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అశోక్

**ఇచ్ఛాపురం :** స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో గౌతు లచ్చన్న జయంతిని పీఏసీఎస్ డైరెక్టర్ నర్తు నరేంద్ర ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం నర్తు మాట్లాడుతూ, కాపులను బీసీ జాబితాల్లో చేరిస్తే బీసీలు తీవ్ర అన్యాయం అయిపోతారన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యుడు వాసుదేవరావు పాల్గొన్నారు.

**కవిటి రూరల్ :** అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శ ప్రాయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పొందల కృష్ణారావు అన్నారు. బుధవారం దూగానపుట్టుగ, రాజపురం గ్రామాల్లో లచ్చన్న జయంతి నిర్వహించారు. దూగానపుట్టులో లచ్చన్న విగ్రహానికి సర్పంచ్ ఎం.కృష్ణారావు, పొందల కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజపురంలో లచ్చన్న విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుడు హేమాచాలం పూలమాల వేశారు. తన రాజకీయ ప్రస్థానంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం లచ్చన్న పోరాడరని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో డి.కృష్ణారావు, ఢిల్లీరావు, హేమరావు, ఆనింగి జగ్గారావు, చిన్నప్పన్న, వాసుదేవరావు, నూకరాజు, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.



దూగానపుట్టుగ, బారువలో లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

## గ్రామీణ తపాలా సేవకుల సమ్మె

**కోటబొమ్మాళి:** వేతన సవరణ జనవరి 1, 2016 నుంచి అమలు చేసి జీడీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం కోటబొమ్మాళి ఎస్‌వో పరిధిలో 12 పోస్టల్ బ్రాంచ్‌ల సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.మౌనిక, సిహెచ్. ఢిల్లీరావు, పి.రామ్మోహనరావు, ఎస్.భవానీశంకర్, ఆర్‌వీఆర్ చౌదరి, యు.శ్రీనివాస్, ఏవీకే కూర్మారావు, ఆర్‌టీవీ రమణమూర్తి, జి.దేవ, ఎస్.దుర్గరాజు, కె.కూర్మారావు, ఆర్.ఆనందరావు, కేవీ రత్నం, పి.వరలక్ష్మి, కె.కృష్ణమూర్తి, పి.గోపి, జె.త్యాగరాజు పాల్గొన్నారు.


సమ్మెలో పాల్గొన్న పోస్టల్ సిబ్బంది

# 'మంత్రి ఆదినారాయణ క్షమాపణ చెప్పాలి'

**శ్రీకాకుళం సిటీ:** రాష్ట్ర మంత్రి ఆదినారాయణ రెడ్డి దళితులపై చేసిన అనుచితమైన వ్యాఖ్యలు దళితులను కించపరచడమేనని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బేసి మోహనరావు అన్నారు. దళితులపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అందుకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఏర్పాటు చేసి న విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆదినారాయణరెడ్డి మంత్రి పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నా రు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన లేక రిజర్వేషన్లపై మాట్లాడుతూ... గత 70 సంవత్సరాల నుంచి రిజర్వేషన్లు లబ్ధిపొందుతున్న దళితులు శుభ్రంగా ఉండరని, సరైన భాష మాట్లాడరని, నిరుపేదలని వ్యంగ్యంగా మాట్లాడుతూ.. యావత్తు దళితులకు తీవ్ర పదజాలంతో కించపరచడం తగదన్నారు. సమావేశంలో దళిత నాయకులు వి.ప్రతాప్, శ్రీను, కె.రామారావు, నాగపండు, ఎం.రామారావు, బలగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

### మంత్రి ఆదినారాయణ రెడ్డిని బర్తరఫ్ చేయాలి...

దళితులపై దారుణ వ్యాఖ్యలుచేసిన మంత్రి ఆదినారాయణ రెడ్డిని బర్తరఫ్ చే యాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కలివర పు సింహాచలం డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఇలిసిపురం అంబేద్కర్ విజ్ఞాన్‌భవన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మలమడుగు ఆసుపత్రి సమావేశంలో మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసి దళితుల మనోభావాలు దెబ్బతీశాయన్నారు. తక్షణమే మంత్రి పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీకాకుళం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కంఠ వేణు, ప్రతినిధులు నల్లబారిక శ్రీను, కె.చిరంజీవరావు, కె.వెంకటరావు, డి.జగన్నాథరావు పాల్గొన్నారు.

# దినఫలాలు



**అదృష్టసంఖ్యలు : 3, 8**



**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతముల నుంచి ఆహ్లాదకరమైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం.



**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం.



**మిథునరాశి: (మే21-జూన్21):** ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు ఫలిస్తాయి. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం. శుభవార్త అందుకుంటారు. రవాణా, బోధన రంగాల వారికి అనుకూలం.



**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. దూరప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి.



**సింహరాశి: (జూలై24-ఆగస్ట్23):** బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పెట్టుబడుల విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పూర్తిచేస్తారు.




**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** మిత్రులు, బంధువులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.



**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు పూర్తవుతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. మెడికల్ క్లెయిములు పరిష్కారం అవుతాయి.



**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. నూతన భాగస్వామ్యాలు లాభిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.



**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** వైద్య, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి అనుకూల సమయం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.



**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** డిపాజిట్లపై మంచి ప్రతిఫలాలు అందకుంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. బ్యాంకుల, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.



**మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20):** బదిలీలు, మార్పులకు అనుకూలం. హోటల్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి పోత్సాహకరం. సేవల రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# మొదటి పేజీ తరువాయి

## విద్యుత్ శాఖకు బకాయిల షాక్

విద్యుత్ శాఖకు ఇబ్బందులు తప్పడం లేదు.

● స్థానిక సంస్థలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని... విద్యుత్తు బిల్లుల చెల్లింపునకు ప్రత్యేకంగా 002 పేరిట ఖాతా ప్రారంభించి అందులో నగదు ఉంచాలని 2009లో ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

● బకాయిలను చెల్లించకపోతే సర్‌చార్జి కింద విద్యుత్ శాఖ భారీగా అపరాధ రుసుం వసూలు చేస్తుంది. ఆలస్యమయ్యే కొద్దీ 18 శాతం వడ్డీ విధిస్తుంది. వెరసి పంచాయతీలు, పురపాలక సంఘాలు అదనపు చెల్లింపులు తడి సి మోపెడవుతున్నాయి.

● సమీక్షలు నిర్వహించిన ప్రతిసారి ఉన్నతాధికారులు బకాయిలు చెల్లించాలని పంచాయతీల కార్యనిర్వహణాధికారులకు, పురపాలక సంఘ కమిషనర్లకు ఆదేశాలు ఇస్తునే ఉన్నారు. అయినా చాలా మున్సిపాల్టీలు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతానికి ఏకంగా రూ.54 కోట్ల బకాయిలున్నాయి. ఇవి కూడా ఏప్రిల్ వరకూ ఉన్నవి. మే, జూన్ నెలలతో కలుపుకుంటే రూ.60 కోట్లు దాటే అవకాశముంది.

● బిల్లుల చెల్లింపునకు నిధుల కొరత సాకు చూపే పాలకులు, యంత్రాంగం సాధారణ నిధుల నుంచి అభివృద్ధి పనుల కోసం కాంట్రాక్టర్లకు ఏటా కోట్లాది రూపాయలు చెల్లిస్తుండడం గమనార్హం. పర్సంటేజీలు అందుతాయనే కారణంగా చెల్లిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొన్ని పంచాయతీలకు ఆదాయం తక్కువగా ఉండడం వల్ల బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

### నీటి సరఫరా విభాగానిదే అధికం

మున్సిపాల్టీలు ప్రధానంగా నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు విద్యుత్ వినియోగిస్తున్నాయి. వాటికి సంబంధించిన బకాయిలు మాత్రం చెల్లించడం లేదు. రూ.54 కోట్ల బకాయిల్లో దాదాపు రూ. 40 కోట్లు నీటి సరఫరా విభాగానివే కావడం విశేషం. ఇదిలా ఉండగా ప్రతినెలా తప్పనిసరిగా విద్యుత్ బిల్లులు చెల్లించే పంచాయతీలు, మున్సిపాల్టీలు కూడా ఉన్నాయి. పురపాలక సంఘాలకు సంబంధించి శ్రీకాకుళం నగర పాలక సంస్థతో పాటు పాలకొండ మినహా మిగిలిన నాలుగు మున్సిపాల్టీలు బకాయిలు చెల్లింపులో క్రమశిక్షణ పాటిస్తున్నాయి.

### పాలకొండది ప్రత్యేక పంచాయతీ...

విద్యుత్ బిల్లుల చెల్లింపులో పాలకొండ నగర పంచాయతీ రూ.60 లక్షల బకాయి ఉంది. ప్రస్తుతం ఈ బకాయిలు చెల్లించే పరిస్థితి కూడా లేదు. దీనికి ప్రత్యేక కారణాలున్నాయి. 2013వరకూ పాలకొండ మేజర్ పంచాయతీగా ఉండేది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఆ ఏడాది నగర పంచాయతీగా స్థాయి పెరిగింది. దీంతో పాలకొండ పంచాయతీరాజ్ శాఖ నుంచి మున్సిపల్ పరిపాలన శాఖకు బదలాయించారు. దీంతో పంచాయతీరాజ్ యంత్రాంగం పాత బకాయిలు చెల్లించాల్సి ఉంది. మున్సిపల్ పాత బకాయిలు చెల్లించబోమని స్పష్టం చేసింది. దీంతో ఈ పాత బకాయిల చెల్లింపులపై ప్రతిష్టంభన నెలకొంది. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ లేఖ రాసినా అక్కడి నుంచి సమాధానం లేదు. అలాగే శ్రీకాకుళం పరిసరాల్లో ఉన్న చాపురం పంచాయతీ (గ్రామీణ మండలం పరిధిలోనివి) రూ.50 లక్షల బకాయి ఉంది. గతంలో ఈ పంచాయతీ శ్రీకాకుళం మున్సిపాలిటీలో విలీనం చేశారు. అనంతరం పంచాయతీ పాలకవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో తిరిగి పంచాయతీగా కొనసాగుతోంది. దీంతో ఈ విద్యుత్ బకాయిల చెల్లింపు అంశం ఇటు పురపాలన, అటు పంచాయతీరాజ్ శాఖల నడుమ నలుగుతోంది. విద్యుత్ శాఖ మాత్రం బకాయిల రాక ఇబ్బందులు పడుతోంది.

### చెల్లించాలని కోరుతున్నాం

మేజర్, మైనర్ పంచాయతీలతో పాటు బకాయిలున్న మున్సిపాలిటీలకు బిల్లులు చెల్లించాలని కోరుతున్నాం. ఆయా శాఖల ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ భారీ బకాయిలు వసూలైతే మరింత నాణ్యమైన విద్యుత్ సేవలను గృహ వినియోగదారులకు, వ్యాపార, ప్రభుత్వ సంస్థలకు అందించేందుకు ఆర్థిక వెసులుబాటు ఉంటుంది.

**- దత్తి సత్యనారాయణ, పర్యవేక్షక ఇంజనీర్, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ**

# ఉద్రిక్తం

వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ త్రివిక్రమ్ వర్మ



**(హిరమండలం-కొత్తూరు)**

వంశధార నిర్వాసిత గ్రామం పాడలిలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. గ్రామంలోని పంట పొలాలను చదును చేసేందుకు పోలీసుల రక్షణలో అధికారులు యంత్రాలతో చేరుకున్నారు. పనులు ప్రారంభిస్తుండగా సుమారు 300 మంది నిర్వాసితులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. ఇప్పుడే నాట్లు వేస్తున్నామని...మరో మూడు నెలల్లో పంట చేతికందుతుందని...అప్పటి వరకూ పనులు నిలిపివేయాలని కోరారు. దీనిపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు నిలిపివేసేది లేదన్నారు. పనులు చేస్తుండగా నిర్వాసితులు కోపోద్రిక్తులై పొక్లెయినర్ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి అందోళనకారులను తరిమే ప్రయత్నం చేశారు.

ఈ పరిస్థితుల్లో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణకు దారితీసింది. దీంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. దొరికిన వారిని దొరికినట్టు తరిమికొట్టారు. ఆందోళనకారులు అదేస్థాయిలో ప్రతిఘటించేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాల వారికీ గాయాలయ్యాయి. నిర్వాసితుల కంటే పోలీసులే అధికంగా గాయపడినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో 40 మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ త్రివిక్రమ వర్మ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గొడవలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితుల దాడిలో గాయపడిన పోలీసులను వైద్యచికిత్సకు వేర్వేరు ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆందోళనకారులను బుధవారం రాత్రి విడిచిపెట్టారు.



సంఘటన స్థలంలో గుమిగూడిన జనం

**● నివురుగప్పిన నిప్పులా**

గత పదిహేను రోజులుగా హిరమండలంతో పాటు నిర్వాసిత గ్రామాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఇప్పటివరకూ చెదురుమదురు ఘటనలు మినహాయించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. కానీ బుధవారం నాటి లాఠీచార్జి ఘటనతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు.

**● ఆంధ్రజ్యోతి విలేఖరిపై పోలీసుల దురుసు**

పాడలి సంఘటనపై వార్తలు సేకరించేందుకు వెళ్లిన హిరమండలం మండలం 'ఆంధ్రజ్యోతి' విలేఖరి పి.ప్రసన్నకుమార్‌పై పోలీసులు చేయిచేసుకున్నారు. తాను విలేఖరినని చెబుతున్నా వినిపించుకోకుండా కెమెరా, ఫోన్ బలవంతంగా లాక్కున్నారు.

## బైక్, కారు ఢీకొని నలుగురికి గాయాలు

**పాతపట్నం:** శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండల పరిధి బూరగాం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పాతపట్నం మండలం పరిధి రౌతులక్ష్మీపురం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కూర్మాన రాజారావు ద్విచక్ర వాహనంపై భార్య చిన్ని, కుమారులు గోవిందరాజు, ప్రభుదేవతో కలిసి సారవకోట వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా పాతపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న నలుగురికి గాయాలు తగిలాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పాతపట్నం హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సూక్తి

ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.

- సర్వేపల్లి రాధాకృష్ణ

## నవ్వుల్ నవ్వుల్

**టీచర్ :** మీ ఇంట్లో దొంగలు పడ్డారట కదా నిజమేనా!

**వెంగళప్పు :** అవును

**టీచర్ :** వాళ్లను చూసి నువ్వు భయంతో దాక్కున్నావట కదా.

**వెంగళప్పు :** నేను భయంతో దాక్కోలేదు.

**టీచర్ :** మరి!

**వెంగళప్పు :** మా ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడం మూలంగా దొంగలకు ముఖం చూపించడానికి సిగ్గేసింది.

## జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియలం ▸ ..................
2. ప్రయంళ ▸ ..................
3. నయంన ▸ ..................

- పత్తిపాక అంకిత, కోరుట్ల

## కొంటె ప్రశ్న

సముద్రం మధ్యలో ఏముంటుంది?



# 10,000 ఆమ్లెట్ ఫెస్టివల్

**ఇంట్లో ఆమ్లెట్ రుచి చూడటం అందరూ చేసేదే. హోటల్‌కెళ్తే డబల్ ఎగ్ ఆమ్లెట్‌ను ఆర్డర్ చేస్తాం. కానీ ఏకంగా పది వేల కోడిగుడ్లతో ఆమ్లెట్ వేయడం ఎక్కడైనా చూశారా? బెల్జియంలోని మాల్‌మెడి పట్టణంలో నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవంలో అలా ఆమ్లెట్ వేశారు. కోడిగుడ్లలో ఫిప్రోనిల్ అనే విషపదార్థం ఉందంటూ వార్తలు రావడంతో ఆ భయాన్ని పోగొట్టేందుకు ఈ ఆమ్లెట్ ఉత్సవాన్ని నిర్వహించారు.**

రోజూ గుడ్డు తినండి. ఆరోగ్యంగా ఉండండి అని టీవీల్లో చూస్తుంటాం. డాక్టర్లు సైతం కోడిగుడ్డు ఆరోగ్యానికి మంచిదని చెబుతుంటారు. అయితే యూరప్ దేశాల్లో నిర్వహించిన తనిఖీల్లో కోడిగుడ్లలో ప్రమాదకరమైన ఫిప్రోనిల్ అనే ఇన్‌సెక్టిసైడ్(పురుగులను చంపే రసాయన పదార్థం) ఉన్నట్లు తేలిందని వార్తలు వెలువడ్డాయి. యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అలర్ట్ సిస్టమ్ ఈ విషయాన్ని ధృవీకరించింది. బెల్జియంతో పాటు నెదర్లాండ్, జర్మనీ వంటి దాదాపు 18 దేశాల్లో ఈ రకమైన రసాయనం ఉన్న గుడ్లు ఉన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఇది ఆ నోట ఈ నోట జనాల్లోకి పాకిపోయింది. దాంతో ప్రజలు గుడ్లు తినడం మానేశారు. అయితే యూరప్ దేశాల్లో ఉత్పత్తి అయ్యే గుడ్లతో ఎలాంటి ప్రమాదం లేదని, హాంకాంగ్ నుంచి కల్తీ గుడ్లు వచ్చి చేరాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. అయితే అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. ప్రజలు కొన్ని లక్షల గుడ్లను నాశనం చేశారు. ఫిప్రోనిల్ ఉండే అవకాశం ఉన్న గుడ్లన్నింటినీ సూపర్‌మార్కెట్లలో నుంచి తొలగించారు. ఈ దెబ్బకు దాదాపు 180 పౌల్ట్రీ పరిశ్రమలు మూతపడ్డాయి.




### ఆమ్లెట్ ఫెస్టివల్‌తో మళ్లీ కళకళ

ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు ఆమ్లెట్ ఫెస్టివల్‌ను వేదికగా చేసుకోవాలని నిర్ణయించాయి వ్యాపార వర్గాలు. ఆమ్లెట్ ఫెస్టివల్ నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. రెండు దశాబ్దాలుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'ఆమ్లెట్ ఫెస్టివల్‌ను 22 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇది సంప్రదాయంగా వస్తోంది. ఇప్పుడు కోడిగుడ్లతో ప్రమాదం అని భయపడి ఫెస్టివల్ నిర్వహించకుండా ఉండలేం' అని బెల్జియంకు చెందిన ఒక కుటుంబం అభిప్రాయపడింది. నిర్వాహకులు సైతం వెనకంజ వేయకుండా ఆమ్లెట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు.

### ఆమ్లెట్ ఎలా వేశారంటే...!

ముందుగా నాణ్యమైన గుడ్లను వ్యాపారస్తుల నుంచి, సరఫరాదారుల దగ్గర నుంచి సేకరించారు. పట్టణంలోని సెంటర్‌లో కట్టెల పొయ్యి ఏర్పాటు చేశారు. 4 మీటర్ల వైశాల్యం ఉన్న ప్యాన్ పెట్టారు. అందులో కోడిగుడ్లను కొడుతూ బాగా కలియబెట్టారు. తరువాత ఆమ్లెట్‌లుగా వేస్తూ ఫెస్టివల్‌కు వచ్చిన వారందరికీ పంచారు. 'మా స్థానిక ఉత్పత్తులపై, మా సరఫరాదారులపై మాకు పూర్తి నమ్మకం ఉంది. మేం నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవానికి ఇంత మంది హాజరుకావడం కూడా ఆనందంగా ఉంది. ప్రజల్లో కొంత భయం మాట ఉన్న నిజం, అయితే ఇక్కడికి వచ్చిన వారి సంఖ్యను చూస్తే ముందున్నవి మంచి రోజులేనని అనిపిస్తోంది' అని కార్యక్రమానికి గ్రాండ్‌మాస్టర్‌గా పనిచేసిన గిల్లిస్ అన్నారు. గతంలోనూ బెల్జియంలో ఇలాంటి రూమర్ వ్యాపించింది. చికెన్, గుడ్లలో కార్సినోజన్‌గా పిలిచే డైఆక్సిన్ అనే విషపదార్థం ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అప్పటి నుంచి ఏటా ఫెస్టివల్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు.

## చుక్కలు కలపండి



## టంగ్‌ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.



## దారి కనుక్కోండి



## జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. UORF ▸ ..................
2. RAGE ▸ ..................
3. RWEA ▸ ..................

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

## జవాబులు

జంతర్‌మంతర్ : 1. విలయం 2. ప్రళయం 3.నయనం

జంబ్లింగ్ వర్డ్స్ : 1.FOUR 2.GEAR 3.WEAR

కొంటె ప్రశ్న : నీళ్లే ఉంటాయి.

# శిథిల రెవెన్యూ కార్యాలయాలకు మోక్షం

● జిల్లాకు 13 నూతన భవనాలు మంజూరు
● ఆమోదం తెలిపిన ప్రభుత్వం
● ఒక్కో భవనానికి రూ.90 లక్షలు కేటాయింపు


ఇలాంటి భవనాల స్థానంలో కొత్త భవనాలు రానున్నాయి

(కలెక్టరేట్)
దశాబ్దాలుగా శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్న తహసీల్దార్ కార్యాలయాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లాలో 13 నూతన రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. సర్కారుకు అత్యంత ఆదాయాన్ని తెచ్చిపెట్టే రెవెన్యూ కార్యాలయాల్లో చాలావరకు శిథిల స్థితికి చేరుకుని భవనాల పైకప్పులు పెచ్చులూడే పరిస్థితులు ఉన్నాయి. మరికొన్ని ఇరుకు భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో జిల్లాకు సంబంధించి 13 మండల రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వానికి గతంలో ప్రతిపాదనలు పంపించారు ఈ మేరకు పరిశీలించిన ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆమోదం తెలుపుతూ జీవోను విడుదల చేశారు. దీంతో జిల్లాలో 13 రెవెన్యూ కార్యాలయాలకు మోక్షం లభించింది. ఒక్కో భవనానికి సంబంధించి రూ.90 లక్షలు మంజూరుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా ఉండగా, మరో ఐదు మండలాలకు కూడా భవనాలు నిర్మించాల్సి ఉండగా, వీటికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందలేదు.

### విలువైన రికార్డులకు రక్షణ..

జిల్లాలో ఆయా మండలాలకు సంబంధించిన భూ వివరాలతో కూడిన రికార్డులకు ఇంత వరకు రక్షణ కరువైంది. శిథిలమైన భవనాల్లో కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయాలు కొనసాగడంతో వర్షాకాలం వస్తే ఎంతో విలువైన రికార్డులు తడిచి ముద్దైన సంఘటనలు కూడా జిల్లాలో ఉన్నాయి. అంతేకాకుండా ఎన్నికలకు సంబంధించిన సమాచార పత్రాలు కూడా ఇదే శిథిల భవనాల్లో అధికారులు భద్రపరిచే పరిస్థితి కూడా ఉండేది. దీంతో పలు మండలాల్లో రికార్డులు తడిచి ముద్దవ్వడంతో పాడయ్యాయి. దీంతో రైతులకు సమాచారం కావాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. కొత్త భవనాలు మంజూరు కావడంతో విలువైన రికార్డులకు రక్షణ లభించినట్టే.

### మంజూరైన మండలాలివే..

ఆమదాలవలస, బూర్జ, పొందూరు, రణస్థలం, రాజాం, వంగర, కొత్తూరు, నరసన్నపేట, గార, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పలాస, కవిటి.

# స్వాతంత్ర్య సమరయోధులకు తీపి కబురు

- పింఛన్ రూ.15వేలకు పెంచుతూ సీఎం ప్రకటన
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు


మార్పు సీతారామయ్యను సన్మానిస్తున్న ఇన్‌చార్జి మంత్రి పితాని (ఫైల్)

**టెక్కలి :** స్వాతంత్ర్య సమరయోధులకు పింఛన్ పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రకటించారు. ఈ తీపికబురు అందుకునే అవకాశం జిల్లాలో కొద్దిమందికే ఉంది. స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు పొందిన వారిలో జిల్లాకు చెందిన గరిమెల్ల సత్యనారాయణ, సర్దార్ గౌతు లచ్చన్న, పొట్నూరు స్వామిబాబు, కొత్తపల్లి పున్నయ్య, మార్పు పద్మనాభం, వీర గున్నమ్మ, చౌదరి సత్యనారాయణ, పుల్లెల శ్యామసుందరరావు వంటి వారు ఉన్నారు. వీరిలో జిల్లాలో మిగిలినది ఏడుగురిగానే జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీరిని శ్రీకాకుళంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి పితాని సత్యనారాయణ సత్కరించంది. వీరికి ప్రభుత్వం ప్రస్తుతం నెలకు రూ.7వేల పింఛన్ ఇస్తుండగా, దాన్ని రూ.15వేలు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ నిర్ణయంతో జిల్లాకు చెందిన కోటబొమ్మాళి మండలం తిలారుకు చెందిన మంత్రి అప్పలరామయ్య, చిట్టయ్యవలసకు చెందిన కరుకోల జయలక్ష్మి, చిన్నవెంకటాపురంకు చెందిన బొడ్డేపల్లి సరస్వతమ్మ, మందస మండలం మదనాపురం గ్రామానికి చెందిన మార్పు సీతారామయ్య, సారవకోట మండలం అలుదుకు చెందిన రావాడ లక్ష్మీనారాయణమ్మ, శ్రీకాకుళంకు చెందిన కోరాడ పార్వతీదేవి, కరుకోల వెంకటపతిలకు పింఛన్ పెరగనుంది. ఇదిలా ఉంటే జిల్లాకు చెందిన మరికొందరు స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్నప్పటికీ వారి పేర్లు ప్రభుత్వ జాబితాల్లో కనిపించడం లేదు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని నెమరువేసుకుంటున్న కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన వైశ్యరాజు నర్సింహరాజు లాంటి పేర్లు గల్లంతయ్యాయి. ఏదిఏమైనా ఇన్నాళ్లకు ప్రభుత్వం ఓ తీపికబురు అందించిందని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులంటున్నారు.

# వానొచ్చే.. రైతుకు ఆనందం తెచ్చే

● ఊపందుకోనున్న ఖరీఫ్ పనులు
● తడిసి ముద్దయిన సిక్కోలు, పలాస-కాశీబుగ్గ


శ్రీకాకుళంలో కమ్ముకున్న మేఘాలు

(శ్రీకాకుళం సిటీ)
జిల్లావ్యాప్తంగా పలుచోట్ల బుధవారం ఓ మోస్తరు నుంచి భారీగా కురిసిన వర్షాలు రైతుల్లో ఆనందాన్ని నింపాయి. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా సరైన వర్షాలు లేక ఆకాశం వైపు దిక్కులు చూస్తున్న అన్నదాతలను ఊరడించేలా కుండపోత వర్షం కురిసింది. శ్రీకాకుళం, పరిసర మండలాలు, పలాస, పాలకొండ, వీరఘట్టం, రాజాం ప్రాంతాల్లో కురిసిన వర్షాలు ఖరీఫ్‌కు ఊపిరి పోశాయి. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 2.08 లక్షల హెక్టార్లలో వరి సేద్యం చేసేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించగా, రెండు నెలలుగా తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వరి నాట్లు వేయడంలో జాప్యం చోటు చేసుకుంది. విపరీతమైన ఎండలతో నారు, ఎదలు ఎండిపోయాయి. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో కురిసిన ఈ వర్షాలతో రైతులు పొలం బాట పట్టనున్నారు. శ్రీకాకుళంలో కురిసిన భారీవర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల ప్రజలు ఇక్కట్లు పడ్డారు

### వరుసగా 8వ రోజూ..

**పలాస:** పలాస-కాశీబుగ్గలో 8వ రోజు బుధవారం కూడా ఒకే సమయానికి భారీ వర్షం కురిసింది. ప్రతీ రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల మధ్యన ఈ వర్షం కురవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 30, 40 సంవత్సరాల క్రితం ఇలా వర్షం కురిసిందని వృద్ధులు చెబుతున్నారు. ఈ వర్షాలతో జంట పట్టణాల్లోని రోడ్లన్నీ జలమయం కాగా, పొలాల్లో నీరు పొంగిపొర్లుతోంది. అన్నీ చెరువులు నిండిపోయాయి. ఇదిలా ఉండగా వర్షాలకు భారీ వృక్షాలు నేలకూలాయి. రైల్వేకాలనీలో 40ఏళ్ల క్రితం నుంచి ఉన్న వృక్షాలు రోడ్డుమీద పడడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ తీగలపై చెట్టు పడడంతో సాయంత్రం సరికి రైల్వేవిద్యుత్ శాఖాధికారులు వాటిని సరి చేశారు.


జలమయమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ


పలాసలో పాత జాతీయ రహదారి శ్రీచైతన్య స్కూల్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



# రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా బేస్‌బాల్ జట్లు

**శ్రీకాకుళం సిటీ :** కడప జిల్లా జమ్మలమడుగు లో 18 నుంచి 20 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జట్లు బుధవారం పయనమయ్యాయి. ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ఈ జట్లను ఆశీర్వదించి పంపారు. రాష్ట్ర విజేతలుగా తిరిగి రావాలని జిల్లా బేస్‌బాల్ సంఘం అధ్యక్ష ప్రధానకార్యదర్శులు కె.వేణుగోపాలరావు, కె.భాస్కరరావు ఆకాంక్షించారు.

## రక్త దానం చేయండి.. ప్రాణ దాతలు కండి

**పొందూరు:** ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని మండల రెడ్‌క్రాస్ కన్వీనర్ కె.శాంతారాం పిలుపునిచ్చారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వల కొరత విపరీతంగా ఉందని దీనివల్ల ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొరత తీరాలంటే రక్తదానం చేసేవారు పెరగాలన్నారు. రక్తదానం విషయంలో ఉన్న అపోహలను విడనాడాలని కోరారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

# రక్షక భటులకు వసతి లేకపోయే..!

● శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లు
● సుదూర ప్రాంతాల నుంచే సిబ్బంది రాకపోకలు..



తుప్పల మధ్యలో శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లు

**సరుబుజ్జిలి:** మండల కేంద్రంలోగల పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బందికి నివాస గృహాలు లేకపో వడంతో సుదూర ప్రాంతాలైన ఆమదాలవలస, శ్రీకా కుళం, పాలకొండ నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట.. రెండు మండలాలకు ఒకే పోలీస్‌స్టేషన్ ఉండటంతో సిబ్బంది విధి నిర్వహణ కోసం నానా యాతన పడాల్సి వస్తోంది. అత్యవసర సంఘటన సమ యాల్లో సరైన సమయానికి చేరుకోలేక పోతు న్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది.



బోర్డుతో ఉన్న శిథిల భవనం

### ఆదిలోనే హంసపాదు..

సుమారు పదిహేను సంవత్సరాల క్రిందట పోలీసు ఠాణా సిబ్బంది కోసం క్వార్టర్ల నిర్మాణం చేపట్టారు. ఇది ఆదిలోనే హంసపాదులా తయా రయ్యింది. నిర్మాణాలు చేపట్టిన కొద్ది రోజులే సిబ్బం ది నివశించారు. నివాసాలకు చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో పక్క చెరువులోంచి విష సర్పాలు, క్రిమి కీటకాలు ఇళ్లలోకి ప్రవేశించి అలజడి సృష్టిం చేవి. వర్షాకాలం వస్తే గృహాలు నీటి ముంపునకు గురయ్యేవి. రాత్రి వేళలో సిబ్బందికి కూడా రక్షణ లేకపోయేది.

### పునర్నిర్మాణం చేపట్టండి

కొన్ని సంవత్సరాలు ఈ క్వార్టర్లను నిరుప యోగంగా ఉంచడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థలో ఉన్న ఈ క్వార్టర్లను కూలతోసి పున ర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు, సిబ్బంది కోరు తున్నారు.

## దాత సహాయంతో బస్‌షెల్టర్ నిర్మాణం



భూమి పూజ చేస్తున్న గ్రామస్థులు

**కొర్లకోట (ఆమదాలవలస రూరల్):** కొర్లకోట గ్రామంలో కొత్త కాలనీ వద్ద దాత సీపాన దంతేశ్వరరావు బస్ షెల్టర్ నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. సుమారు రూ.1.5 లక్షల వ్యయంతో బస్ షెల్టర్ నిర్మాణానికి దాత ముందుకు వచ్చా రని, ఇలా దాతలు ముందుకు వస్తే గ్రామా భివృద్ధి సాధ్యమవుతుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. భూమిపూజలో వార్డు మెంబర్ అన్నెపు గోవిందరరావు, పేడాడ పూర్ణారావు, పేడాడ రామారావు, రాజు, సనపల సతీష్, సువ్వారి ఈశ్వరరావు, పేడాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్లాదకర వాతావరణ కల్పనకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ గీత



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**ఆమదాలవలస రూరల్:** పురపాలక సంఘ పరిధి లో ఆహాదరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. ప్రణాళికేతర నిధులు రూ.1.37 లక్షలతో 15వ వార్డు ఉమారామలింగేశ్వర పుష్కరణి పార్కు ప్రాంగ ణంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభానికి ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. పురపాలక సంఘం పరిధి పార్కుల్లో మౌలిక వసతులతో పాటు ప్రశాంత నిలయాలుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా మని తెలిపారు. అనంతరం వార్డుల్లో ఉన్న సమస్యలపై కౌన్సిలర్ ఆమెకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొన్నాడ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, తమ్మినేని విద్యాసాగర్, రెడ్డి రాంబాబు, జీడీ ప్రసాద్, పి.చిన్నారావు, ఏఈ డీబీ శ్రీనివాసరావు, టీపీఎస్ జి.సీతారాం, ఏవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచినవారికి మరింత ప్రోత్సాహం



సైకిల్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీదేవి

**ఆమదాలవలస రూరల్:** పరీక్షలలో ప్రతిభ కనబరి చిన విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందిస్తామని మాజీ వైస్ ఎంపీపీ వండాన వెంకట ఉదయ్ కుమార్ అన్నారు. నిమ్మతొర్లాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2017వ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన కెంబూరు ఇందిరకు సర్పంచ్ వండాన శ్రీదేవి చేతుల మీదుగా బుధవారం సైకిల్ పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చది వే విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులే వెలికి తీయాల న్నారు. అనంతరం పంచాయతీ పరిధి మర్రి కొత్తవలస గ్రామం స్వర్గీయ గులివిందల వీరపునాయుడు జ్ఞాపకా ర్థం ఆయన కుమారుడు అప్పలనాయుడు.. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీ య బహుమతులుగా రూ.2500, రూ.1500, రూ.1000 లను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురా లు కె.ఇందుమతి, ప్రధానోపాధ్యయులు ఎ.ఈశ్వరరావు, మార్కెట్ కమీటీ డైరెక్టర్ పొట్నూరు కొండయ్య, విద్యాకమిటీ చైర్మన్లు చేపేన గురుమూర్తి, రెడ్డి అప్పలనాయుడు, ముద్దాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గురువుల సేవలు చిరకాలం గుర్తుంటాయి



ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న దృశ్యం

**తొటాడ(ఆమదాలవలస):** ఉపాధ్యా యుల సేవలు గ్రామాల్లో చిరకాలం గుర్తుం టాయని సర్పంచ్ కూన అమ్మాజీ అన్నారు. తొటాడ ప్రాథమిక పాఠశాలనుంచి బదిలీ అయిన ఉపాధ్యాయుడు కె.చంద్రమౌళి, తెలుగు పండితుడు సూర పాపారావులకు బుధవారం సన్మాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బెండి రమణమూర్తి, ఎంఈవో బబి చంద్రశేఖర్‌లతో పాటు గ్రామస్థులు తాండ్ర రాము, హనుమంతు బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



సంఘటనా స్థలంలో పడి ఉన్న లారీ, బైక్

**ఆమదాలవలస:** ఆమదాలవలస నుంచి పురుషోత్త పురం వెళ్లే రోడ్డు మలుపు వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. పురుషోత్తపురం నుంచి కల్లేపల్లి శ్రీను అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి.. అదే సమయంలో గుణుపూర్ నుంచి నరస న్నపేట వైపు అట్టల లోడుతో వస్తున్న మీని లారీ ఢీ కొట్టింది. దీంతో లారీ.. ద్విచక్ర వాహనంతో పాటు యువ కుడిని కొంత దూరం లాక్కొని వెళ్లింది.

### తెగి పడిన విద్యుత్ తీగలు.. అప్రమత్తమైన అధికారులు

ప్రమాదానికి కారణమైన లారీ కొంతదూరం వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి రోడ్డు పైనే పడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరు కుని విద్యుత్ శాఖాధికారులకు విషయం తెలియజేశారు. విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా ను నిలిపి వేశారు. ఆ రహదారిలో ప్రయాణించే వాహ నాలను కొంత సమయం నిలుపుదల చేశారు. క్షతగా త్రుడిని చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

## స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగస్వాములు కండి



ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే అధికారులు, సిబ్బంది

**ఆమదాలవలస రూరల్:** స్వచ్ఛ భారత్ మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలని రైల్వే ఏఈ ఎన్.గురునాథరావు అన్నారు. శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో పక్షం రోజులపాటు నిర్వహించనున్న స్వచ్ఛ భారత్ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయాలని విన్నవించారు. అనంతరం ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. రైల్వే కాలనీ, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో ఎస్ఎంఆర్ రాజు, కేవీ రావు, సీఐటీ రత్నకుమార్, అలీ తది తరులు పాల్గొన్నారు.

## ‘మడ్డువలస’ బాధితులకు భరోసా

**పొందూరు:** మడ్డువలస రెండోదశ కాలువ నిర్మాణంలో భూము లు కోల్పోయిన బాధితులకు ఎటువంటి అన్యాయం జరగదని ప్రస్తుత ధరల ఆధారంగా నిబంధనల మేరకు నష్ట పరిహారం చెల్లి స్తారని భూసేకరణ యూనిట్-4 ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గౌతంకు మారి చెప్పారు. కాలువ నిర్మాణంలో భాగంగా రాపాక గ్రామం పక్క నున్న భూములను గుర్తించారు. ప్రస్తుతం ఇక్కడ భూముల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని గృహ నిర్మాణాలకు అనుగుణంగా ఉన్న భూమి కావడంతో ఎక్కువ ధర పలుకుతోందని రైతులు అధికా రులకు తెలిపారు. నష్ట పరిహారం విషయం జిల్లా అధికారులు చూ స్తారని రైతులకు ఎటువంటి నష్టం జరగదని భరోసా ఇచ్చారు. ఈ కాలువ భూముల గుర్తింపు కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసా దరావు, ఆర్ఐ ఈశ్వరరావు, మడ్డువలస ఏఈ నాగన్న తదిత రులు ఉన్నారు.

## కార్పొరేషన్ల ద్వారా రుణాలు టీడీపీ ఘనతే



మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**పొందూరు:** వివిధ కార్పొ రేషన్ల ద్వారా యువతకు రుణాలు అందిస్తున్న ఘనత టీడీపీదేనని జడ్పీటీసీ సభ్యుడు లోలుగు శ్రీరాము నాయుడు, జన్మభూమి కమి టీ మండల సభ్యుడు జీహెచ్ రామ్మోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరే షన్ల ద్వారా రుణమేళా నిర్వహించారు. బీసీ కార్పొరేష న్ రుణాల లక్ష్యం 146 యూనిట్లకు గాను 670 మంది, ఎస్సీ కార్పొరే షన్ రుణాల లక్ష్యం 42 యూనిట్లకు 215 మంది, ఎస్టీ కార్పొరేషన్ రుణాల లక్ష్యం 2 యూనిట్లకు 28 మంది, కాపు కార్పొరేషన్ రుణాల లక్ష్యం 15 యూ నిట్లకు 107 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి వివిధ కార్పొరే ్షన్ల, బ్యాంకు అధికారుల సమక్షంలో మౌఖిక పరీక్షలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, బీసీ కార్పొ రేషన్ అధికారి జి.గోపి, బ్యాంకుల అధికారులు మురళీకృష్ణ, కృష్ణంనా యుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎండీఎం కార్మికుల పొట్ట కొడితే పోరాటమే

**పొందూరు:** రాష్ట్రంలో ఏళ్ళతరబడి మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా పనిచేస్తున్న వారి పొట్టలు కొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇదే జరిగితే ప్రభుత్వంపై పెద్దఎత్తున పోరాటం తప్పదని మధ్యాహ్న భోజన పథకం జిల్లా ఉపాధ్యక్షురాలు రాంబిల్లి అంజలి హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం రెండు మండలాల కార్మికుల సమావేశం నిర్వహించారు. ధరలు పెరుగుతు న్నా దానికి అనుగుణంగా ప్రభుత్వం నిధులు పెంచకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వారా నికి మూడు రోజులకుగాను గుడ్లు ఇస్తూ ఆరురోజులకు తమ నుంచి బిల్లులు అడుగుతున్నారని దీనివల్ల మధ్యాహ్న భోజన పథక కార్మికు లు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎండీఎం కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలను ఆపకపోతే తీవ్ర ప్రతిఘటన తప్ప దని హెచ్చరించారు. కార్యక్రమంలో రెండు మండలాల నుంచి ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.

## నారాయణపురం భూములకు సాగుహక్కు కల్పించాలి

ఎచ్చెర్ల: చిలకపాలెం సమీపంలోని నారాయణపురం భూములకు సాగు హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు బుధవారం తహసీల్దార్ కిమిడి రామ్మోహనరావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. కొన్నేళ్లుగా ఇదే భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని..సాగు హక్కు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ రైతు సంఘం నేతలు కె.మోహనరావు, తోణంగి నందోడు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్డు నిర్మాణం

## చెల్లించని నష్ట పరిహారం

● పూర్తికాని రోడ్డు పనులు

ఎచ్చెర్ల: పొన్నాడ వంతెన నిర్మాణపు పనులు పూర్తికావడం, ప్రారంభోత్సవం పూర్తయ్యింది. వంతెనకు ఆనుకొని అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు జరగకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుమారు 400 మీటర్ల పొడవున రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం తప్పడంలేదు. అసంపూర్తిగా ఉన్న రోడ్డుకు సంబంధించిన రైతులకు ఇంకా నష్టపరిహారం చెల్లించలేదు. దీంతో రోడ్డు పనులు పూర్తికాలేదు. ఈ వంతెన మీదుగా పొన్నాడ, కొంగరాం, ధర్మవరం, భగిరదీపురం, బొంతలకోడూరు, డి.మత్స్యలేశం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. తాత్కాలికంగా వేసిన రోడ్డు పాడవ్వడంతో వాహనచోదకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తిచేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టండి

వెంకటాపురం(లావేరు) : వెంకటాపురంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో విద్యుత్ సౌకర్యం నిలిచిపోయిందని...తక్షణం బాగు చేయాలని రైతులు ఎస్.సూర్యారావు, తవుడు, నీలయ్య, రమణ, తమ్మినాయుడు, సత్యం తదితరులు కోరారు. ఖరీఫ్ పనులకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా తక్షణం ట్రాన్స్‌కో అధికారులు స్పందించాలని కోరారు.



సంతోషిమాత కాలనీలో కాలువలు లేక రోడ్డుపై మురుగు నీరు



నిల్వ వున్న ఖాళీ కొబ్బరిబొండాలు

## ఇలా ఉంటే వ్యాధులు రావా?



కాలువల్లో పేరుకుపోయిన చెత్త

(రణస్థలం)

చెదురుమదురు వర్షాలు పడుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం దారుణంగా మారుతోంది. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టినా ప్రయోజనం లేకపోతోంది. మండల కేంద్రంలో కూడా పరిస్థితి దారుణంగా ఉంటోంది. రణస్థలం బ్రాహ్మణ వీధిలో కాలువలు దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. దీంతో ఇళ్లలోకి వర్షపు, మురుగునీరు చేరుతోంది. దోమలు విజృంభించి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండల కేంద్రంలోని సంతోషిమాత, వెంకటేశ్వర కాలనీలో కాలువలు లేక పోవడంతో పరిస్థితి దయనీయంగా మారుతోంది. జాతీయ రహదారికిరువైపులా కాలువలు పూడికపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రధానంగా ఖాళీ కొబ్బరిబొండాలు విడిచిపెడుతుండడంతో అవి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. అలాగే మండలంలోని జీరుపాలెం, అల్లివలస, చీకటపేట, గుర్రయ్యపేట, ఎన్‌జీఆర్‌పురం, దోనిపేట, కొత్తముక్కాం తదితర గ్రామాల్లో పారిశుధ్యం దారుణంగా క్షీణించింది. ఇప్పటికైనా ఆయా పంచాయతీ అధికారులు మేలుకోకుంటే ముప్పే..!



ప్రహరీ లేని పాత రౌతుపేట ప్రాథమిక పాఠశాల

## ప్రహరీ లేక విద్యార్థులకు ఇక్కట్లు

పాతరౌతు పేట(లావేరు) : పాతరౌతుపేట ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విష జంతువులతో పాటు పశువులు లోనికి ప్రవేశించి పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని వారు కోరుతున్నారు.

## పనిచేసే ఉద్యోగికి ప్రజల్లో గుర్తింపు

లెంకపేట (రణస్థలం) : అంకిత భావంతో పనిచేసే ఉద్యోగికి ప్రజల ఆదరణ ఉంటుందని లెంకపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సీహెచ్ గురుమూర్తి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, రమణ, మూర్తి, కేవీఎస్ఎన్ రాజు, వాణి, జానకి, సీహెచ్ శ్రీనులను గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ అందరి సహకారంతో ఉత్తమ విద్యాబోధన సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

జలుమూరు: హరికృష్ణమ్మపేట వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలగూన చంద్రం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కోటబొమ్మాళి మండలం చిన్న సవడాం గ్రామానికి చెం దిన చంద్రం సైకిల్‌పై చల్లవానిపేట వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. చంద్రం కుడి కాలు పాదానికి, మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

## మహిళా వివక్షతను అరికట్టాలి

ఎచ్చెర్ల: మహిళ వివక్షత అరికట్టాలని ఎంపీడీవో బీబీ మిశ్రో అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు..స్త్రీపురుష అసమానతలు సరికాదన్నారు. స్థానిక సంస్థల్లో మహిళ ప్రాధాన్యం పెంచేందుకు 33 శాతం రిజర్వేషన్ అమలవుతున్నట్టు చెప్పారు. బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళా వివక్షతను అరికట్టాల్సి ఉందన్నారు. స్త్రీ, పురుష సమానత్వం సాధించాల్సి ఉందన్నారు. మహి ళాభ్యున్నతికి దోహదపడాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీలు బి.సత్యనారాయణ, ఎల్.పార్వతి, కేవీ లక్ష్మీ, ఎంవీ రమణ, ఎం.గన్నెప్పడు, ఎం.శ్రీనివాసరావు, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల మండల సమ్మెఖ్య అధ్యక్షులు, కమ్యూనిటీ రి సోర్స్ పర్సన్స్, ఈవోపీఆర్డీలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేను త్వరితగతిన పూర్తిచేయండి

లావేరు : వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ రంగారావు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిసిబ్బందిలో సమన్వయంతో పనిచేసి ఈనెల 19లోగా సర్వే నివేదికను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ఈనెల 21న కేంద్ర బృందం పర్యటన ఉందని... అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసీ ఎస్.గౌరీశంకర్, సాంకేతిక సహాయకులు రమణమూర్తి, రత్నాకర్, రవి, హైమావతి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన టీడీపీ నేతలు

### సత్యేంద్ర వర్మ స్థానం భర్తీపై..

## టీడీపీ సమావేశంలో విస్తృత చర్చ

● కుదరని ఏకాభిప్రాయం

రణస్థలం : రానున్నది ఎన్నికల సంవత్సరం కావడంతో మండలంలో తెలుగుదేశం పార్టీని నడిపించగల సమర్థుడైన వ్యక్తికే అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని నాయకులు, కార్యకర్తలు నిర్ణయించారు. రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న దంతులూరి సత్యేంద్రవర్మ నాలుగు నెలల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ తరువాత జరిగిన సమావేశంలో తాత్కాలికంగా సత్యేంద్ర వర్మ భార్య సుశీలమ్మను అధ్యక్షురాలిగా కొనసాగించాలని నిర్ణయించారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా పూర్తిస్థాయి అధ్యక్షుడ్ని ఎన్నుకునేందుకుగాను బుధవారం మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలు అంతరంగిక సమావేశం జరిగింది. 30 పంచాయతీల ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షురాలిగా దంతులూరి సుశీలమ్మనే కొనసాగించాలని ఎంపీపీ గొర్లె విజయకుమార్‌నాయుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డీజీఎం ఆనందరావు, కలిశెట్టి సహదేవుడు, జోగురాజు చిన్నమౌళి, లంక ప్రభాకరరావు, పిషిని జగన్నాథంనాయుడు తదితరులు 12 మంది వరకూ పేర్లు తెరపైకి వచ్చాయి. ఒక దశలో ఎంపికపై నాయకుల మధ్య వాగ్వాదం కూడా చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) కు అధ్యక్షత బాధ్యతలు అప్పగించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కళా వెంకటరావు సూచనల ద్వారా అధ్యక్షుడ్ని ఎన్నుకుందామని నిర్ణయించి సమావేశాన్ని ముగించారు.

## జింక్ ఎరువు కోసం రైతుల పరుగులు

**పోలాకి:** ప్రభుత్వం రైతులకు ఉచితంగా జింక్ ఎరువు సరఫరా చేయడంతో బుధవారం వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు బారులు తీరారు. జింక్‌ను ఖరీఫ్ దమ్ములో వేస్తే మంచిదని వ్యవసాయాధికారులు చెప్పడంతో రైతులు జింక్ కోసం ఎగబడుతున్నారు. ఉదయాన్నే వ్యవసాయ కార్యాలయం ముందు క్యూ కట్టారు.



జింక్ ఎరువు కోసం క్యూకట్టిన రైతులు

# ప్రజాపంపిణీ వ్యవస్థలో అస్తవ్యస్తం

- కొలతల్లో కోతలు.. గొదాము వద్దే తరుగులు
- డైలామాలో డీలర్లు

**నరసన్నపేట:** ప్రభుత్వం రేషన్‌లో కోత విధిస్తుండగా వినియోగదారుల చేతికందేసరికి సరుకుల్లోను తరుగు తప్పడం లేదు. వివిధ దశల్లో సరుకులపై కొలతల్లోను, తూకాల్లోనూ తరుగుదల దారుణంగా జరుగుతోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. బియ్యంతో పాటు కిరోసిన్ కొలతల్లో తేడాలు తప్పడం లేదు. రేషన్ డీలర్లకు పూర్తి స్థాయిలో తరుగులేకుండా సరుకులు అందకపోవడంతో డీలర్లు మరింత చేతివాటం ప్రదర్శించి వినియోగదారులను మోసగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈపోస్ విధానం అమలు చేసినా.. తూకాల్లో రెండు కిలోలు వరకు సంచులతో తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.



బియ్యాన్ని తరలిస్తున్న దృశ్యం

నియోజకవర్గంలో 172 రేషన్ డిపోల్లో 1,23,557 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. 1,780 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెల విడుదలచేస్తుంది. 50 కిలోల బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు వస్తుందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కక్కలేక మింగలేక..**

పౌర సరఫరాల గోదాము వద్ద సరుకుల్లో తరుగు ఉండడంతో డీలర్లు కక్కలేక మింగలేక చేసేది ఏమిలేక తప్పుడు తూకాలకు పాల్పడుతున్నారు. 50 కిలోల బియ్యం బస్తాకు రెండు నుంచి ఐదు కిలోల వరకు గోదాముల వద్దనే తరుగులు వస్తున్నట్లు డీలర్లు చెబుతున్నారు. కిరోసిన్ కొలతల్లో హోల్‌సేల్ డీలర్లు కోత పెడుతుండడంతో డీలర్లు గగ్గోలు చెందుతున్నారు. కిరోసిన్ డ్రమ్ముల్లోకి నింపేటప్పుడు 20 లీటర్ల వరకు నష్ట పోతున్నామని డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

**చర్యలు తీసుకుంటాం..**

కొలతల్లో తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జల్లేపల్లి రామారావు అన్నారు. గోదాముల వద్ద డీలర్లు సరుకులను తూనికలు వేసి తీసుకువెళ్లాలని సూచించారు. ఇప్పటికే డీలర్లకు ఆదేశాలు జారీ చేశామని తహసీల్దార్ అన్నారు.

## గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతం



పార్టీలో చేరిన వారికి కండువాలతో ఆహ్వానిస్తున్న దృశ్యం

**నరసన్నపేట:** జిల్లాలో గ్రామస్థాయినుంచే బీజేపీని బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కోటగిరి నారాయణరావు అన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో పార్టీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2లక్షలకు పైగా సభ్యత్వనమోదు కాగా 1,500 మంది క్రియాశీలక సభ్యత్వం పొందారన్నారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడిగా కె.వెంకటనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు మహారణ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారికి కండువాలతో ఆహ్వానించారు.

## లయన్స్‌క్లబ్ సభ్యుల వితరణ



తామరాపల్లి పాఠశాలకు కుర్చీలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**తామరాపల్లి (నరసన్నపేట):** తామరాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బుధవారం కుర్చీలు, ఫ్యాన్లు వితరణ చేశారు. లయన్స్ సభ్యులు బాలగంగాధర్, మెండ యయాతీ ఆధ్వర్యంలో పాఠశాలకు 11కుర్చీలు, రెండు ఫ్యాన్లు ఇచ్చారు. అలాగే మొక్కల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చీపురు కృష్ణమూర్తి, చింతు రామారావు, గొండు సత్యనారాయణ, సదాశివుని కృష్ణ, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులపై డీపీవో ఆగ్రహం



సమీక్ష నిర్వహిస్తున్న డీపీవో కోటేశ్వరరావు

**సారవకోట:** మండలంలోని పంచాయతీ కార్యదర్శుల తీరుపై డీపీవో కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 34 పంచాయతీల పారిశుధ్య పనులపై బుధవారం ఆయా కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువలకు జియోట్యాగింగ్ చేయని కార్యదర్శులపై కలెక్టర్‌కు నివేదిస్తామని హెచ్చరించారు. జియోట్యాగింగ్ విషయంలో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్య వైఖరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎంఎంఎస్ ఎన్నికలు

**పోలాకి:** పోలాకి మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) కార్యవర్గ ఎన్నికలు బుధవారం ప్రశాంతగా జరిగాయి. వెలుగు ఏపీఎం శ్రీనివాసబాబా ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షురాలిగా గతంలో పనిచేసిన బరాటం సంతోషికుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా జి.పార్వతి, కార్యదర్శిగా రాజులమ్మ, ఉపకార్యదర్శిగా రాజేశ్వరమ్మ, కోశాధికారిగా కొంగరాపు దమయంతి, మరో ఐదుగురు సభ్యులతో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## గొల్లపేటలో సీసీ రోడ్డు నిర్మాణం

**సారవకోట:** మండలంలోని మహసింగి పంచాయతీ గొల్లపేటలో సర్పంచ్ బూర్లె వనజాక్షి 14వ ఆర్థిక సంఘ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ గ్రామంలో రోడ్డుకు అడ్డంగా గొయ్యి ఉండడంతో గ్రామస్థులు గతంలో సర్పంచ్‌కు, అధికారులకు తమ గోడును వినిపించుకున్నారు. దీంతో సర్పంచ్ స్పందించి గొయ్యి కప్పించి సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. అలాగే ఇతర వీధుల్లో కూడా సీసీ రోడ్డు వేయిస్తున్నారు.

## దళితులారా.. ఐక్యంకండి

### కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ నాయకుల పిలుపు

**ఉర్జాం(పోలాకి):** దళితులంతా సమష్టిగా ఉండండి.. సామాజిక పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై తమ వంతు కృషి చేస్తామని కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు హితవు పలికారు. ఉర్జాంలో బుధవారం దళితులు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ నాయకులంతా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు డి.గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు బవిరి కృష్ణమూర్తి, మండల స్థాయి నాయకులు పాల్గొని దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. తమ గ్రామంలో దళితులకు చిన్నచూపు చూస్తున్నారని, ఇటీవల తహసీల్దార్ కార్యాలయానికి మెమోరాండం సమర్పించినా ఇంతవరకూ సమస్యకు పరిష్కారం లభించలేదని ఉర్జాం గ్రామానికి చెందిన దళితులు



మాట్లాడుతున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు గణేష్

పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా నాయకులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి మండల స్థాయి నాయకులు కె.నవరయ్య, ఎస్.కనవయ్య, గన్నయ్య, దళిత మహిళలు పాల్గొన్నారు.

## వరి నారు చిగుళ్లు తుంచి నాటండి

**సారవకోట:** వరి నారు చిగుళ్లు తుంచి నాటాలని ఏవో ఎల్.మురళీధర్ రైతులకు సూచించారు. మండలంలోని బొంతు, కురిడింగి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కురిడింగిలో రైతులకు పలు సూచనలు చేశారు. వరి నారు చిగుళ్లలో ఆకుముడత, కాండం తొలిచే పురుగులు గుడ్లు పెట్టి ఉంటాయన్నారు. వాటిని తుంచితే ఈ తెగులు వరి పైరుకు సోకదని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ఆనందరావు, ఎంపీఈవోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో మురళీధర్

**కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి**

**జలుమూరు:** ప్రస్తుతం వరిపొలాల్లో నీరు నిల్వ ఉందని ఈ సమయంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి డి.విజయభాస్కరరావు తెలిపారు. మండలంలోని రాణ, పెద్దదూగాం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించ వచ్చన్నారు.

***21లోగా రుణాలు తీసుకున్న వారికే బీమా..***

ఈనెల 21లోగా బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే బీమా వర్తిస్తుందని వ్యవసాయాధికారి డి.విజయభాస్కరరావు తెలిపారు. సమావేశంలో ఎంపీఈవోలు అనంతరావు, సౌజన్య, రాణ సర్పంచ్ ప్రతినిధి తర్ర పార్థివరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

**పోలాకి:** ఉత్తమ సేవలందించిన పోలాకి తహసీల్దార్ జెన్ని రామారావుకు, పంచాయతీ అధికారి రవికుమార్‌కు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వారు మంత్రి పితాని సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం ఆనందదాయకంగా ఉందని మండల పరిషత్ సలహాదారు తమ్మినాన భూషణరావు అన్నారు. ఎంపీడీవో అలివేలు మంగమ్మ, సూపరింటెండెంట్ ప్రకాష్‌రావు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రామారావు, పంచాయతీ అధికారి రవికుమార్‌లను సన్మానిస్తున్న దృశ్యం

## ద్విచక్ర వాహనం ఢీకొని సైకిలిస్టుకు గాయాలు

**జలుమూరు:** మండలంలోని హరికృష్ణమ్మపేట వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైకిలిస్టు గూన చంద్రం తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అందించిన వివరాలు మేరకు కోటబొమ్మాళి మండలం చిన్న నవడాం గ్రామానికి చెందిన గూన చంద్రం సైకిల్‌పై చల్లవానిపేట వెళ్తుండగా చల్లవానిపేటనుంచి నవడాం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చంద్రం కుడి కాలు పాదానికి, మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కృష్ణమూర్తి తెలిపారు. అయితే సైకిలిస్టును ఢీకొన్న ద్విచక్రవాహనం సుబ్రహ్మణ్యపురం గ్రామానికి చెందినదిగా గుర్తించినట్లు ఆయన తెలిపారు.

## పూర్వ విద్యార్థులకూ పారితోషికం

**పోలాకి:** వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ సాధించిన పూర్వ విద్యార్థులకు కూడా పారితోషకాలు అందిస్తామని విశ్వశాంతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ మెట్ట జనార్దనరావు తెలిపారు. స్థానిక పాఠశాల వద్ద బుధవారం పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలో చదివి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం ప్రోత్సాహం అందిస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పూర్వ విద్యార్థులకు ఎంపీపీ ప్రతినిధి తమ్మినాన భూషణరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

## గ్యాస్ సమాచారం

**నరసన్నపేట:** స్థానిక హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈనెల 12న బుక్‌చేసిన వారికి, ఈనెల 11న బుక్ చేసిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు బుధవారం గ్యాస్ పంపిణీ చేయనున్నారు.

## నరసన్నపేటలో సినిమాలు

శ్రీదేవి - నేనే రాజు.. నేనే మంత్రి
రాజేశ్వరి - ఫిదా
శ్రీవెంకటేశ్వర - జయ జానకి నాయక

## పిల్లలకు పౌష్టికాహారం అందించండి

**వీరఘట్టం:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజే యాలని తహసీల్దార్ ఎంవీ రమణ కోరారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కా ర్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని, పిల్లలకు ఆట పాటలతో విద్య నేర్పించాలన్నారు. బీఎల్ వోలు ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూ చించారు. సమావేశంలో పీవో వి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సమావేశాలకు వచ్చేందుకు సమయం లేదా?

**● పాలకొండ మండల సమావేశంలో అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం**





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

**పాలకొండ రూరల్:** మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి వచ్చేం దుకు సమయం చాలదా అని ఎంపీపీ వారాడ లక్ష్మీసుమంత్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభమైనా పలు శాఖల అధికారులు ఆలస్యంగా వస్తుం డడంపై ఆమె అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులు సమయ పాలన పాటించ కుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటిపారుదల శాఖపై జరిగిన చర్చలో తోటపల్లి ఆధునికీకరణ పనులు చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరందించాలని సభ్యులు కిమిడి కాశీంనాయుడు, గవర గురునాథరావు, చందక జగదీష్, గవర ప్రసాదరావు కోరారు. సాగునీరందించడంలో నీటిపారుదలశాఖ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. అయితే చర్చ జరుగుతున్న సమయానికి ఆశాఖ అధికారులు రాకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ... తోటపల్లి కాలువల ఆధునికీకరణకు రూ.270 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేయాలని మంత్రుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చిన మంగళాపురంలో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయాలని సర్పంచ్ కిమిడి కాశీంనాయుడు కోరారు. దీనిపై స్పందించిన ఎంపీపీ.. మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులవివరాలను తెలియజేయాలని ఎంఈవో జి.బాల సుబ్రహ్మణ్యానికి సూచించారు. డీఈవో దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వెలిముద్రలు సక్రమంగా పడక పోవడంతో రేషన్ సరుకుల అందడం లేదని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, కిరో సిన్‌ను సరఫరా చేయాలని కిమిడి కాశీంనాయుడు, చందక జగదీష్ కోరారు. దీనిపై సీఎస్‌డీటీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వెలిముద్రలు సక్రమంగా పడని వారికి వీఆర్వోల సమక్షంలో రేషన్ అందిస్తున్నామని చెప్పారు. కిరోసిన్ సరఫరాను ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. పశువైద్యాధికారి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 55 ఎకరాల్లో గడ్డి క్షేత్రాల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. రైతులు ముందుకు వస్తే వారికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈసందర్భంగా 13వ ఆర్థిక సంఘ నిధులతో వివిధ గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ లంక వరలక్ష్మి, ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ



స్వామిని దర్శించుకుంటున్న విద్యార్థులు

**సింగిడి (భామిని):** సింగిడి గ్రామంలో బుధవారం వినాయక మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు లలితా ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులె వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు కృషితో 15 రోజుల కిందట భూమి పూజ చేసి 16వ రోజు నాటికి మందిర నిర్మాణ పనులను పూర్తి చేసి ఎస్ఎస్ ప్రకాశరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. రాజబాబు పాఠశాల ప్రిన్సిపాల్ వలురౌతు చిట్టిబాబు సొంత స్థలాన్ని ఇవ్వగా గ్రామస్థులు విరాళాలు సేకరించి ఆలయాన్ని నిర్మించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న స్క్రీనింగ్ కమిటీ సభ్యులు

**సీతంపేట:** ట్రైకార్ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నామని ఎంపీడీవో యు.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంల ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రుణాల కోసం 178 మందిని ఎంపిక చేయాల్సి ఉందని, ఆన్‌లైన్‌లో 720 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. బీసీ రుణాల కోసం 94 మంది ఎంపిక లక్ష్యం కాగా 120 మంది, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 12 మంది లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉండగా 70 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, బ్యాంకర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. ఈ ఎంపికకు ప్రత్యేకాధికారిగా ఐటీడీఏ పీవోవో భవానీశంకర్ వ్యవహరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పి.రాజాబాబు, ఎంపీటీసీ సభ్యులు బిడ్డిక దమయంతినాయుడు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నువ్వుల వేలం వాయిదా

**వీరఘట్టం:** చలివేంద్రిలో బుధవారం నిర్వహించిన నువ్వుల వేలం పాటను వాయిదా వేశారు. ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే వ్యాపారులు తక్కువ ధరకు కోడ్ చేయడంతో సమాచారాన్ని కలెక్టర్‌కు అందజేయనున్నామని తహసీల్దార్ ఎంవీ రమణ తెలిపారు. తదుపరి ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

## విద్యార్థినులకు రిస్ట్ వాచీల పంపిణీ



విద్యార్థినులకు రిస్ట్ వాచీలను అందజేస్తున్న నాయకులు

**పూతికవలస (సీతంపేట):** పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు రిస్ట్ వాచీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆయమ్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూరంగి లక్ష్మీలు మాట్లాడుతూ.. సమయాన్ని తెలుసుకొని దాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. 67 మందికి రిస్ట్ వాచీలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.నారాయణరావు, ఉపాధ్యాయుడు బండి శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువుల వివాదంపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో శివశంకర్

**ఎం.సింగుపురం (పాలకొండ రూరల్):** ఎం.సింగుపురంలో గురవరాయుడు, లచ్చరాయుడు చెరువుల వివాదంపై ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్టీ కులస్థులు చెరువుల వివాదంపై గిరిజన దర్బార్‌లో ఫిర్యాదు చేయగా దీనిపై స్పందించిన పీవో బుధవారం గ్రామాన్ని సందర్శించారు. ధనలక్ష్మి స్వదేశీ మత్స్యపారిశ్రామిక సంఘం పరిధిలోని ఎం.సింగుపురంలో చెరువులు ఉండగా ఆ గ్రామ రజక కులస్థులు వీటిపై సర్వహక్కులు తమకే ఉన్నాయని వాదన లేవనెత్తారు. 2014 నుంచి చెరువులను తామే అభివృద్ధి చేసుకుని దుస్తులను ఉతకడంతోపాటు చేపలు పెంపకం చేపడుతున్నామని, దీనికి పంచాయతీ తీర్మానం కూడా చేశారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పీవో బహిరంగ విచారణ చేసి పంచాయతీ రికార్డులను పరిశీలించగా ఎక్కడ కూడా రజకులకు ఒక చెరువు, ఎస్టీలకు ఒక చెరువు ఇచ్చినట్టు మినిట్ పుస్తకంలో రాయలేదని గుర్తించారు. దీనిపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు నివేదించాలని తహసీల్దార్ జి.మంగు, డీఎల్పీవో సత్యనారాయణ, మత్స్యశాఖ అధికారి గంగాధర్‌లను ఆదేశించారు. ఈ పర్యటనలో ఈవోపీఆర్డీ ఆనందరావు, సర్పంచ్ రణస్థలం రాంబాబు, ఎస్టీ, రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చలో విజయవాడ విజయవంతం చేయండి



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**పాలకొండ టౌన్:** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పడాల భాస్కరావు, చింతల కైసులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరపంచాయతీ ప్రజలపై పన్ను భారం మోపే 159, 160, 279 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగరపంచాయతీలో మూడేళ్లుగా పీఎఫ్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వీటి పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు సీహెచ్ సింహాచలం, సీహెచ్‌రాము, పి.శ్రీను, సురేష్, మధు, వి.గిరి, శ్రీదేవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

## దళితులపై మంత్రి వ్యాఖ్యలకు నిరసన

**● ఆదినారాయణ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**



మంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

**పాలకొండ టౌన్:** నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డి తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మంత్రి మాటలు దళితులను కించ పరిచే విధంగా ఉన్నాయని, తక్షణమే ఆయన దళితులకు క్షమాపణ చెప్పాలన్నారు. మంత్రి వర్గం నుంచి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నానాజీ, తలే సీతారాం, వై.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ



పాతపట్నం: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం పాతపట్నం తహసీల్దార్‌గా పప్పల వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సుధాప్రకాశ్ పదవీ విరమణ చేసిన తర్వాత మెళియాపుట్టి తహసీల్దార్ జె.చలమయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న వేణుగోపాల్‌ను పాతపట్నం తహసీల్దార్‌గా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

# ముకుందపురంలో ఏకపాత్రాభినయం

● ఐదు తరగతులకు ఒకే టీచర్ ● రేషనలైజేషన్‌లో ఓ పోస్టు రద్దు

ముకుందపురం(మెళియాపుట్టి): ఆ పాఠశాల నుంచి ఎలాగో ఒకవిధంగా వెళ్లిపోవాలనే ఉద్దేశ్యంతో ఒక ఉపాధ్యాయుడు తప్పుడు లెక్కలు చూపించడంతో రేషనలైజేషన్‌లో పోస్టు రద్దయింది. దీంతో మిగిలిన ఒకే టీచర్ ఏకపాత్రాభినయం చేయాల్సి వస్తోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని ముకుందపురం పాఠశాలలో 24 మంది విద్యార్థులు ఉండగా, 19 మందే ఉన్నట్లు లెక్కలు చూపించడంతో రేషనలైజేషన్‌లో ఒక పోస్టు రద్దయింది. ఇప్పుడు ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాలలో జె.చిన్నవాడు అనే ఉపాధ్యాయుడు నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. అయితే ఆయన ఇక్కడి నుంచి కదలాలంటే(శ్రీకాకుళం వెళ్లిపోవాలంటే) ఒక పోస్టు రద్దు అవ్వాలి. 20 మంది పిల్లల కంటే ఎక్కువుంటే తాను ఇక్కడి నుంచి కదల నేననే ఉద్దేశ్యంతో 19 మంది మాత్రమే ఉన్నట్లు రికార్డుల్లో చూపించినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు మిగిలారు. అన్ని తరగతులకు ఒక్కడినే పాఠాలు చెప్పడం కష్టంగా ఉందని ఉపాధ్యాయుడు బైరిసింగి లక్ష్మీనారాయణ అంటున్నారు. గతంలో చిన్నవాడు, పాపారావు అనే ఉపాధ్యాయులు ఇక్కడ ఉండేవారు. ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తవడంతో ఇటీవల పాపారావుకు వేరే ప్రాంతానికి బదిలీ అయింది. సీతంపేట మండలం నుంచి లక్ష్మీనారాయణ ముకుందపురం వచ్చారు. 20 మందికన్నా ఎక్కువ పిల్లలు చదువుతుంటేనే రెండు పోస్టులు ఉంచుతారు. పాఠశాలలో 24 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ 19 మందే ఉన్నట్లు రిపోర్టు ఇవ్వడంతో ఒకే పోస్టు మిగలడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు సమావేశాలకు ఈ టీచర్ వెళితే ఆ రోజు పాఠశాల మూసేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది.



ఐదు తరగతుల(24 మంది) విద్యార్థులకు పాఠం చెబుతున్న టీచర్

### సరిచేస్తాం

పాఠశాలలో 24 మంది విద్యార్థులు ఉన్నట్లయితే వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ కింద ఒకర్ని నియమించే అవకాశముంది. 24 మందికీ ఆధార్‌కార్డులు ఉన్నట్లయితే అదనంగా ఒక ఉపాధ్యాయుడ్ని నియమిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

\- దేవేంద్రరావు, ఎంఈవో, మెళియాపుట్టి

## ఎంపీ నిధులతో బస్సు షెల్టర్ల నిర్మాణం



ఎంపీతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురం, గోకర్ణపురం, శిరియాఖండి, అనంతగిరి, మారడికోట జంక్షన్, పదనాపురం జంక్షన్, ఆకులమ్మవారు జంక్షన్ వద్ద బస్సుషెల్టర్లను ఎంపీ నిధులతో నిర్మించనున్నట్లు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి తెలిపారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి విన్నవించిన వెంటనే నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. అలాగే మెళియాపుట్టిలో మహేంద్రతనయ వద్ద మెట్ల నిర్మాణానికి రూ.3 లక్షలు, రట్టిణిలోని కదంబాల చెరువులో మెట్ల నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టుపురంలో ముస్లిం మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

## 'సమష్టి కృషితోనే సత్ఫలితాలు'



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

పాతపట్నం: సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధించగలుగుతామని తహసీల్దార్ పప్పల వేణుగోపాల్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు సాధించేందుకు సిబ్బంది సహకారముండాలని చెప్పారు. సమన్వయం, సమష్టి కృషి మంచి ఫలితాలకు మూలం అన్నారు. ప్రజలకు సేవలందజేయడంలో సహకరించాలని కోరారు. చిత్తశుద్ధిగా పనిచేసి సమయపాలన పాటించి ప్రజలకు సేవలందించాలన్నారు.

## కలకలం సృష్టించిన చోరీ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నీలిమ

కొత్తూరు: మండల పరిధి కలిగాం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం బస్సు దిగిన వడ్డి నీలిమ (33) కంట్లో సిని పక్కీలో లిక్విడ్ జల్లి ఆమె చేతిలోని బ్యాగ్‌ను బలవంతంగా లాక్కుపోవడం కలకలం సృష్టించింది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న వాహనదారుల ఆగి విషయంపై ఆరా తీశారు. ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చి చేతిలో ఉన్న బ్యాగ్‌ను లాక్కొని వెళ్లిపోయారని, బ్యాగ్‌లో సుమారు లక్ష రూపాయల నగదు ఉందని ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈమె శ్రీకాకుళం నుంచి కలిగాం గ్రామానికి వస్తోంది. కలిగాం జంక్షన్‌లో బస్సు దిగి గ్రామంలోకి వెళ్లేందుకు సమాయత్తం అవుతుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తులు నగదు బ్యాగ్ చోరీ చేసినట్లు ఆమె చెప్పింది. బ్యాగ్‌ను లాక్కుని వెళుతున్నప్పుడు ఆమెకు చిన్నపాటి గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించి వైద్యచికిత్స నిమిత్తం కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని పోలీసుల వద్ద ప్రస్తావించగా తమకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామన్నారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకువెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

# 'లచ్చన్న రైతు పక్షపాతి'



పాతపట్నం: లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: సర్దార్ గౌతు లచ్చన్న రైతు పక్షపాతి అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లచ్చన్న జయంతిని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంతో రైతులతో ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకూ పాదయాత్ర చేసి రైతాంగాన్ని ఉద్యమ దిశగా నడిపించిన మహనీయుడని అన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు చేసి వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పైల లక్ష్మయ్య, శివాల చిన్నయ్య, మండల విద్యాశాఖాధికారి బి.సింహాచలం, సీమ రామకృష్ణ రజక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఉట్లబాబు, పాఠశాల్లి రామరాజు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మహేంద్ర డైట్ కళాశాలలోనూ లచ్చన్న జయంతిని జరిపారు. ఈ సందర్భంగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు శాసనపురి మధుబాబు మాట్లాడుతూ నిస్వార్థ సేవలకు నిలువెత్తురూపం లచ్చన్నని అన్నారు. మానసిక శాస్త్ర విశ్లేషకుడు జి.రాజేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో లచ్చన్న చేసిన పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

### 'లచ్చన్న సేవలు చిరస్మరణీయం'

పెద్దకోట(ఎల్.ఎన్.పేట): రాష్ట్రాభివృద్ధికి సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని పీపీసీఎస్ అధ్యక్షుడు కాగాన మన్మథరావు అన్నారు. లచ్చన్న జయంతిని పెద్దకోటలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో లచ్చన్న పోరాట పటిమను చూసే సర్దార్ బిరుదు ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటరమణ, సింహాచలం, రమణ, తదితరులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

# 'పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ'

ఎల్.ఎన్.పేట: మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించగలమని ఒమ్మి ఆనందరావు అన్నారు. బుధవారం ఆయన ఎల్.ఎన్.పేటలో రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించి నవ్యాంధ్రప్రదేశ్‌ను పచ్చదనంతో నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం వనం-మనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఐకేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటించడం హర్షణీయమన్నారు. మొక్కలు నాటితే సరిపోదని, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని వెలమల గోవిందరావు అన్నారు. మండలంలోని బొర్రంపేట, గొట్టిపల్లి, కరకవలస, కొమ్ముపలస, ఎల్.ఎన్.పేట, మిరియాపల్లి, ముంగెన్నపాడు, పెద్దకొల్లివలస, యంబరాం పంచాయతీల్లో రోడ్డుకు ఇరువైపులా 9 కిలోమీటర్ల మేర మొక్కలు నాటడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎన్.ధనలక్ష్మి, కె.కృష్ణమాచారి, ఎం.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

## అక్రమ కట్టడాలకు బ్రేక్

ఎల్.ఎన్.పేట: పెద్దకోట రెవెన్యూ పరిధిలోని జోల చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలకు అధికారులు బ్రేక్ వేశారు. పనులు ఆపివేయించి కూలీలను పంపించివేశారు. నిర్మాణాలు ఆపకపోతే చర్యలు తీసుకుంటామని ఆర్ఐలు చెప్పారు.

### పాతపట్నంలో సినిమాలు

ఉమామహల్: నేనే రాజు నేనే మంత్రి

**హిరమండలంలో..**

వరలక్ష్మి : లై

**కొత్తూరులో..**

గౌరీశంకర : జయ జానకి నాయక

ఉమాశంకర: లై

## వైద్యుడు సుగుణాకర్ మృతికి సంతాపం


సుగుణాకర రావు(ఫైల్)

**లింగాలవలస(రేగిడి):** విశాఖ కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, లింగాలవలసకు చెందిన కోడి సుగుణాకర్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని పలువురు సంతాపం తెలిపారు. చెందాడు. అవివాహితుడైన సుగుణాకర్ మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి కోడి సత్యంనాయుడు ఇటీవల మృతిచెందగా, ఆయన స్మారకంగా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుగుణాకరరావు మృతి చెందడంతో గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, చింతాడ భాస్కరరావు, కెల్ల మురళీకృష్ణ పరామర్శించారు.

# సమస్యల 'పేట'

● ఏకగ్రీవ పంచాయతీ వెంకంపేటపై నిర్లక్ష్యం ● అభివృద్ధికి నోచుకోని వైనం
● పాలకుల వివక్ష ● పాతపనులకే బిల్లులు ● పట్టించుకోని అధికారులు

**గ్రామస్థుల సహకారంతో మూడు పర్యాయాలై పంచాయతీ ఏకగ్రీవంగా ఎంపికైనా పాలకులు గ్రామాభివృద్ధిలో వివక్ష.. అభివృద్ధి పనులు లేక గ్రామస్థులు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు.. ప్రభుత్వం నుంచి అనేక నిధులు వస్తున్నా పాత పనులకే బిల్లులు చేసుకుంటూ నిధులు స్వాహా చేస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.. పాలకుల వివక్ష వల్ల తాము అనేక రీతుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు అంటున్నారు.. ఇదీ మూడు పర్యాయాల నుంచి ఏకగ్రీవంగా ఎన్నికవుతున్న వెంకంపేట పంచాయతీ తీరు.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం...**

(రేగిడి)

పంచాయతీ అభివృద్ధి జరుగుతుందన్న ఆశతో మూడు పర్యాయాలు ఏకగ్రీవంగా పాలకులను ఎన్నుకున్నారు.. అదే రీతిలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, ప్రత్యేక నిధులు వచ్చాయి.. అయితే వారు ఆశించిన మేర అభివృద్ధి సాగకపోగా నిధులు దుర్వినియోగమయ్యాయన్న ఆవేదన వెంకంపేట పంచాయతీ ప్రజల్లో నెలకొంది.. ఏకగ్రీవ పంచాయతీగా ఎంపికైనందుకు ప్రభుత్వం రూ.7 లక్షలు మంజూరుచేసింది. అలాగే 13, 14 ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులు, పలు పద్దుల కింద ఈ పంచాయతీకి నిధులు భారీగానే వచ్చినప్పటికీ అభివృద్ధి ఫలాలు అందరికీ దక్కడం లేదన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది.. వెంకంపేటలో మెయిన్ వీధిలో ఒక వైపు చిన్న కాలువ తప్ప గ్రామంలో ఎటువంటి కాలువలు లేవు. కాపువీధి, పలు వీధుల్లో సీసీ రోడ్లు లేక మట్టిరోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు.. కాలువలు లేక మురుగునీరు రోడ్లపైనే చేరి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దళిత కాలనీలో 120 కుటుంబాలు నివసిస్తున్నా అక్కడ మెయిన్‌వీధిలో మాత్రమే సీసీ రోడ్డు వేసినా రోడ్డుకిరువైపులా కాలువలు నిర్మించలేదు.



సీసీ రోడ్లు లేని దళిత కాలనీ, బీసీ వీధి


అస్తవ్యస్తంగా ఉన్న కాలువ

గ్రామంలో ఒక్క బోరు లేకపోవడంతో ఊరు శివారున ఉన్న కోనేటిని ఆశ్రయించాల్సి వస్తోంది.. ఈ కోనేరు నీరు కలుషితం కావడం, ఆ నీటినే తాగునీటిగా వాడుతున్నారు. వీధుల్లో కొళాయిలు ఏర్పాటు చేసినా ఈ కాలనీలో ఒకే పాయింట్ వేయడంతో తాగునీరు చాలక ఇబ్బందులు పడుతున్నామని దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్ లైన్లు మొరాయిస్తే చెరువు నీరే తాగాల్సిన పరిస్థితి నెలకొందని వారంటున్నారు. దళిత కాలనీ అభివృద్ధిలో పాలకవర్గం వివక్ష చూపుతోందని వారు విమర్శిస్తున్నారు. మీసాలడోలపేటలో కల్వర్టులు తప్ప మిగతా వీధులకు సీసీ రోడ్లతో పాటు కాలువలు లేక ఎక్కడబడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల గ్రామంలో పారిశుధ్య లోపంతో జ్వరాలు వ్యాప్తి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని పనులపై విచారణ చేయించడంతో పాటు గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

### గ్రామాభివృద్ధిలో వివక్ష ఎందుకో?



మూడు పర్యాయాలుగా పంచాయతీని ఏకగ్రీవం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నా గ్రామాభివృద్ధిలో పంచాయతీ పాలకులు వివక్ష చూపుతున్నారు. దళిత కాలనీలో సౌకర్యాలు లేవు. కాలువలు లేక దోమలు విజృంభించి జ్వరాలు సోకుతున్నాయి.

*దర్రు లక్ష్మి, గృహిణి, వెంకంపేట*

### నిధులు ఉన్నా...



గ్రామపంచాయతీకి నిధులు పుష్కలంగా ఉన్నాయి. అభివృద్ధిలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సీసీ రోడ్లు, కాలువలు లేవు. ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డులు, తాగునీటి సరఫరాలో పాలకులు వివక్ష చూపుతున్నారు.

*-ఈశరి రాములమ్మ, దళిత కాలనీ, వెంకంపేట*

### తీర్మానాల ఆధారంగానే పనులు



పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన తీర్మానాల ఆధారంగానే పనులు చేపడుతున్నాం. ఏకగ్రీవ పంచాయతీ కావడంతో నిధులు పుష్కలంగా ఉన్నాయి. కొన్ని కారణాల వల్ల పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోయాం. ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి రికవరీ చేస్తాం.

*-బాసూరి శంకరరావు, ఎంపీడీవో*

## ఆన్‌లైన్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ

**శ్రీకాకుళం సిటీ:** పండిట్ రవిశంకర్ గురూజీ, ఆర్ట్ఆఫ్‌లివింగ్ సెంటర్, బెంగుళూరు నుంచి ఆన్‌లైన్‌లో ఈనెల 18,19,20 తేదీల్లో హ్యాపీనెస్ ప్రోగ్రామ్ శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీకాకుళం కన్వీనర్ కెఎస్ఎన్ మూర్తి ప్రకటనలో తెలిపారు. సుదర్శన్ క్రియ అనే ఈ టెక్నిక్ ని గురూజీ ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రం మహిళా కళాశాలలో సాయంత్రం 5.30 నుంచి 8.30 వరకు జరు గుతుందన్నారు. విశాఖ బి కాలనీ సాయిబాబా గుడి ఎదురుగా రిజిస్ట్రేషన్‌కు 9440332380, 9985034758 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## వనిత ఫ్యామిలీ కార్డుతో బహుళ ప్రయోజనాలు


వనిత కార్డు పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీటీఎం

**శ్రీకాకుళం సిటీ:** ఏపీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన వనిత ఫ్యామిలీ కార్డుతో బహుళ ప్రయోజనాలున్నాయని శ్రీకాకుళం ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కుప్పిలి శ్రీనివాసరావు అన్నారు. వనిత ఫ్యామిలీ కార్డు పక్షోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 17నుంచి 31వరకు వనిత ఫ్యామిలీ కార్డు ప్రాధాన్యతా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

తెల్లరేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు వనిత ఫ్యామిలీ కార్డును రూ.100, కుటుంబసభ్యులకు రూ.20 చెల్లించి మిగిలిన కుటుంబసభ్యులకు యాడ్ ఆన్‌కార్డులు మంజూరు చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్డు కాలపరిమితి రెండేళ్లన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగు వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కు టుంబసభ్యులు ఒకేసారి ప్రయాణించినా, విడివిడిగా ప్రయాణించినా 10శాతం రాయితీ పొందవచ్చునన్నారు. రూ. లక్ష ప్రమాదబీమా ఉం టుందన్నారు. శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ డి.ఢిల్లేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) శ్రీనివాసరావు, పీఆర్వో బీఎల్‌పీ రావు ఉన్నారు.

# డిసెంబర్ 3 నాటికి అన్ని గ్రామాలకూ రోడ్లు

● ఐటీడీఏ పీవో శివశంకర్

**సీతంపేట:** ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి అన్ని గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ అన్నారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, వీటీడీఏ గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పరిధిలో అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని, ఇప్పటి వరకు మంజూరైన పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చాలా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి అనుమతులున్నా ఆ పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించడంలో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఎన్ని పనులు మంజూరయ్యా యి, ఏయే పనులను ప్రారంభించారు, అవి ఏ దశ ల్లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పనులు మంజూరై ప్రారంభించని గ్రామాల్లో త్వరితగతిన పనులు వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న నిర్మాణాపై పర్యవేక్షణ పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐదారేళ్ల వరకు రోడ్లు పాడవకుండా కాంట్రాక్టర్లు బాధ్యత వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మందస మండలం బలరాంపురానికి రహదారి సౌకర్యం ఉం దని ఇంజినీరింగ్ అధికారులు పీవో దృష్టికి తీసుకు రాగా దీనిపై స్పందించిన ఆయన మందస ఎంపీ డీవోకు ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

### ఇంజినీరింగ్ పనులపై యువతకు శిక్షణ

ఐటీడీఏ పరిధిలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన గిరిజన యువతకు ఇంజినీరింగ్ పనులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి వారికి ఉపాధి కల్పిస్తామని పీవో శివశంకర్ తెలిపారు. 90 రోజుల పాటు సీతంపేట వైటీసీ భవనంలో నాక్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తామని, ఈ శిక్షణకు అయ్యే ఖర్చులో 75 శాతం ఐటీడీఏ, మిగిలిన 25 శాతం శిక్షణ పొందే అభ్యర్థి భరించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 21 నుంచి ఈ శిక్షణ ప్రారంభమవుతుందని, ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసి నిర్మాణ పనులపై ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు ఐటీడీఏ టోల్‌ఫ్రీ నెంబర్ 18004259855కు ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో ఈఈ కె.అశోక్, జేఈ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ పాఠశాలకు బస్సు వితరణ

**రాజాంరూరల్:** పట్టణంలోని మూగ, చెవిటి దివ్యాంగ పాఠశాలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త కొత్తా వెంకటరాజు, కొత్తా రత్నకుమారి మినీ బస్సు బహూకరించారు. బుధవారం పాఠశాల కరస్పాండెంట్ సాసుబిల్లి నాగభూషణరావుకు బస్సును, అనుమతి పత్రాలు, తాళాలను అందించారు. మూగ, చెవిటి దివ్యాంగ విద్యార్థులను వివిధ గ్రామాల నుంచి తీసుకువచ్చేందుకు పాఠశాల నిర్వాహకులు పడుతున్న ఇబ్బందులను గమనించి మినీ బస్సును అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కరస్పాండెంట్ నాగభూషణరావు అభినందించారు. కార్యక్రమంలో మెట్టి ఆదీష్, కొత్తా స్రవంతి, రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు అందజేసిన బస్సుతో దాత కొత్తా వెంకటరాజు

## పాఠశాల అభివృద్ధికి కృషి

పనసలవలస(రేగిడి): పనసలవలస ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త తిరుమల రంగనాథ చార్యులు అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థులకు సదుపాయాల నిమి త్తం రూ.10 వేలు నగదును హెచ్ఎం ఎం.జయలక్ష్మికి అందజేశారు. ఈ నగదుతో ఆటల సామగ్రి, బెంచీలు ఏర్పాట్లకు కృషిచేయాలన్నారు. సర్పంచ్ గేదెల రామకృష్ణ, నాగరాజు, నర్సింహనాయుడు పాల్గొన్నారు.



హెచ్ఎంకు నగదు అందజేస్తున్న రంగనాథం

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### రూ.19 కోట్ల రుణాల లక్ష్యం



అప్పలనాయుడు, వెలుగు ఏపీఎం

రాజాంరూరల్: మండలంలో మహిళా సంఘాలకు రూ.19 కోట్లు రుణాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెలుగు ఏపీఎం నవిరి అప్పలనాయుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పేర్కొన్నారు.

**ప్రశ్న:** మండలంలో ఎన్ని సంఘాలు ఉన్నాయి? ఎన్నింటికి బ్యాంకు లింకేజీ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** మండలంలో 1,006 సంఘాలుండగా, 728 సంఘాలకు బ్యాంకు లింకేజీ పై మొత్తాన్ని ఇవ్వనున్నాం.

**ప్ర:** మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

**జ:** బ్యాంకు లింకేజీ ద్వారా వచ్చిన రుణం సభ్యుల వ్యాపారాలకు చాలకుంటే స్త్రీనిధి ద్వారా రుణాలిచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**ప్ర:** ఈ ఏడాది ఎన్ని గ్రూపులకు, ఎంతమంది సభ్యులకు స్త్రీనిధి రుణాలివ్వనున్నారు?

**జ:** మండలంలో ఈ ఏడాది స్త్రీనిధి రుణాలు 120 గ్రూపుల్లోని 1,260 మందికి రూ.2.20 కోట్లు రుణాలివ్వనున్నాం.

**ప్ర:** పెరటికోళ్ల పెంపకానికి చర్యలు చేపడుతున్నారా?

**జ:** గత ఏడాది పెరటికోళ్ల పెంపకం యూనిట్లు 72 మంజూరుచేశాం. ఒక్కో యూనిట్ ధర రూ.4,060 కాగా రూ. 810కే అందజేశాం. ఈ ఏడాది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెరటికోళ్ల పెంపకం చర్యలు చేపడతాం.

**ప్ర:** మండలంలో ఓడీఎఫ్ గ్రామాలుగా ఎన్నింటిని గుర్తించారు?

**జ:** గురవాం, వీఆర్ అగ్రహారం, పెనుబాక, మారేడుబాక, రాజయ్యపేట, ఒమ్మి గ్రామాలను ఓడీఎఫ్ గ్రామాలుగా ఎంపిక చేశాం.

## గ్యాస్ సమాచారం

లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఉన్న వినియోగదారులు ఈనెల 16 వరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి గురువారం గ్యాస్‌సరఫరా చేస్తామని నిర్వాహకుడు సాయి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఏదైనా గ్యాస్ సమస్యలుంటే 08941- 251016, 251160, 94905 96519 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## సినిమాలు

రాజాం

అప్సర (ఎ.సి)- ఫిదా

సీతారామా (ఎ.సి)- లై

సీతారామా (మినీ)- నేనేరాజు..నేనేమంత్రి

# వన్‌వే ఉన్నట్లా... లేనట్లా?

- నిషేధిత సమయాల్లోనూ ప్రవేశిస్తున్న భారీ వాహనాలు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

రాజాంరూరల్: రాజాం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు గాను వన్‌వేను పోలీసు శాఖ అమలుచేస్తోంది.. అయితే కొన్నాళ్లుగా భారీ వాహనాలు, ఇతర వాహనాలు నిషేధిత సమయంలోనూ పట్టణంలోకి ప్రవేశిస్తుండడంతో అసలు వన్‌వే ఉందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో భారీ వాహనాలను చీపురుపల్లి రోడ్డు, బొబ్బిలిరోడ్డు నుంచి వచ్చిన భారీ వాహనాలు, బస్సులను పోలీసుస్టేషన్ రోడ్డు గుండా తహసీల్దార్ కార్యాలయం, శ్రీనివాస థియేటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మళ్లించేవారు. పాలకొండ, శ్రీకాకుళం నుంచి విశాఖ, బొబ్బిలి, సాలూరు తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ప్రధాన మార్గం గుండా వచ్చేవి. అయితే ప్రస్తుతం వన్‌వే మార్గంలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో భారీ వాహనాలన్నీ ఒకే రోడ్డు గుండా వస్తుండడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకొండ రోడ్డు కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ఉండి నాలుగు రోడ్ల వైపు నుంచి వచ్చిన వాహనాలకు ఇబ్బందులు కలగకుండా, ప్రజలకూడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టేవారు. అయితే ప్రస్తుతం ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వన్‌వే సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ప్రధాన రహదారి గుండా పట్టణంలోకి ప్రవేశిస్తున్న భారీ వాహనాలు, ఆటోలు

## రైతులకు సేవలందించడమే లక్ష్యం

- 'ఆంధ్రజ్యోతి'తో మార్కెట్ కమిటీ చైర్మన్ 'పైల'



రాజాంరూరల్: రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు సేవలందించడమే తన లక్ష్యమని చైర్మన్ పైల వెంకటరమణ అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ చాంబర్‌లో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రాష్ట్ర ఇంధన శాఖామంత్రి కిమిడి కళా వెంకటరావు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కావలి ప్రతిభాభారతి కృషి మేరకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు. వారి ఆశయాల మేరకు పని చేస్తానన్నారు. మార్కెట్ కమిటీకి వస్తున్న ఆదాయ వనరులు పెంచేందుకు కృషిచేస్తానని చెప్పారు. రైతుబంధు పథకంపై రైతులకు అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. రైతులు పండిస్తున్న పంటలను దళారీ పాలు కా కుండా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రతి నెలా మార్కెట్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. గ్రామాల్లో లింకు రోడ్లను మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు శాసపు కేశవనాయుడు, మానం గోవిందరావు, చిగురకోట రంగారావు, కార్యదర్శి వైసీహెచ్ మాధవ్, శ్రీనివాసరావు, ఆంధ్రాయ్య తదితరులు ఉన్నారు.

## మరుగుదొడ్ల లక్ష్యాలు సాధించండి

రేగిడి: స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోందని, దీని లక్ష్యాల సాధనకు కృషి చేయాలని వైస్ ఎంపీపీ కిమిడి రామకృష్ణనాయుడు, ఎంపీడీవో బాసూరి శంకరరావు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి తక్షణమే బిల్లులు చెల్లించాలని సూచించారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించేలా ప్రచారం చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఎంతమందికి మరుగుదొడ్లు ఉన్నవి, ఎన్ని కుటుంబాలకు మరుగుదొడ్లు లేవన్న వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలకు తక్షణమే మంజూరు చేయించి వాటి నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణంనాయుడు

## వరి పంటకు కాలిబాటలతో రక్షణ

శ్రీహరినాయుడుపేట(సంతకవిటి): ఉబాల అనంతరం కాలిబాటలు తీస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారి రంగారావు పేర్కొన్నారు. బుధవారం శ్రీహరినాయుడుపేటలో వావిలపల్లి రామినాయుడు పొలాన్ని పరిశీలించి కాలిబాటలు వేసే విధానం చూసి రైతును అభినందించారు. ఖరీఫ్ వరి సాగులో అధిక దిగుబడి రావాలంటే కాలిబాటలు వేస్తే పంటకు వెలుతురు, గాలి తగలడంతో పాటు, తెగుళ్ల నివారణకు దోహదపడుతుందన్నారు. తుపాన్ సమయంలో గాలులకు తట్టుకుని పంట నేలకొరకుండా ఉంటుందన్నారు. ఈ విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. ఆయన వెంట ఎంపీఈవోలు సాగర్, శ్రీనివాసరావు, సత్యనారాయణ ఉన్నారు.



కాలిబాటలను పరిశీలిస్తున్న ఏవో

## మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయండి



బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

రాజాంఅర్బన్: సినీ నటుడు చిరంజీవి జన్మదినం ఆగస్టు 22న జరగనున్న నేపథ్యంలో అమృత ఆసుపత్రిలో ఈనెల 19న నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ గార రవిప్రసాద్, చిరంజీవి అభిమాన సంఘం నాయకులు జి.కొండలరావు, పి. చంద్రశేఖర్ కోరారు. బుధవారం ఆసుపత్రి ఆవరణలో బ్రోచర్ విడుదల చేశారు. యువతీ, యువకులు ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, వి.శ్రీనివాసరావు, కె.జనార్దన, పి.సాయికుమార్, టి.అమర్ తదితరులు ఉన్నారు.

## మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ సంఘ నాయకులు

సంతకవిటి: సీపీఎస్ విధానం రద్దు, ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పద్ధతిలో పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటిన రాజధాని అమరావతిలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని సీపీఎస్ మండల శాఖాధ్యక్షుడు దూబ కిషోర్‌కుమార్ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మిలియన్‌మార్చ్‌లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ సభ్యులు దూబ త్రినాథ, జి.చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్నబీమా నగదు అందజేత

రాజాంరూరల్: పట్టణంలోని కస్పావీధికి చెందిన అల్లాడ శ్రీనివాసరావు పచ్చకామెర్ల వ్యాధితో బుధవారం మృతి చెందాడు. ఆయన భార్య ఖగేశ్వరమ్మకు చంద్రన్నబీమా తక్షణ సాయం రూ. 5 వేలను సీవో వెంకటరావు, దానయమ్మ, మణి, టీపీఆర్వో కామేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో బెజ్జి గౌరునాయుడు తదితరులు ఉన్నారు.

## ఆన్‌లైన్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ

**శ్రీకాకుళం సిటీ:** పండిట్ రవిశంకర్ గురూజీ, ఆర్ట్ఆఫ్ లివింగ్ సెంటర్, బెంగుళూరు నుంచి ఆన్‌లైన్‌లో ఈనెల 18,19,20 తేదీల్లో హ్యాపీనెస్ ప్రోగ్రామ్ శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీకాకుళం కన్వీనర్ కెఎస్ఎన్ మూర్తి ప్రకటనలో తెలిపారు. సుదర్శన్ క్రియ అనే ఈ టెక్నిక్ ని గురూజీ ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రం ప్రభుత్వ మహిళాకళాశాలలో సాయంత్రం 5:30 నుంచి 8:30 వరకు జరుగుతుందన్నారు. విశాఖ బి కాలనీ సాయిబాబా గుడి ఎదురుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 9440332380, 9985034758 నెంబర్లను సంప్రదించాలన్నారు.



తాగునీటి కోసం మహిళల బారులు



ట్యాంకర్ వద్ద బిందెల క్యూ

### వాంబే కాలనీలో

# తాగునీటి కష్టాలు

**మరమ్మతుకు గురైన పబ్లిక్ కొళాయిలు**

**ట్యాంకర్ నీటికోసం పడిగాపులు**

**పట్టించుకోని కార్పొరేషన్**



నీటి కోసం వడివడిగా..

**వాంబేకాలనీ (శ్రీకాకుళం సిటీ):** శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం సముదాయానికి చేరువగా ఉన్న వాంబేకాలనీలో ప్రజలకు తాగునీటికష్టాల పరంపర కొనసాగుతోంది. నగర నిరుపేదల కోసం గతంలో ప్రభుత్వం ఈ కాలనీని నిర్మించింది. కానీ.. ఇక్కడ కాలనీ వాసులకు నీటిసదుపాయం కల్పించలేదు. పబ్లిక్ కొళాయిలు ఏర్పాటు చేసినా వాటి నుంచి చుక్కనీరు రావడంలేదు. కొళాయిలు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఇదిలా ఉండగా.. వాంబేకాలనీలో ఏఒక్కరికీ వ్యక్తిగత కొళాయిలు మంజూరు చేయలేదు. ఫలితంగా కాలనీవాసులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రోజూ నగరపాలక సంస్థ ట్యాంకర్ ద్వారా వాంబే కాలనీకి తాగునీటి అందిస్తోంది. ట్యాంకర్ వచ్చే సమయంలో నీరు పట్టుకునేందుకు కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. మహిళలతోపాటు పురుషులు సైతం ట్యాంకర్ రాకకోసం ఎదురుచూసే పరిస్థితి. ఎల్లప్పుడూ కలసిమెలసి ఉండే ఇక్కడి ప్రజలు నీటివద్దకు వచ్చేటప్పటికి మాత్రం తగాదాలు పడాల్సిన అనివార్యస్థితి ఉంది. నగరపాలక సంస్థకు అమృతపథకంలో పదివేల వ్యక్తిగత కొళాయిలు వేస్తున్న నేపథ్యంలో వాంబేకాలనీ ప్రజలకు ప్రాధాన్యమిచ్చి.. వారి తాగునీటి కష్టాలు నిలువరించాల్సిన అవసరం కార్పొరేషన్ పాలకులపై ఉంది.


ట్యాంకర్‌ని చుట్టే ముట్టి..

### 'దళితులపై అనుచిత వ్యాఖ్యలకు

## మంత్రి క్షమాపణ చెప్పాలి'


మాట్లాడుతున్న బేసి మోహనరావు

**శ్రీకాకుళం సిటీ:** రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులపై చేసిన అనుచితమైన వాఖ్యలు దళితులను కించపరచడమేనని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బేసి మోహనరావు అన్నారు. దళితులపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అందుకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆదినారాయణరెడ్డి మంత్రి పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన లేక రిజర్వేషన్లపై మాట్లాడుతూ... గత 70 సంవత్సరాల నుంచి రిజర్వేషన్లు లబ్ధిపొందుతున్న దళితులు శుభ్రంగా ఉండరని, సరైన భాష మాట్లాడరని, నిరుపేదలని వ్యంగ్యంగా మాట్లాడుతూ.. యావత్తు దళితులకు తీవ్ర పదజాలంతో కించపరచడం తగదన్నారు. సమావేశంలో దళిత నాయకులు వి.ప్రతాప్, శ్రీను, కె.రామారావు, నాగపండు, ఎం.రామారావు, బలగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

**మంత్రి ఆదినారాయణ రెడ్డిని బర్తరఫ్ చేయాలి...**

దళితులపై దారుణ వ్యాఖ్యలుచేసిన మంత్రి ఆదినారాయణ రెడ్డిని బర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కలివర పు సింహాచలం డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఇలిసిపురం అంబేద్కర్ విజ్ఞాన్‌భవన్ లో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మలమడుగు ఆసుపత్రి సమావేశంలో మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసి దళితుల మనోభావాలు దెబ్బతీశాయన్నారు. తక్షణమే మంత్రి పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీకాకుళం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కంఠ వేణు, ప్రతినిధులు నల్లబారిక శ్రీను, కె.చిరంజీవరావు, కె.వెంకటరావు, డి. జగన్నాథరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దళిత నాయకులు

# స్ఫూర్తి చాటిన స్నేహితుల బృందం

**● న్యూకాలనీలో రహదారికి మరమ్మతులు ● యువతకు ఆదర్శం**



రహదారిపై సిమెంట్ పలకలు సరిచేస్తున్న యువకులు

**న్యూకాలనీ (శ్రీకాకుళం సిటీ):** ప్రధాని మోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛ భారత్‌ను అమలు చేసి చూపించారు శ్రీకాకుళం నగరానికి చెందిన యువకులు. అక్కడున్న రహదారిని స్వచ్ఛందంగా బాగుచేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. నగరంలోని న్యూకాలనీ జంక్షన్‌లోని రోడ్డు మధ్యలో సిమెంట్ పలక విరిగినట్లు గుర్తించారు. గత కొన్నినెలలుగా పాదచారులకు, వాహనచోదకులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులు చూస్తునే ఉన్నారు. నగరపాలక యంత్రాంగం ఎంతకీ దాన్ని సరి చేయకపోవడంతో ఆందోళన చెందిన న్యూకాలనీ లోని స్నేహితుల బృందం ఎస్.శివరాం, ఐ.చిట్టిబాబు, ఎ.శ్రీను, ప్రసన్నకుమార్ తదితరులు మంగళ, బుధవారాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛభారత్ నినాదంతో రహదా రిని బాగుచేశారు. విరిగిపోయిన సిమెంట్ పలకను స్థానికుల సాయంతో సరిదిద్దారు. ఈ స్నేహితుల బృందం గతంలో కూడా న్యూకాలనీలో ఈ తరహాలో కొన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టింది. ఈ నలుగురు యువకుల చొరవను న్యూకాలనీ వాసులు మనసారా అభినందించారు.

### మాజీ ఎంపీటీసీ సభ్యుడికి

## పితృవియోగం

**పరామర్శించిన మాజీ మంత్రి గుండ**

**శిలగాం-సింగువలస(శ్రీకాకుళం రూరల్) :** శిలగాం-సింగువలస మాజీ ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు చిన్నారావు తండ్రి కింజరాపు ఎర్రయ్య బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ మృతుడి స్వగ్రామినిక చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతోపాటు ఎంపీపీ ప్రతినిధి గొండు శంకరరావు, సర్పంచ్ కంచు దశరధుడు, ఎంపీటీసీ కంచు రమణమ్మవసంతరావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాజీ ఎంపీటీసీ కింజరాపు చిన్నారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


చిన్నారావుని ఓదారుస్తున్న గుండ

## 'ఆత్మీయ సమ్మేళనం ఓ బూటకం'


సమావేశంలో మాట్లాడుతున్న రొక్కం

**శ్రీకాకుళం సిటీ:** కాపుల రిజర్వేషన్ విషయమై మంజునాథ కమీషన్ నివేదిక రాగానే మంత్రి మండలి ఆమోదించి కేంద్రానికి పంపిస్తామన్న ముఖ్యమంత్రి వాఖ్యలు హాస్యాస్పదం అని జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షులు రొక్కం సూర్యప్రకాశరావు విమర్శించారు. ఈమేరకు బుధవారం నగరంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లగా ఇదే మాదిరిగా చెబుతున్నారని, ఇటీవల జస్టిస్ మంజునాథ్ నోటి ద్వారా ఈ కమీషన్ కాపుల కోసం కాదని చెప్పడం అందరికి తెలిసిందేనన్నారు.ముద్రగడ నేతృత్వంలో 13 జిల్లాల తెలగకాపు, బలిజ, ఒంటరి అనే కాపు జాతి అంతా ముద్రగడకు అండగా నడుస్తుంటే వారిని విస్మరించి, డమ్మీ కాపులతో ముఖ్యమంత్రి తొత్తులతో ఆత్మీయ సమ్మేళనం చేయించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అసలైన కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడతో పాటు 13జిల్లాల కాపు నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి హామీలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్వచ్ఛభారత్

**కలెక్టరేట్ :** నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం డిప్యూటీ సీటీఎం కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. కాంప్లెక్స్ ఆవరణలో పలుచోట్ల పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కాంప్లెక్స్ ఆవరణలో శుభ్రం చేయడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఇక నుంచి కాంప్లెక్స్‌లో తరుచూ స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, జి.అనంతరాములు, అమర సింహుడు, శ్రీనివాసరావుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లో రుణాల సందడి

● బీసీ, కాపు, మైనారిటీ, క్రిష్టియన్ లోన్లకు డిమాండ్ ● 60శాతం మంది అభ్యర్థుల హాజరు




రుణాల కోసం ఆశావహుల రద్దీ.. దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు, బ్యాంకర్లు

**శ్రీకాకుళం సిటీ:** శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ కార్పొరేషన్ల పరిధిలో రుణాల మంజూరుకు బుధవారం మౌఖిక పరీక్షలు నిర్వహించాయి. బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన మౌఖిక పరీక్షలు లభ్యర్థులు పెత్తఎత్తున తరలివచ్చారు. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 193 యూనిట్లు లక్ష్యం కాగా... 901 మంది దరఖాస్తుచేసుకున్నారు. అలాగే.. ఎస్సీ కార్పొరేషన్‌లో 504 యూనిట్లు లక్ష్యం కాగా... 345 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. కాపు కార్పొరేషన్‌కు 70యూనిట్లు లక్ష్యం కాగా... 161 దరఖాస్తులు అందాయి. మైనారిటీ కార్పొరేషన్‌లో 8 యూనిట్లు లక్ష్యం కాగా... 78 మంది దరఖాస్తులు అందజేశారు. క్రిస్టియన్ కార్పొరేషన్‌లో 7 యూనిట్లు లక్ష్యం కాగా.. 18 మంది దరఖాస్తు చేసుకున్నారు. 50శాతం ప్రభుత్వ రాయితీ, మిగిలిన 50శాతం బ్యాంకు రుణం కావడంతో యూనిట్లు పొందేందుకు యువత ఉత్సాహం చూపారు. దాదాపు రూ. 20కోట్ల మేర రుణాల అందజేసేందుకు నిర్ణయించడంతో బాపూజీ కళామందిర్ అభ్యర్థుల సందడితో కళకళలాడింది. మొత్తం మీద 60 శాతం మంది దరఖాస్తులు మౌఖిక పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ నూకేశ్వరరావు, లీడ్‌బ్యాంక్ జిల్లామేనేజర్ వెంకటేశ్వరరావు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు కేవీ ఆదిత్యలక్ష్మి, రాజారావు, పట్టణ ప్రాజెక్టు అధికారి జగన్మోహనరావు ఇంటర్వ్యూల ప్రక్రియ నిర్వహించారు. లోన్స్ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్వీ రమణ మాదిగ, చిట్టి నాగభూషణం, ఎం.వరలక్ష్మి, గొర్లె కృష్ణారావు దరఖాస్తులను పరిశీలించారు. వీరిలో అర్హులను గుర్తించి, వాస్తవంగా యూనిట్లు నెలకొల్పిన వారినే ఎంపిక చేస్తామని టీపీఆర్‌వో జగన్మోహనరావు స్పష్టం చేశారు. త్వరలోనే ఎంపికైన అర్హుల జాబితా విడుదల చేస్తామన్నారు. ఇంటర్వ్యూ ప్రక్రియకు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, మొబలైజర్లు సహకరించారు.

**అర్హులకు రుణాల మంజూరు..**

ఇంటర్వ్యూ ప్రక్రియకు జన్మభూమి కమిటీ ప్రతినిధిగా హాజరైన నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నిరంతరం శ్రమించి ప్రతి ఒక్కరికి రుణాలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. బ్యాంకులు కూడా ఇచ్చే రుణం సకాలంలో ఇచ్చి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకుండా ప్రజలు మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వనిత కార్డు పక్షోత్సవాలు పోస్టర్ ఆవిష్కరణలో డిప్యూటీ సీటీఎం

## వనిత ఫ్యామిలీ కార్డుతో బహుళ ప్రయోజనాలు

ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కుప్పిలి శ్రీనివాసరావు

**శ్రీకాకుళం సిటీ:** ఏపీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన వనిత ఫ్యామిలీ కార్డుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని శ్రీకాకుళం ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కుప్పిలి శ్రీనివాసరావు వివరించారు. వనిత ఫ్యామిలీ కార్డుకు చెందిన పోస్టర్‌ను బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 17నుంచి 31వరకు వనిత ఫ్యామిలీ కార్డు ప్రాధాన్యతా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు వనిత ఫ్యామిలీ కార్డును రూ.100, కుటుంబసభ్యులకు రూ.20 చెల్లించి మిగిలిన కుటుంబసభ్యులకు యాడ్ ఆన్‌కార్డులు మంజూరు చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్డు కాలపరిమితి రెండేళ్లని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగు వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కుటుంబసభ్యులు ఒకేసారి ప్రయాణించినా లేదా విడివిడిగా ప్రయాణించినా ప్రయాణ చార్జీలో 10శాతం రాయితీ పొందవచ్చునన్నారు. అలాగే... రూ. లక్ష ప్రమాదబీమా సౌకర్యం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ డి.ఢిల్లేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) శ్రీనివాసరావు, ఆర్టీసీ ప్రజాసంబంధాల అధికారి బీఎల్‌పీ రావు ఉన్నారు.

## బదిలీల్లో తప్పులు సరిదిద్దండి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్



కొలువుతీరిన పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

**శ్రీకాకుళం సిటీ:** ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో చోటుచేసుకున్న తప్పులు సరిదిద్దాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పప్పల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో శ్రీకాకుళం రూరల్ మండలశాఖ నూతన కార్యవర్గఎన్నిక సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ఏకీకృత సర్వీస్‌రూల్స్‌కు కొత్తకమిటీకి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందన్నారు. కొత్త కార్యవర్గం జిల్లాకే తలమానికంగా ఉండాలని, ఉపాధ్యాయులు అవసరాలకు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా రూరల్ మండలశాఖ అధ్యక్షుడిగా వ్యవహరించిన కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లాడె చంద్రశేఖరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలశాఖ బలోపేతానికి కృషిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వి.హరిశ్చంద్రుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైబీఎస్ ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం చేయండి.. ప్రాణదాతలు కండి

**పొందూరు:** ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని మండల రెడ్‌క్రాస్ కన్వీనర్ కె.శాంతారాం పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం రక్తదానంపై పలువురికి అవగాహన కల్పించారు. రక్తదానం విషయంలో ఉన్న అపోహలను విడనాడాలని కోరారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో రక్తదానంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

## 'దళితులను మంత్రి కించపరచడం సరికాదు'

**కలెక్టరేట్:** మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులను కించపరచడం సరికాదని ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంజి ఆర్.ఎజ్రా ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను కించపరిచేలా వ్యాఖ్యానించిన మంత్రి ఆదినారాయణ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత స్థానంలో ఉండి దళితులన్ని కించపరచడం అగ్రకులాల ఆదినారాయణ రెడ్డికి దురాంహకారం అని వ్యాఖ్యానించారు. మంత్రి వియ్యకుడు కేశవరెడ్డిల విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి కోట్లాది రూపాయిలు కాజేయడం దళిత కులాలకి చేతకాదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు తక్షణమే ఆదినారాయణరెడ్డిచే దళితులకి క్షమాపణ చెప్పించాలని లేకుంటే మంత్రివర్గం నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో కె.చిన్నారావు, ఎస్.చిన్నారావు, పైడి మోజెస్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళితనాయుడు ఎజ్రా

# తెలుగు వెలుగు బస్సులే.. విశాఖ నాన్‌స్టాప్‌లు

● సెలవుల అనంతరం ప్రయాణికులకు చేదు అనుభవం
● ప్రయాణికుల రద్దీని సొమ్ముచేసుకునే యత్నం

నాలుగురోజుల వరుస సెలవులు ఆర్టీసీకి బాగా కలిసొచ్చాయి. జిల్లాకు చెందిన దూరప్రాంత ప్రజలు రాకపోకలతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. సెలవులు అనంతరం వలస జీవులు, విద్యార్థులు, ఉద్యోగులు తాము పనిచేస్తున్న ప్రాంతాలకు బుధవారం తిరుగుముఖం పట్టేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. పెద్దఎత్తున ప్రయాణికులు ఒకేసారి రావడంతో దూరప్రాంతాలకు వెళ్లేవారి సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయలేకపోయింది. ప్రత్యామ్నాయంగా విశాఖ నాన్‌స్టాప్ సర్వీసులను తెలుగువెలుగు బస్సులతో నడిపింది. ఏ మాత్రం సౌకర్యాలు లేని ఆ బస్సుల్లో అనివార్యస్థితిలో ప్రయాణించిన ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు - శ్రీకాకుళం సిటీ



టిక్కెట్ కౌంటర్‌లో రద్దీ



బస్సు కోసం ఎదురుచూపు..




విశాఖ నాన్‌స్టాప్‌గా పల్లె వెలుగు బస్సు



## ముమ్మరంగా ఎంఆర్ వ్యాక్సినేషన్

కె-మత్స్యలేశం(గార) : కె-మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం) పరిధిలోని శ్రీబుద్ధాస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం కళింగపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వెంకటరావు ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బి.ఎర్రన్న, ప్రిన్సిపాల్, సిబ్బంది, వైద్యసిబ్బంది ఉన్నారు.



## 'మధ్యాహ్న'కార్మికుల పొట్ట కొడితే పోరాటమే..

**పొందూరు:** మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా ఏళ్లతరబడి కొనసాగుతున్న వారి పొట్టలు కొట్టేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. అదే జరిగితే ప్రభుత్వంపై పెద్దఎత్తున పోరాటం తప్పదని మధ్యాహ్న భోజన పథకం జిల్లా ఉపాధ్యక్షురాలు రాంబిల్లి అంజలి హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరలు పెరుగుతున్నా దానికి అనుగుణంగా ప్రభుత్వం నిధులు పెంచకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలను ఆపకపోతే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**ఆమదాలవలస:** ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వెళ్లే రోడ్డు మలుపులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు గాయాల పాలయ్యాడు. పురుషోత్తపురం నుంచి కల్లేపల్లి శ్రీను ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి.. అదే సమయంలో గుణుపూర్ నుంచి నరసన్నపేట వైపు అట్టల లోడుతో వస్తున్న మినీ లారీ... ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో లారీ.. ద్విచక్ర వాహనంతో పాటు యువకుడిని కొంత దూరం లాక్కొని వెళ్లింది. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.

## 'రైతులకు అన్యాయం జరగదు'

**పొందూరు:** మడ్డువలస రెండోదశ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రస్తుత ధరల ఆధారంగా నిబంధనల మేరకు నష్ట పరిహారం చెల్లిస్తారని భూసేకరణ యూనిట్-4 ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గౌతకుమారి చెప్పారు. కాలువ నిర్మాణంలో భాగంగా రాపాకపక్కనున్న భూములను గుర్తించారు. ప్రస్తుతం ఇక్కడ భూముల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని గృహ నిర్మాణాలకు అనుగుణంగా ఉన్న భూమి కావడంతో ఎక్కువ ధర పలుకుతోందని రైతులు అధికారులకు తెలిపారు. నష్ట పరిహారం విషయం జిల్లా అధికారులు చూస్తారని రైతులకు ఎలాంటి నష్టం జరగదని భరోసా ఇచ్చారు. భూముల గుర్తింపులో సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఆర్ఐ ఈశ్వరరావు, మడ్డువలస ఏఈ నాగన్న తదితరులు ఉన్నారు.

## కార్పొరేషన్ల ద్వారా రుణాలు టీడీపీ ఘనతే

**పొందూరు:** వివిధ కార్పొరేషన్ల ద్వారా యువతకు రుణాలు అందిస్తున్న ఘనత టీడీపీదేనని జడ్పీటీసీ సభ్యుడు లోలుగు శ్రీరాములు నాయుడు, జన్మభూమి కమిటీ మండల సభ్యుడు జీహెచ్ రామ్మోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణమేళా నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ రుణాల లక్ష్యం 146 యూనిట్లకు గాను 670 మంది, ఎస్సీ కార్పొరేషన్ రుణాల లక్ష్యం 42 యూనిట్లకు 215 మంది, ఎస్టీ కార్పొరేషన్ రుణాల లక్ష్యం 2 యూనిట్లకు 28 మంది, కాపు కార్పొరేషన్ రుణాల లక్ష్యం 15 యూనిట్లకు 107 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి వివిధ కార్పొరేషన్ల, బ్యాంకు అధికారుల సమక్షంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, బీసీ కార్పొరేషన్ అధికారి జి.గోపి, బ్యాంకుల అధికారులు మురళీకృష్ణ, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గార మండల అధికారుల ఫోన్ నంబర్లు

| | | |
|---|---|---|
| ఎ.సింహాచలం | తహసీల్దారు | 8499886055 |
| పక్కి కాంతారావు | ఎంపీడీవో | 8790007906 |
| బి.గణేష్ | సబ్ ఇన్‌స్పెక్టర్ | 9440795821 |
| పైల నవీన్ | వ్యవసాయాధికారి | 8886612700 |
| రామ్మోహనరావు | ఈవోపీఆర్డీ | 8978914770 |
| జి.శ్రీధర్ | వెలుగు ఏపీఎం | 8008803885 |
| సీహెచ్ నారాయణరావు | ఏపీవో | 8790007882 |
| ఎం.భాస్కరరావు | ఎంఈవో | 9502599890 |
| ఫణీంద్రకుమార్ | ట్రాన్స్‌కో ఏఈ | 9440812431 |
| శంకరరావు | హౌసింగ్ ఏఈ | 7093930244 |
| పి.గోవిందరావు | మండల ఇంజనీర్ | 9441478870 |
| సీహెచ్ గోవిందరావు | ఆర్అండ్‌బీ ఏఈ | 9440416921 |
| కె.నారాయణమూర్తి | పశు వైద్యాధికారి | 9985109363 |
| డాక్టర్ పి.జగదీష్ | ఆయుష్ వైద్యులు | 9493764553 |

# చేనేతకు పూర్వ వైభవం

● ఎంపీ రామ్మోహన్‌నాయుడు ● శ్రీకాకుళంలో చేనేత విక్రయశాల ప్రారంభం



చేనేత విక్రయశాల ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే

(శ్రీకాకుళం సిటీ)

చేనేతలో పొందూరు జాతీయఖ్యాతిని పొందిందని.... అదంతా గత వైభవంగా మిగిలి పోకూడదని... చేనేతకు తిరిగి జవసత్వాలు తీసుకొద్దామని శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆకాంక్షించారు. చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం శ్రీకాకుళం చౌక్‌బజార్‌లో చేనేత విక్రయశాలను ఆయన స్థానిక ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చేనేత కార్మికులను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వ ఉద్యోగితో పాటు ప్రజలు కూడా చేనేత ధరించాలని సూచించారు. చేనేత వస్త్రాలు హుందాతనంతో పాటు శరీరాన్ని సురక్షితంగా ఉంచుతాయని వివరించారు. ధరకూడా సామాన్యప్రజలకు అందుబాటు లో ఉంటున్నందున చేనేతపై అన్నివర్గాలు మొగ్గుచూపాలన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కట్టుబడిఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా విక్రయశాలలో అం దుబాటులో ఉన్న వస్త్రాలు, తయారుచేసే విధానం నమూనాలను గురించి ఎంపీ, ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ

# కాలిబాటలతో పంటకు మేలు

● వ్యవసాయాధికారి నవీన్ ● వత్సవలసలో 'పొలం-పిలుస్తోంది'

**వత్సవలస (గార) :** కాలిబాటలు తీయడం ద్వారా వరి పంటకు ఎంతో మేలు జరుగుతుంది. దిగుబడి పెరిగి రైతుకు ఆర్థికంగా ఉపయోగకరంగా ఉంటోందని మండల వ్యవసాయాధికారి పైల నవీన్ వివరించారు. వత్సవలసలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి బొజ్జమ్మ వ్యవసాయ క్షేత్రంలో కాలిబాటలు తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులు సేంద్రియ వ్యవసాయం అవసరాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. వరినాట్లు వరుసల్లో నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.

● **ఇవీ ప్రయోజనాలు..**

వరి పంటలో కాలిబాటలు తీయడం వల్ల పైరుకు గాలి, సూర్యరశ్మి బాగా తగలడం వల్ల తెగుళ్లు, పురుగుల ఉధృతి తగ్గించవచ్చునన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులను పిచికారీ చేసేందుకు వీలుగా ఉంటుందని వివరించారు. కలుపు నియంత్రణలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల ఎకరానికి 2-3 బస్తాలు దిగుబడి పెరుగుతోందన్నారు. అందువల్ల ప్రతి రైతు తమ పొలాల్లో కాలిబాటలు తీసి మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులను కలిసి కాలిబాటలు వల్ల మేలు గురించి ఎప్పటికప్పుడు వివరిస్తున్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎరుకునాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వత్సవలసలో కాలిబాటలు తీయిస్తున్న వ్యవసాయాధికారి నవీన్

# రెవెన్యూ కార్యాలయానికి ఎట్టకేలకు భవనం మంజూరు


**గార :** గార మండల రెవెన్యూ కార్యాలయానికి ఎట్టకేలకు కొత్త భవనం మంజూరైంది. దీంతో అటు అధికారులు.. ఇటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవస్థ ఏర్పడి మూడు దశాబ్దాలు కావస్తున్నప్పటికీ గార రెవెన్యూ కార్యాలయానికి పూర్తిస్థాయిలో వసతి సమకూరని పరిస్థితి ఇక్కడ ఉంది. తొలుత కుమ్మరిపేటలో రెవెన్యూ కార్యాలయాన్ని అద్దెభవనంలో ప్రారంభించారు. అక్కడ నుంచి గారలో మరో ప్రైవేట్ భవనంలోకి తరలించారు. అక్కడా అరకొర వసతుల మధ్య నిత్యం రెవెన్యూ సిబ్బందితో పాటు కార్యాలయానికి వివిధ పనులపై వచ్చేవారంతా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దాంతో అక్కడ నుంచి గ్రామ చావడిలోకి మండల రెవెన్యూ కార్యాలయాన్ని తరలించారు. ఇక్కడ కొత్తగా రెండు చిన్న భవనాలను నిర్మించినప్పటికీ కార్యాలయానికి వసతి సమస్య తీరలేదు. ఇక్కడ సైతం కేవలం రెండు చిన్న గదుల్లో సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. నిత్యం ఈ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చేవారు వరండాలపైన చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చేది. ఇక్కడ సమస్యలపై పలుదపాలు పత్రికల్లో కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో ప్రభుత్వం ఎట్టకేలకు కొత్తభవనాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా. మన్మోహన్‌సింగ్, సీసీఎల్ఏ జీఓఆర్‌టీ నెంబర్-813తో ఈనెల 7న ఇందుకు సంబంధించిన జీవో విడుదల చేశారు. ఈమేరకు జిల్లాలో సొంత భవనాలు అవసరం ఉన్నచోట నిర్మాణాలు చేపట్టుకోవాలంటూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ప్రస్తుత రెవెన్యూ కార్యాలయం ఇదే..

● **అధికారులు దృష్టికి తీసుకెళ్లాం..**

జిల్లా అధికారులు ఆదేశాల మేరకు మండల రెవెన్యూ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి అవసరమైన స్కెచ్, ఇతర వివరాలను జిల్లా అధికారులకు పంపడం జరిగింది. ప్రభుత్వం కూడా ఇటీవల పరిపాలనామోదం తెలుపుతూ జీవో విడుదల చేసింది. ఎ.సింహాచలం, తహసీల్దార్-గార



## రేపు ఎస్ఆర్‌కేపురంలో ఎన్టీఆర్ వైద్య శిబిరం

**నందిగాం:** మండలంలోని హర్షబాడ పంచాయతీ పరిధి సవరరామకృష్ణాపురంలో శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య సేవ కింద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆరోగ్యమిత్ర గిరిజా పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం స్థానిక పాఠశాల ఆవరణలో జెమ్స్, గొలివి ఆసుపత్రుల నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని, సవరరామకృష్ణాపురంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# ఈ రోడ్డుపై ప్రయాణించేదెట్లా?

**బోరుభద్ర(సంతబొమ్మాళి):** డీపీఎన్ రోడ్డులో బోరుభద్ర వద్ద ఇటు గొయ్యి, అటు నీరు వాటి మధ్యలో ఎలా ప్రయాణించాలంటూ వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డులో ఇటీవల నిర్మాణ పనులు చేపట్టినప్పుడు గతంలో ఉన్న కల్వర్టు మూసేశారు. దీంతో వర్షపు నీటితో పాటు వంశధార నీరు రోడ్డుమీద నుంచే ప్రవహిస్తోంది. 20 రోజుల క్రితం వర్షపు నీరుతో రోడ్డు సగం కొట్టుకుపోయింది. అయినా ఇంత వరకు ఆర్అండ్‌బీ అధికారులు గండిని పూడ్చలేదు. దీంతో వంశధార కాలువ నీరు రోడ్డు పైనుంచే ప్రవహిస్తోంది. దీంతో ఇటు గొయ్యి, అటు నీరు ఉండడంతో వాటి మధ్య ప్రయాణం సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఈ రహదారిలో ప్రయాణించే వారు ఇక్కడ ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ ప్రమాదం పొంచివుందని ప్రయాణికులు అంటున్నారు. రోడ్డు ఇంత అధ్వానంగా ఉన్నా గండిపూడ్చడానికి ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై ఈ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. రెండు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ రహదారిలో కనీస స్థాయిలో భద్రత లేకుండా పోతుండడంపై వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పరిస్థితిపై పత్రికల్లో కథనాలు వస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శిస్తున్నారు. ఇక్కడ ప్రమాదం జరగకముందే ఆర్అండ్‌బీ అధికారులు కల్వర్టుతో పాటు గండి పూడ్చి ప్రమాదాలను నివారించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



బోరుభద్ర వద్ద ప్రమాదకరంగా మారిన డీపీఎన్ రహదారి

## మండలానికి చేరిన చెత్త సేకరణ రిక్షాలు

**నందిగాం:** మండల కేంద్రం నందిగాంలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న చెత్త నుంచి సంపద కేంద్రానికి చెత్త సేకరణకు సంబంధించి రిక్షాలు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. ప్రతి వీధికి రిక్షాలను ఏర్పాటుచేసి చెత్తను సేకరించే నిమిత్తం వీటిని తీసుకువచ్చినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సేకరణ కేంద్రానికి ఏర్పాటుచేసిన అంబాసిడర్లకు వీటిని అందిస్తామని తెలిపారు.



మండల కార్యాలయంలో సిద్ధంగా ఉన్న రిక్షాలు

## 'దమ్ములోనే భాస్వరం వాడాలి'

**కణితివూరు(నందిగాం):** దమ్ములోనే భాస్వరం ఎరువును వాడాలని మండల ఏఈవో పి.సురేష్ రైతులను సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కణితివూరు, కామధేనువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి మాట్లాడారు. సాగులో వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటిస్తే అత్యధిక దిగుబడులు సాధించగలరని చెప్పారు. పొలంలో కాలిబాటలు వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని, గాలి, వెలుతురు ప్రవహించి తద్వారా దోమపోటును నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు హారతి, మానస తదితరులు పాల్గొన్నారు.

## 'హడ్డుబంగి గెడ్డ ఆక్రమణలను తొలగించాలి'

**కొత్తూరు:** సర్వే నెంబర్ 257 హడ్డుబంగి గెడ్డ ఆక్రమణను తొలగించాలని గ్రామానికి చెందిన లోకేశ్వరరావు బుధవారం కలెక్టర్ ధనుంజయరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ గెడ్డను గ్రామానికి చెందిన ఒక భూస్వామి ఆక్రమించినట్లు ఆయన కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ గెడ్డ ఆక్రమణలకు గురైనట్టు తహసీల్దార్ గతంలో ధ్రువీకరించారని, అయినప్పటికీ ఆక్రమణలు తొలగించకపోవడంతో రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి గెడ్డ ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇక్కడ అన్ని సీజన్లలోనూ బురదమయమే



జర్జంగి వద్ద రోడ్డుపై పారుతున్న నీరు

**జర్జంగి(కోటబొమ్మాళి):** జర్జంగి జంక్షన్ నుంచి చల్లపేట వెళ్లే రోడ్డులో దుప్పలపాడు జంక్షన్ సమీపంలో నిత్యం గోతులు నీటితో నిండి ఉంటున్నాయి. ఇక్కడ వర్షం పడకపోయినా ఎప్పుడూ బురదమయమై ఉంటుంది. అవతలి వైపు పొలం నుంచి ఇవతలి వైపు పొలంకు రోడ్డుపై నుంచే నీరు ప్రవహిస్తుండడం, నిత్యం వాహనాల రాకపోకలతో ఇక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడి నీటితో నిండిపోతున్నాయి. రైతులు గానీ, సంబంధిత అధికారులు గానీ ఇక్కడ ఒక పైపును ఏర్పాటుచేసి ఉంటే రోడ్డు ఇంతగా పాడై ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ పైపును ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నంద్యాలలో ఎమ్మెల్యే కలమట ప్రచారం

**పాతపట్నం:** కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థికి మద్దతుగా పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకట రమణ మూర్తి విస్తృత స్థాయి ప్రచారాన్ని చేపట్టారు. బుధవారం ఆయన నంద్యాలలోని 22వ వార్డులో వార్డు సభ్యులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఉప ఎన్నికలో టీడీపీ విజయం తథ్యమని కలమట ఫోన్‌లో స్థానిక విలేఖరులకు తెలిపారు. ఈ ప్రచారంలో పాతపట్నం నియోజకవర్గానికి చెందిన పొన్నాన వెంకటరమణ, కొమరాపు చిరంజీవి, గేదెల జగన్‌మోహన్‌రావు, ప్రశాంత్, పొత్రకొండ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎం బదిలీ రద్దు చేయాల్సిందే

**● ఫిర్యాదు, దర్యాప్తు నివేదిక బహిర్గతం చేయండి ● విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్ ● పాఠశాలకు తాళం వేస్తామని హెచ్చరిక**

**జయపురం(నందిగాం):** రాంపురం పంచాయతీ పరిధి జయపురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పనిచేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లభ మల్లయ్య బదిలీని వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గిరిజన, యువజన సంఘ నాయకులు ఆందోళనకు దిగారు. నిబంధనల మేరకు మెనూ అమలుచేస్తూ, విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ మంచిపేరు తెచ్చుకున్న మల్లయ్య మాస్టార్‌ను రాజకీయ దురుద్దేశంతో బదిలీ చేయడం తగదని ఆందోళనకారులు అన్నారు. వెంటనే బదిలీ రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని, అవసరమైతే పాఠశాలకు తాళాలు వేసి, విద్యార్థులను ఇళ్లకు తీసుకువెళ్తామని హెచ్చరించారు.

ఉప విద్యాశాఖాధికారిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మల్లయ్యను మందస మండలం పుట్టలోగాం ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా, గిరిజనేతర వ్యక్తి చేసిన తప్పుడు ఫిర్యాదుకు గిరిజన సంక్షేమాధికారులు బోల్తాపడి బదిలీ చేయడం మంచి పద్ధతి కాదని జిల్లా గిరిజన సంఘ అధ్యక్షుడు గేదెల వెంకటరమణ, ఎస్టీ సెల్ ప్రతినిధి రాంపురం పోతయ్య, స్థానిక వెంకటేశ్వర యువజన సంఘం ప్రతినిధి దాసుపురం సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టించి గిరిజన సంక్షేమాధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చినా ప్రత్యేక మెసేంజర్ ద్వారా బదిలీ ఉత్తర్వులు పంపించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు గతంలో వచ్చిన ఫిర్యాదును, దర్యాప్తు నివేదికను ప్రజా దర్బారు ద్వారా బయట పెట్టాలని వారంతా డిమాండ్ చేశారు.




జయపురం ఆశ్రమ పాఠశాల ఎదుట నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

## ఆ అంగన్‌వాడీ కేంద్రానికి ఎప్పుడూ సెలవులే

**ముకుందపురం(మెళియాపుట్టి):** గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందివ్వాలని లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నా కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలను సరిగ్గా తెరవడం లేదు. కొంత మంది అంగన్‌వాడీ కార్యకర్తలు వేరే మండలం నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. మండలంలోని ముకుందపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా కార్యకర్త రాక ఆయా లేక కేంద్రంలో కోళ్లు ఉండడం కనిపించింది. అయితే ఆయా తులసమ్మ మాత్రం పదిమంది పిల్లలకు తమ ఇంటి వద్ద వంటచేసి భోజనం పెడుతున్నట్లు తెలిపారు. కార్యకర్త కళావతి పాతపట్నం నుంచి వస్తూ ఉంటారని, ఈ రోజు మాత్రమే రాలేదని తులసమ్మ తెలిపింది. ప్రతిరోజూ కేంద్రం తెరిచి ఉంచుతారే తప్ప అక్కడ పౌష్టికాహారం అందే పరిస్థితి లేనట్లు ఉంది. ఏది ఏమైనప్పటికీ పౌష్టికాహారం గిరిజనులకు సక్రమంగా అందకపోవడంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



ముకుందపురం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బదులుగా ఉన్న కోళ్లు

# ఉపాధి బిల్లులు చెల్లించేదెప్పుడు?

**నందిగాం:** నెలలు తరబడి పనిచేసినా ఉపాధి బిల్లులు చెల్లించకపోతే ఎలాగని ఉపాధి వేతనదారులు అధికారులను ప్రశ్నించారు. బుధవారం జడ్పీటీసీ సభ్యుడు కురమాన బాలకృష్ణారావు, యర్ర చక్రవర్తి నేతృత్వంలో నందిగాంకు చెందిన పలువురు వేతనదారులు ఎంపీడీవో పి.రాంబాబు, ఏపీవో ధనుంజయరావులను నిలదీశారు. మార్చి 14 నుంచి స్థానికంగా ఉన్న పలు చెరువుల్లో 192 మంది పనులు చేపట్టినా నేటికీ బిల్లులు పడకపోవడానికి గల కారణాలు ఏమిటంటూ ప్రశ్నించారు. ఎప్పుడు అడుగుతున్నా వారం, పది రోజులంటూ సమాధానం చెబుతున్నారు తప్ప వేతనదారులకు వేతనాలు అందించకపోవడం తగదని అన్నారు. గతనెలలో స్థానికంగా జరిగిన అవగాహన సదస్సులో అధికారులను ప్రశ్నిస్తే పది రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే 20 రోజులు గడిచినా దాన్ని అమలుచేయకపోవడం విచారకరమని అన్నారు. కె.అప్పలస్వామి, కె.పున్నయ్య, ఎన్.మల్లేస్, ఎ.నాయుడు, కె.అప్పడు, ఎం.చిలకయ్య తదితర వేతనదారులు తమ ఆవేదన వెళ్లగక్కుతూ ఉపాధి ద్వారా కుటుంబ జీవనోపాధి లభిస్తుందనుకుంటే నెలలు తరబడి వేతనాలకు నోచుకోక అవస్థలు పడాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యను సకాలంలో పరిష్కరించకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.రాంబాబుకు బాలకృష్ణారవు సూచించారు. వీరి వెంట జె.జయరాం తదితరులు ఉన్నారు.

## టెక్కలిలో సినిమాలు

| | |
|---|---|
| సుదర్శన్ | : నేనే రాజు నేనే మంత్రి |
| భవాని | : జయ జానకి నాయక |

**కోటబొమ్మాళిలో..**

| | |
|---|---|
| శివకృష్ణ | : లై |
| అనుపమ | : నేనే రాజు నేనే మంత్రి |

## ఉక్కపోతతో ప్రజలు విలవిల

**సంతబొమ్మాళి:** ఉక్కపోతతో మండలంలో ప్రజలు విలవిల్లాడుతున్నారు. వర్షాకాలంలోనూ ఎండలు మండుతుండడంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనుల్లో రైతులు పొలాల్లో బిజీగా ఉన్నారు. మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినుకు జాడే లేకపోవడంతో చాలా గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఏటా ఆగస్టులో విస్తారంగా కురిసే వర్షాలు ఈ ఏడాది కనీస స్థాయిలో పడలేదు. దీనికితోడు ఉక్కపోత పెరిగిపోవడంతో జనాలు పలు ఇబ్బందులు పడుతున్నారు.

# చినుకుపడితే మురికికూపమే

**టెక్కలి:** రెవెన్యూ డివిజన్ కేంద్రం టెక్కలిలో చినుకుపడితే చాలు రోడ్లన్నీ మురికికూపాలుగా తయారవుతున్నాయి. కాలువల నిర్మాణం పక్కాగా లేకపోవడంతో వర్షం నీరు పొంగి ప్రవహించి రోడ్లపైకి చేరుతోంది. మంగళ, బుధవారాల్లో టెక్కలి బైరివీధి ప్రాంతంలో వర్షపు నీరు కాలువల్లోకి చేరి మురుగంతా వీధిలోకి రావడంతో ఆ ప్రాంత వాసులు నానా అవస్థలు పడ్డారు. ఎప్పుడు వర్షం పడినా నరకయాతన అనుభవిస్తున్నామని వారు తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు టెక్కలిలో పలు ప్రాంతాల్లో పర్యటించినప్పటికీ తమ ప్రాంతానికి రాలేదని, ఆయన వస్తే ఈ సమస్య చెప్పేందుకు ఎదురుచూశామని బైరి వీధిలోని మహిళలు చెప్పారు. ఇక పాతజాతీయరహదారి వెంకటేశ్వర గుడి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్మించిన డ్రైనేజ్ నిరుపయోగంగా మారింది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈడ్రైనేజ్‌కి కనెక్షన్స్ కలపడంలో ఆర్అండ్‌బీ యంత్రాంగం విఫలమవడం, కాలువ నిర్మాణ పనులు ఎత్తు, పల్లాలుగా ఉండడంతో వర్షం పడితే కాలువల వెంబడి వచ్చే నీరు పాతజాతీయరహదారి మీద పొంగిపొర్లుతోంది. ఈ నీరంతా దుకాణాల సముదాయాల్లోకి, ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక శ్రీనివాస్‌నగర్‌లో పరిస్థితి మరింత అధ్వానం. పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యం మూలంగా అడ్డదిడ్డంగా కాలువల నిర్మాణాలు చేయడంతో ఎక్కడబడితే అక్కడ మురుగునీరు నిల్వవుంటోంది. ఈ పరిస్థితులు వలన వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచివుంది. ఇప్పటికైనా అధికారులు కాలువలను సరిచేసి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని టెక్కలి పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


టెక్కలి బైరివీధిలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

## టెక్కలిలో సందడిగా నందోత్సవం


చిన్నబ్రాహ్మణవీధిలో చల్లపిడత కొడుతున్న పిల్లలు

**టెక్కలి:** స్థానిక చిన్నబ్రాహ్మణవీధిలో రాధాకాంత మఠం ఆవరణలో బుధవారం నందోత్సవాన్ని మహంత్ మదన్ గోపాల్ దాస్‌జీ మహరాజ్ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. పిల్లలు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. చల్లపిడతలు కొడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో రాధాచరణ పట్నాయక్, ఎన్‌పీ పట్నాయక్, శివ, కృష్ణ ప్రధానో తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ తపాలా సేవకుల సమ్మె


సమ్మెలో పాల్గొన్న పోస్టల్ సిబ్బంది

**కోటబొమ్మాళి:** వేతన సవరణ జనవరి 1, 2016 నుంచి అమలు చేసి జీడీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం కోటబొమ్మాళి ఎస్‌వో పరిధిలో 12 పోస్టల్ బ్రాంచ్‌ల సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.మౌనిక, సిహెచ్.ఢిల్లీరావు, పి.రామ్మోహనరావు, ఎస్.భవానీశంకర్, ఆర్‌వీఆర్ చౌదరి, యు.శ్రీనివాస్, ఏవీకే కూర్మారావు, ఆర్‌టీవీ రమణమూర్తి, జి.దేవ, ఎస్.దుర్గరాజు, కె.కూర్మారావు, ఆర్.ఆనందరావు, కేవీ రత్నం, పి.వరలక్ష్మి, కె.కృష్ణమూర్తి, పి.గోపి, జె.త్యాగరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**నౌపడ(సంతబొమ్మాళి):** సత్యసాయి సేవా సంస్థ(టెక్కలి) సత్యసాయి విద్యాజ్యోతి పథకంలో భాగంగా నౌపడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 108 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. సాయి సేవలు గ్రామీణ ప్రాంతాలకు అందించాలనే ధ్యేయంతో సాయి సమితి విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీచేసినట్లు ఆర్గనైజర్ బి.మల్లేసు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.మురళీమూర్తి, హెచ్ఎం రామారావు, ప్రిన్సిపాల్ శ్యామ్, చిన్నారావు, బాలరాజు, జయకృష్ణ, లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## వరుణుడి కరుణ కోసం ఎదురుచూపు

**సంతబొమ్మాళి:** వరుణుడి కరుణ కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఆగస్టులో భారీ వర్షాలే కురుస్తాయి. కానీ ఈ ఏడాది చినుకు జాడే లేకుండా పోయింది. దీంతో మండలంలోని ఉదయపురం ప్రాంతంలో వరినారు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నెల ఇప్పటికీ కనీస స్థాయిలో వర్షాలు కురవకపోవడం, దానికితోడు వంశధార నీరు ఈ ప్రాంతానికి ఇంతవరకు చేరకపోవడంతో వరినారు పూర్తిగా ఎండిపోతోంది. ఖరీఫ్ సీజన్ మొదట్లో పడిన తొలకరి జల్లులకు కొంతమేర వరి నారు బతికినా, ఆ తర్వాత వరుణుడు మొహం చాటేయడంతో వరినారు నీరందక ఎండిపోతోంది. వాస్తవానికి వంశధార నీరు విడిచిపెట్టినా ఈ ప్రాంతానికి ఇంకా చేరకపోవడంతో రైతులు కంట కన్నీరు కనిపిస్తోంది. ఏటా ఉదయపురం ప్రాంతానికి సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది మొదట్లో వర్షాలు పడడంతో ఆనందంతో రైతాంగం వరినారు జల్లారు. అయితే నారు పెరిగినా ప్రస్తుతం అది బతికేందుకు అవసరమైన నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వ్యవసాయ మదుపులు తప్పడం లేదని తీరా సాగునీటి సమస్యతో నష్టపోవాల్సి వస్తుండడంతో ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడది కూడా తమకు నష్టాలే మిగలనున్నాయని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు.

## మెడికల్ షాపుల సంఘం కొత్త కార్యవర్గం


జగం, సూర్యనారాయణ

**టెక్కలి:** పట్టణంలోని హోల్ సేల్, రిటేల్ మందుల దుకాణాల యజమానుల సంఘ అధ్యక్షునిగా శ్రీఏజెన్సీకి చెందిన శిష్టు జగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం రాత్రి జరిగిన హోల్‌సేల్, రిటేల్ మందుల దుకాణాల యజమానుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘం కార్యదర్శిగా చౌక్కాకుల సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా డి.బాలశంకరరావును ఎన్నుకున్నారు. సమావేశంలో దుంప అప్పన్న, జామి కృష్ణ, గుప్త, ఆకుల రాంబాబు, దీనబందు, గణపతి, ఆట్ల వెంకటేశ్వరరావు, విశ్వనాథం, మహరాజ్, దుర్గారావు పాల్గొన్నారు.

## రోగులతో ఏరియా ఆసుపత్రి కిటకిట

**టెక్కలి:** వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రభావంతో మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్స్, డయేరియా తదితర వ్యాధులు ప్రబలడంతో టెక్కలిలోని ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. బుధవారం ఒక్కరోజే 200కు పైగా ఔట్‌పేషెంట్లు ఆసుపత్రిలో వైద్యసేవలు పొందారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. ఏరియా ఆసుపత్రిలో ఔట్‌పేషెంట్ విభాగాలను చూసిన వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కూడా వైద్యసేవలు అందిస్తునే ఉన్నారు. ఇక ప్రైవేట్ ఆసుపత్రులు, సంచి వైద్యులు, ఆర్ఎంపీ క్లినిక్‌ల వద్ద కూడా రద్దీగా కనిపించింది.


ఓపీ స్లిప్ కోసం క్యూలైన్‌లో ఉన్న రోగులు

## గుట్కాతో వ్యక్తి అరెస్టు

**కోటబొమ్మాళి:** అక్రమంగా గుట్కా తరలిస్తుండగా పాకివలస జంక్షన్ వద్ద కొత్తపల్లికి చెందిన దుంప ఆనందరాజును పోలీసులు అరెస్టుచేశారు. గుట్కా విలువ రూ.27వేలని ఏఎస్ఐ చంద్రరావు చెప్పారు.

# ప్రమాదం పొంచివున్నా పట్టించుకోరా?


ఆది ఆంధ్రా వీధి సమీపంలో జాతీయ రహదారిపైన ఉన్న డివైడర్‌ను రహదారిగా వినియోగిస్తున్న దృశ్యం

**టెక్కలి:** జాతీయ రహదారిపై ఆది ఆంధ్రా వీధి సమీపంలో ప్రమాదం పొంచివున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంత వాసులు డివైడర్ మీద నుంచి మార్గాన్ని ఏర్పాటుచేసుకుని నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతాన్ని పోలీసులు బ్లాక్‌స్పాట్ కేంద్రంగా గుర్తించా రు. అయితే స్థానికులు వాహన రాకపోకల కోసం జాతీయ రహదారి డివైడర్‌పై నుంచి మార్గన్ని ఏర్పాటు చేసుకుని వినియోగిస్తున్నారు.

వాస్తవానికి ఈ ప్రాంతంలో అండర్ పాసేజ్ ఉంది. అయితే అది బురదమయం కావడంతో వాహనచోదకులు అండర్ పాసేజ్ నుంచి వెళ్లేందుకు ఇష్టపడక జాతీయ రహదారి డివైడర్ పైనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో గ్రానైట్ క్వారీలు ఉండడంతో క్వారీలకు సంబంధించిన వాహనాలు, అదే మార్గంలో ఉన్న ఐదు, ఆరు గ్రామాల ప్రజలు డివైడర్‌నే రాజమార్గంగా వాడుకుంటున్నారు. ఇప్పటికే మండలం పరిధిలో బొప్పాయిపురం, విక్రంపురం తదితర ప్రాంతాల్లో డివైడర్‌పై రాకపోకలు నిషేధించిన పోలీసులు ఇక్కడ దృష్టిసారించాలని, లేదంటే అనుకోకుండా ప్రమాదాలు జరిగితే భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని స్థానికులు అంటున్నారు.